# గంజాయివనం

నవల

\- పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 228

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి డిసెంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన నవల

# (ప్రారంభం)

**చీకటి చిక్కబడింది.**

ఆకాశం నల్లచీర చుట్టుకుంది. కీచురాళ్ళ అరుపులు, హోరుగాలి. అడవిలో నిశ్శబ్ధాన్ని భగ్నం చేస్తున్నాయి.

గుబురు చెట్లతో నిండిన అడవిలో దారి లేని ప్రాంతం. కొండల నడుమ ఏపుగా ఎదిగిన చెట్ల సమూహాల మధ్య నలుగురు యువకులు ముడుచుకుని పడుకుని ఉన్నారు. వారికి దూరంగా మరో యువకుడు నిల్చుని వారికి కాపలా కాస్తున్నాడు.

అతని చేతిలో తుపాకీ. పరిసరాలను చురుగ్గా పరిశీలిస్తూ పహారా కాస్తున్నాడు. అతని చూపుల్లో తీక్షణత ఉంది. ఏ చిన్న అలికిడి అయినా ఎలర్టు అయ్యేలా స్థిరంగా ఉన్నాడు.

మరో పక్క దూరంగా వంటపాత్రలు. ఎండుకట్టెలు. మూడు రాళ్ళతో పొయ్యి ఉన్నాయి. మరోపక్క గుట్టగా తుపాకులు. వాటి పక్కన చేతి సంచులు ఉన్నాయి. వాటి నిండా పుస్తకాలు ఉన్నాయి.

వాతావరణంలో అదోలాంటి నిశ్శబ్ధం. నిశ్శబ్ధంలో కీచురాళ్ళ చప్పుడు ఉండి ఉండి వినిపిస్తోంది.

తుపాకీ పట్టుకుని నిల్చున్న యువకుడు తుపాకీని కిందపెట్టి పక్కకు వచ్చి కిందనున్న సంచిని తెరిచి అందులో ఉన్న ఫ్లాస్కుని బైటికి తీసాడు. కప్పులో టీ ఒంపుకున్నాడు.

"నిద్రవస్తోందా?"

ఆ మాటలకు యువకుడు తుళ్ళిపడ్డాడు. అంత భయంకరమైన నిశ్శబ్ధంలో వినిపించిన మాటలు అతడిని తుళ్ళిపడేలా చేసాయి.

కిందన పడుకున్న యువకుల్లో ఒక యువకుడు కళ్ళు నులుముకుని నిద్రలేచాడు. తర్వాత నిలబడి అతని దగ్గరికి వచ్చాడు. అడ్డదిడ్డంగా పెరిగిన గడ్డం, అలసట తీరని తీక్షణమైన కళ్ళు. అతని చూపుల్లో అదోలాంటి నిర్లక్ష్యం.

"శ్రీకాంత్. నాకు టీ తాగడం అలవాటులేదు. ఈ అడవుల మధ్య కొండ కోనల్లో తిరుగుతుంటే గుక్కెడు టీ నీళ్ళన్నా గొంతులో పడకపోతే ముందుకు కదలలేమేమో అనిపిస్తుంది" అన్నాడు.

శ్రీకాంత్ తాను కూడా ఒక కప్పులో టీ వంపుకుని తీసుకున్నాడు.

వేడి టీ నెమ్మదిగా తాగుతూ "ఇప్పుడు రాత్రి రెండు గంటలు అయింది. నువ్వు రెస్టు తీసుకో. తెల్లారేంతవరకు నేను చూస్తాను" అన్నాడు.

"మనకు రెస్టు ఎక్కడిది?" రెస్టు అనే పదాన్ని వత్తి పలికాడు. అతని మాటలో అదోలాంటి నిర్లిప్తత.

"పడుకో జీవన్. తిండి లేకపోయినా పర్వాలేదు. నిద్రలేకపోతే కష్టం"

శ్రీకాంత్ మాటలకు ఎదురు చెప్పలేకపోయాడు జీవన్.

తుపాకీ శ్రీకాంత్‌కు అందించి ఫేంటును సర్దుకుని పక్కనున్న చెట్టుకు నడుం వాల్చి జారగిలబడ్డాడు.

దూరంగా ఆకాశంలో ఓ పక్షి రెక్కలను టపటపా కొట్టుకుంటోంది. అడవిలో ఎక్కడో ఏదో జంతువు అరుపు అస్పష్టంగా వినిపిస్తోంది.

"ఎక్కడ మనుషులం? ఎక్కడ ఉన్నాం? ఎందుకోసం? ఎవరికోసం ఈ ప్రయాణం. దేన్ని ఆశించి ఈ పోరాటం. అతనిలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. ఉన్నట్లుండి ఏదో అలికిడి.

నిశ్శబ్దంగా ఉన్న అడవిలో చిత్రమైన ధ్వనులు. గుంపులుగా ఎవరో దూసుకుని ముందుకు వస్తున్నట్లు కదలికలు. ఎండుటాకులు విరిగి పడుతున్నట్లు కలిసికట్టుగా ఎవరో ముందుకు కదులుతూ వస్తున్నట్లు. అస్పష్టమైన అలికిడి. తమ స్థావరాన్ని పోలీసులు చుట్టుముడుతున్న భావన కలిగింది.

శ్రీకాంత్ ఎలర్టు అయిపోయాడు. తుపాకీని చేతిలోకి తీసుకున్నాడు.

అప్పుడే నిద్రలోకి జారుకుంటున్న జీవన్ దగ్గరికి వెళ్ళి "వినపడుతోందా? ఎక్కడో అలికిడి" నెమ్మదిగా అన్నాడు.

అక్కడ పడుకున్న యువకులంతా గబుక్కున లేచి కూర్చున్నారు. అటువంటి సమయంలో ఎలా రియాక్టు అవ్వాలో వారికి బాగా తెలుసు. పుస్తకాల్ని, సంచుల్ని, సామాన్లనీ పెద్ద సంచుల్లోకి వెంటవెంటనే సర్దేసుకున్నారు.

తుపాకుల్ని భుజాలకు తగిలించుకున్నారు.

"పోలీసులు కూంబింగుకు వస్తున్నారు. ఎలాగైనా తప్పించుకోవాలి. క్విక్. పరుగెత్తండి." ఆదేశంలాంటి మాటలు అందర్నీ కదిలించాయి.

దూరంగా టార్చిలైటు వెలుగు కనిపిస్తోంది.

మిడతల దండు మాదిరిగా గుంపుగా ముందుకు వస్తున్నారు.

అక్కడున్న యువకులు సంచులను తగిలించుకుని ప్రాణ రక్షణ కోసం ముందడుగు వేసారు. చెట్లు, చేమలు, రాళ్ళు, రప్పలు దాటుకుంటూ పరుగులు పెడుతున్నారు. చీకట్లో ముందు ఏముందో ఎవరికీ ఏమీ కనిపించడం లేదు. ఎటు పరుగెడుతున్నారో వారికి తెలియడంలేదు. అడ్డొచ్చిన అడవి తీగల్ని తప్పించుకుంటూ బండరాళ్ళను ముళ్ళతీగల్ని దాటుకుంటూ ముందుకు దూసుకుని పోతున్నారు.

అందరి చేతుల్లోనూ సామాన్ల బరువు.

వారిలో చిన్నవాడు వీర్రాజు. అతనికి ఇరవై ఏళ్ళ వయసుంటుంది. రెండు రోజుల క్రితం అడవిలో నడుస్తున్నప్పుడు తట్టుకున్న బండరాయి బొటనవేలిని బద్దలు చేసింది. గుడ్డతో కట్టుకట్టాడు. ఆ నొప్పి తగ్గకముందే ఇప్పుడు చీకట్లో పరుగు.

కాలికి దెబ్బవల్ల బూట్లు వేసుకోవడానికి వీలు కాలేదు.

అందుకే మిగతా వారిలా చీకట్లో పరుగులు పెట్టలేకపోతున్నాడు. మళ్ళీ ఏ రాయినో తన్నుకుంటానన్న భయంతో అవస్థలు పడుతున్నాడు.

చేతిలో సంచి భుజం మీదకు తగిలించుకున్నాడు.

వెనకనుంచి వెంటాడుతున్న మనుషుల గుంపు దగ్గరకు వస్తున్న సంగతి మనసుకు సంకేతం అందుతోంది. గుండెల్నిండా విపరీతమైన భయం ఆవరించింది.

ప్రాణ భయం మనసును పిండేస్తోంది. ఎలాగైనా బైటపడాలని అనుకున్నాడు. చేతిలో బరువుగా ఉన్న సంచిని తుప్పల్లోకి విసిరి వేసాడు.

"ప్రాణం కన్నా విలువైనది ఏదీకాదు" అనుకుని ఉన్న శక్తిని కూడదీసుకున్నాడు. ధైర్యం తెచ్చుకుని ముందుకు కదిలాడు.

అనుకోకుండా కిందనున్న బండరాయిని చూసుకోలేకపోయాడు. బలంగా తన్నుకున్నాడు. ఊపు కాసుకోలేక ముందుకు బోర్లా పడిపోయాడు. బొటన వేలికి తగిలిన దెబ్బ మీద మళ్ళీ దెబ్బ. బలంగా తగిలింది. మనసంతా పిండేసినట్లయిపోయింది. అమ్మా అన్న పిలుపు గుండెల్లోనే ఉండిపోయింది.

ఇనుప ఊచ కాల్చి ఒంట్లో గుచ్చినంత బాధ కలిగింది. కాలు బొటనవేలునుంచి ఎర్రని రక్తం బైటికి ఉబికింది. విపరీతమైన బాధ పిండేస్తున్నా గుండెల్లోనే అదిమి పెట్టుకున్నాడు.

వీర్రాజు కళ్ళనుంచి వెచ్చని కన్నీళ్ళు బైటికి ఉబికాయి. అయినా నిగ్రహించుకున్నాడు.

అడుగు తీసి అడుగు వేయాలన్న ప్రయత్నం సాగడంలేదు. తన తోటి సోదరులు ఎక్కడున్నారో తెలియడంలేదు. వెనకనుంచి పోలీసు పటాలం మృత్యుభటులు మాదిరిగా తరుముతూ ముందుకుని దూసుకుని వస్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి.

"అమ్మా ఎంత కష్టం వచ్చిందమ్మా?" మనసు బాధగా మూలిగింది.

"ఈ అపాయం నుంచీ నన్ను రక్షించవా అమ్మా?" మనసులోనే అమ్మని ప్రార్థించుకున్నాడు.

అంతవరకు చెట్లకింద నిద్ర నిద్రపూర్తిగా తీరకముందే హఠాత్తుగా నిద్రలేవడం ఎటువెళుతున్నామో తెలియకుండా భయంతో పరుగులు తీయడం జరిగినవన్నీ ఒక్కొక్కటీ గుర్తుకు వస్తున్నాయి వీర్రాజుకు.

శరీరంలో నిస్త్రాణ ఆవరించింది. అడుగు ముందుకు కదలడం లేదు.

పక్కన దట్టంగా ఉన్న తుప్పల్ని ఆసరా చేసుకుని ఎవరికీ కనిపించకుండా బోర్లా పడుకుండిపోయాడు. కళ్ళు మూతలు పడుతున్నాయి.

ఎవరినుంచి తప్పించుకోవాలని ప్రయత్నించాడో వారంతా అప్పటికే తనని చుట్టుముట్టేసారని తన చుట్టూ వలయంగా కమ్ముకుంటున్నారని కానీ వీర్రాజు గుర్తించే స్థితిలో లేడు.

"జీవన్ మన వాళ్ళు ఎంత దూరంలో ఎక్కడ ఉన్నారో తెలియడం లేదు. పోలీసుల్ని దారి మళ్ళించకపోతే మన అందరిపైనా ఒకేసారి దాడి జరుగుతుంది. నువ్వు తూర్పు వైపు ఫర్లాంగు దూరం వెళ్ళి తిలిలో రైఫిల్ పేల్చు. నేను దక్షిణం వైపు వెళ్ళి వారి దారిని మళ్ళిస్తాను" శ్రీకాంత్ సూచించాడు.

ఇద్దరూ చెరో వైపు దూసుకుని పోయారు. ఇంతలో మరో దిక్కులో నుంచి తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. ఆ తర్వాత వరుసగా తుపాకీ పేలుళ్ళు.

"అమ్మా" అన్న పిలుపు జాలిగా బాధగా గాలిలో కలిసిపోయింది.

పోలీసుల్ని దారి మళ్ళించాలని చెరోవైపూ వెళ్ళిపోతున్న శ్రీకాంత్, జీవన్‌లు ఇద్దరు తుపాకీల మోత అమ్మా అన్న మూలుగు ఒకేసారి విన్నారు. ఆ గొంతు వీర్రాజుది కదూ? ఇద్దరూ ఒకేసారి అనుకున్నారు.

జరిగిందేమిటో ఇద్దరికీ అర్థం అయింది. వీర్రాజు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో బలి అయిపోయాడు. కళ్ళల్లో ఆవేశం కన్నీళ్ళ రూపంలో బైటికి వచ్చింది. ఎవరిమీదో కసీ క్రోధం పెరిగిపోయాయి పోలీసుల మీద, దోపిడీ వ్యవస్థమీదా మరింత అసహ్యం పేరుకుని పోయింది.

దారీ తెన్నూ లేని అడవిలో వారి అడుగులు ముందుకు పడ్డాయి.

తూరుపు తెలవారుతోంది. ఆకాశంలో వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయి.

## 2

రూరల్ పోలీసు ఎస్పీ కార్యాలయం

విలేకర్ల సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వివిధ పత్రికల విలేఖర్లకు ముందుగా సమాచారం అందించడంతో అందరూ వచ్చారు. రూంలో కుర్చీలలో వారు కూర్చున్నారు. వివిధ ఛానల్సుకు సంబంధించిన లోగోలు టేబుల్‌పై అమర్చారు. పోలీసులు చిన్న మైకుని కూడా అమర్చారు.

అందరూ వచ్చారన్న సమాచారం రావడంతో ఎస్పీ శ్యామ్‌సుందర్ ఆ రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నారు. ముందుగా పరిచయ కార్యక్రమం జరిగింది.

"విశాఖ ఏజన్సీలో కొంగపాకల గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ విషయం మీతో చెప్పడానికి ఈ ప్రెస్ మీట్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. మావోయిస్టు కార్యక్రమాలు విశాఖ ఏజన్సీలో ఎక్కువగా జరుగుతున్నాయి వాటిని అణిచి వేయడానికి పోలీసులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఏజన్సీలో ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల కోసం పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపారు అందులో మావోయిస్టు వీర్రాజు చనిపోయాడు" వివరించారు. అందుకు సంబంధించిన వివరాలతో కూడిన ఒక నోట్‌ను కూడా అందించారు.

పక్క గదిలో నుంచి రెండు హాండ్ గ్రైనేడులు తీవ్రవాద సాహిత్యానికి సంబంధించిన కొన్ని పుస్తకాలు తీసుకుని వచ్చి ఒక ఎస్.ఐ టేబిల్‌పై పెట్టారు.

శ్యామ్‌సుందర్ వాటిని విలేఖర్లకు చూపించారు.

ఛానల్స్ వారు ఎస్పీ మాటలను రికార్డు చేసుకున్నారు. తీసుకుని వచ్చిన సామగ్రిని ఫోటోలు తీసుకున్నారు. విలేకర్లు పోలీసులు అందించిన నోట్‌ను తీసుకుని చదువుకున్నారు. అంతవరకు వీర్రాజుపై ఉన్న కేసుల వివరాలు అందులో ఉన్నాయి.

ఆ సమావేశానికి మహిళా విలేఖరి గీతామాధురి కూడా వచ్చింది.

ఆమె విజయం పత్రికలో స్టాఫ్ రిపోర్టరుగా పనిచేస్తోంది.

సాధారణమైన ఆడవాళ్ళు చేసుకునే ఉద్యోగాలు చేయమని మహిళలు విలేఖరి ఉద్యోగంలాంటివి చేయడం కష్టమని చాలామంది చెప్పారు. కానీ ఆ వృత్తి మీద ఇష్టంతో జర్నలిజం డిప్లొమా కోర్సు చేసి మరీ ఆమె విలేఖరి ఉద్యోగంలో చేరింది.

ఎన్‌కౌంటర్‌పై ఎస్పీ చెప్పిన విషయాలు రాసుకున్న తర్వాత ఆమెకు ఆ ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు కలిగాయి. అనుకోకుండా జరిగిందా లేదా పోలీసులు వీర్రాజును ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసారా అని అనిపించింది.

ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం ఎక్కడో ఏజన్సీలో మారుమూలన ఉన్న చిన్న గ్రామం. అక్కడ జరిగిన వివరాలు తెలిసే అవకాశం లేనందువల్ల ఎస్పీ చెప్పిన విషయాలు వార్తగా రాయడానికి విజయం పత్రికాఫీసుకు వెళ్ళింది.

విజయం ఆఫీసులో రిపోర్టర్సు ఛాంబర్‌లో డెస్కు ముందు కూర్చుని కంప్యూటరులో వార్తను కంపోజ్ చేసింది. ఫోటో గ్రాఫర్ తీసిన ఫోటోను కూడా ఆఫీసులో అందజేసింది. ఎస్పీ శ్యామసుందర్ చెప్పిన విషయాలను వార్తలో యధాతథంగా రాసింది. ఇటువంటి వార్తల విషయంలో తన ఊహాగానాలు జోడించకుండా ఉన్న విషయాన్ని చెప్పినది చెప్పినట్లుగా రాసింది. తర్వాత ఏమైనా ఉంటే ఫాలోఅప్ వార్త రాయవచ్చునని అనుకుంది.

ప్రతిరోజూ అనేక వార్తలను రాయడం అలవాటు. సాధారణ వార్తలు రాస్తున్న సమయంలో గీతామాధురికి ఏమీ అనిపించేదికాదు. కానీ ఈ ఎన్‌కౌంటర్ వార్త రాసిన తర్వాత ఆమె మనసు ఏదోలా అయిపోయింది. ఎన్‌కౌంటరులో చనిపోయిన వ్యక్తి ఎక్కడివాడు? అతని కుంటుంబ సభ్యులు ఎవరు? ఇతను చనిపోవడంతో వారు ఎలా రియాక్టు అయ్యారు? అనే విషయాలు ఆమెకు పదేపదే గుర్తుకువచ్చాయి. మనసంతా వికలం అయిపోయింది.

విజయం ఆఫీసులో ఎవరిపనుల్లో వారున్నారు.

తాను రాయవలసిన ఇతర వార్తలను కంపోజ్ చేయడం పూర్తిచేసింది.

వాటిని ప్రింటింగుకు అనుగుణంగా సబ్ ఎడిటర్‌కు అందచేసింది.

విజయంలో పేపర్ ప్రింటింగు చేయడానికి ఏర్పాట్లు మొదలవుతున్నాయి పేజ్ పేకప్ సెక్షను వారు అందించిన వార్తలను డిజైన్ చేసి వాటి మధ్య ఫోటోలను పెడుతూ పేజీలను తయారు చేస్తున్నారు. ఫస్టు ఎడిషను డెడ్‌లైను టైం అయిపోవస్తోదని కంప్యూటరు సెక్షనులో ఎడిషను ఇన్‌ఛార్జ్ గట్టిగా అరుస్తున్నాడు.

గీతామాధురి తన సీట్లో కూర్చుని ఎన్‌కౌంటర్ గురించే ఆలోచిస్తోంది.

ఎన్‌కౌంటర్ జరిగిన కొంగపాకలు ప్రాంతానికి వెళితే ఎలా ఉంటుందన్న ఆలోచన ఆమె మనసుకు కలిగింది. కొంగపాకలు గ్రామం ఉన్న చింతపల్లి మండలంలో విజయం పత్రిక కోసం పనిచేస్తున్న రిపోర్టరు సుబ్రమణ్యానికి ఫోను చేసింది గీతామాధురి. అతను ఆ ప్రాంతంలో చిన్న మందుల దుకాణం నడుపుతూ విలేఖరిగా పార్టు టైంగా వార్తలు రాస్తుంటాడు.

"కొంగపాకలు గ్రామం వెళ్ళడం చాలా కష్టం. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి పోలీసులు కూడా ఇంతవరకు వెళ్ళలేదు. రేపు ఉదయం ఫోటోగ్రాఫరు ఫోటోలు తీయడానికి వస్తాడట. అతనితో పాటు పోస్టుమార్టం చేయడానికి డాక్టరు కూడా వెళతారని సమాచారం ఉంది" అని రిపోర్టరు సుబ్రమణ్యం చెప్పాడు.

గీతామాధురి ఫోనులోనే. "రేపు నేను చింతపల్లి వస్తాను. మీరు రెడీగా ఉండండి. పోలీసులు పోస్టుమార్టం చేసే డాక్టరుతో కలిసి కొంగపాకలు వెళదాం" అంది నెమ్మదిగా.

"మీరు వస్తారా మేడం? అక్కడికి వెళ్ళడం చాలా కష్టం. చాలా దూరం నడవాలి. పెద్ద కొండ ఎక్కి కిందకు దిగాలి. మగవాళ్ళు కూడా వెళ్ళడం చాలా ఇబ్బందిగా ఉంటుంది" అన్నాడు సుబ్రమణ్యం.

"పర్వాలేదు నేను బయలుదేరి వస్తాను. మీరు రెడీగా ఉండండి" అతను మరోమాట చెప్పడానికి అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది.

స్టాఫ్ రిపోర్టరుగా ఇటువంటి వార్తలను సమగ్రంగా ఇవ్వడానికి ప్రత్యేక వార్తాకథనాలు రాయడానికి స్వయంగా రంగంలోకి దిగితేనే మంచిదని ఆమె అనుకుంది.

ఆ వెంటనే ఎస్పీ శ్యామ్‌సుందర్ సెల్‌కి ఫోన్ చేసింది.

"ఎన్‌కౌంటర్ జరిగిన కొంగపాకలు ప్రాంతానికి తాను కూడా వస్తానని అవకాశం కల్పించమని" అడిగింది.

ఎస్పీ శ్యామ్ సుందర్ సానుకూలంగా స్పందించారు.

"ఓ.కే మేడం గీతగారూ నేను ఉదయం ఆరుగంటలకు వెళుతున్నాను. నాతోపాటు జీపులో సర్కిల్ ఇన్‌స్పెక్టరు పోలీసులు ఇతర సిబ్బంది కూడా వస్తారు. వారితోపాటు మీరు రావచ్చు. అయితే ఉదయం ఆరుగంటలకు విశాఖపట్నంలో మా ఆఫీసుకు వచ్చేయండి. అక్కడి నుంచి జీపులో వెళ్ళవచ్చు" అన్నాడు ఎస్పీ శ్యామ్‌సుందర్.

ఎస్పీ శ్యామ్‌సుందర్ చెప్పిన విషయం గీతామాధురికి ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. పోలీసు అధికారులతో పరిచయాలు పెట్టుకోవడం వల్ల ఇటువంటి సమయంలో ప్రయోజనం కలుగుతుందని ఆమెకు తెలుసు.

విశాఖలో చాలామంది స్టాఫ్ రిపోర్టర్లు ఉన్నా తనకు మాత్రం ఈ అవకాశం లభించడం ఆనందం అనిపించింది.

ఆకాశంలో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.

గాలిలో తేమలేకుండా ఉక్కపోస్తోంది.

నాలుగు గంటలు నిరవధికంగా నడవడం వల్ల అందరి కాళ్ళూ పట్టేసాయి. విశ్రాంతి తీసుకోవాలని అనిపిస్తోంది.

''నేను మరి నడవలేకపోతున్నాను. కాస్త రెస్టు తీసుకుని వెళదాం'' అంటూ పక్కనున్న బండరాయిపైన కూర్చుండిపోయింది రాజక్క.

ఆమెకు ముప్పయి సంవత్సరాల వయసుంటుంది.

మనిషి ఎత్తుగా నల్లగా లావుగా ఉంది. ఆమెతో మాట్లాడుతున్నా, కలిసి నడుస్తున్నా ఎంతో ఆత్మీయురాలిగా అనిపిస్తుంది. ఇటువంటి అక్కకానీ అమ్మకానీ ఉంటే బాగుంటుందని అనిపిస్తుంది.

ఆమె కన్నా పెద్దవాళ్ళుకూడా రాజక్కా అని పిలుస్తుంటారు. రాజక్క రాయిమీద కూర్చోవడంతో నడుస్తున్న వారంతో నీడలో ఉన్న రాళ్ళమీద తలో పక్కా చతికిల పడిపోయారు. జీవన్, శ్రీకాంత్, ఆదెయ్య, గిరిబాబు, నగేష్ అందరూ ఆమె చుట్టూ చేరిపోయారు.

అందరి మొహాల్లోనూ అలసట కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

వారి మనసుల్లో విచారం తాండవిస్తోంది.

అందరితో కలివిడిగా తిరిగి నవ్వుతూ నవ్విస్తూ తమతో ఆత్మీయుడిగా కలిసిపోయిన వీర్రాజు. లేనిలోటును అందరూ గుర్తించారు.

హుకుం పేట మండలంలో గూడ గ్రామంలో గిరిజనుడిగా ఎన్నో అన్యాయాలను ఎదుర్కొన్నాడు. దోపిడీ వ్యవస్థ మీద అసహ్యాన్ని పెంచుకున్నాడు. జరుగుతున్న అకృత్యాలను ఎదుర్కోవడానికి తమలో ఒకడిగా చేరిపోయాడు. అందరినీ అన్నా... అన్నా అంటూ తిరిగే తమ్ముడిలాంటి వ్యక్తి మరిలేడు. రాడు అనే భావన వారంతా తట్టుకోలేకపోతున్నారు.

అవును.

వీర్రాజు పోలీసు తూటాలకు బలి అయిపోయాడు. పోలీసులతో హత్య చేయబడ్డాడు.

''మన వీర్రాజు ఆత్మ శాంతించాలి. అలా శాంతించాలంటే హత్యకు ప్రతికారం తీర్చుకోవాలి'' రాజక్క ధృఢంగా చెప్పింది.

బైటికి వ్యక్తం చేయకపోయినా అందరిలోనూ అటువంటి ఆలోచనలే.

సంచిలో నుంచి నలిగిపోయి ఉన్న ఆ రోజు దినపత్రికను అందరికి చూపించాడు. జీవన్ వార్తను బైటికి చదివాడు.

''వీర్రాజు పోలీసులపై దాడి చేసాడట. అతని వద్ద తీవ్రవాద సాహిత్యం దొరికిందట. ఎన్ని తప్పులు రాసారో? తుపాకీ పేల్చడమే తెలియనివాడు. చదవడం రాయడం తెలియని నిరక్షరాస్యుడిపై ఎన్ని అభాండాలు మోపారు? అమాయకుడైన వ్యక్తిని దారుణంగా హతమార్చి ఎన్‌కౌంటర్ అని పేరు పెట్టారు. ప్రతీకారం తీర్చుకోవలసిందే'' జీవన్ గొంతులోంచి బాధ తన్నుకుని వచ్చింది.

''రక్తానికి రక్తంగా సమాధానం చెప్పాలి'' శ్రీకాంత్.

''దెబ్బకు దెబ్బ తీయాలి'' అందరూ ఏకకంఠంతో పలికారు.

''కడుపు మండిపోతోంది. ముందు మన ఆకలిని తీర్చుకునే మార్గం చూడాలి'' కనకక్క మాటలతో అక్కడున్న వారిలో కదలిక వచ్చింది.

లేచి నిల్చుని దూరంగా కనిపిస్తున్న గూడెం వైపు కదిలారు.

గ్రామ సరిహద్దుల్లోకి ప్రవేశించగానే ''అన్నలొచ్చారు. అన్నలొచ్చారు. '' గిరిజనులు ఆప్యాయంగా ఆహ్వానించారు.

అరగంటలో పొయ్యిలు రాజుకున్నాయి వంటలు తయారయ్యాయి.

వెదురు బియ్యంతో వండిన అన్నం జొన్న సంగటి వారి ఆకలిని తీర్చాయి.

"ఇంతకన్నా ఏమీ పెట్టలేకపోయాం. మన్నించండయ్యా?" గూడెం దొర మంగన్న పడాల్ వినయంగా అన్నాడు.

"మీ అభిమానం ఆప్యాయత. ప్రేమతో మా కడుపు నిండిపోయింది" రాజక్క గిరిజనుల్ని అభినందించింది.

"భయం లేకుండా మనబతుకుతున్నామంటే కారణం మీరే కదు దొరా? నర్సీపట్నం మాడుగుల ప్రాంతాల నుంచి వచ్చే షావుకార్లకు వార్నింగులిచ్చి మాకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నారు." మంగన్న పడాల్ చెప్పుకుని పోతున్నాడు.

"మనం కదలాలి. చీకటి పడిందంటే ఈ అడవుల్లో నడవడం కష్టం" శ్రీకాంత్ హెచ్చరించాడు.

అందరూ లేచి నిల్చున్నారు

గూడెంలో గిరిజనులకు వీడ్కోలు పలికారు.

గిరిజనులు చూపించిన అభిమానం ప్రేమ ఆప్యాయత వారందరిలో ఒక్కసారిగా చైతన్యాన్ని కలిగించింది.

నడుస్తున్న శ్రీకాంత్‌లో ఆలోచనల పరంపర.

వీర్రాజు మృతికి ప్రతీకారం తీర్చుకోవడానికి తీవ్రమైన కార్యక్రమానికి మనసులోనే రూపకల్పన చేసాడు.

వైర్‌లెస్ సెట్‌లో ఎవరితోనో మాట్లాడాడు.

"నిజంగా అలా చేయవలసిందే" మనసులోనే నిశ్చయించుకున్నాడు.

సహచరులందరికీ విషయాన్ని చెప్పి ఒప్పించాడు.

4

**చింతపల్లి** మండలంలో కొంగపాకలు ఒక కుగ్రామం..

గ్రామం చుట్టూ దట్టమైన చెట్లతో అడవి ఆవరించి ఉంటుంది.

చుట్టుపక్కల గ్రామాలకు కూడలి ప్రాంతంగా ఉండటం వల్ల ప్రతి శుక్రవారం ఆ గ్రామంలో సంత జరుగుతుంది.

తాము పండించిన ఉత్పత్తులను, చెట్లనుంచి సేకరించిన సామాగ్రిని అమ్ముకోవడానికి, వారానికి అవసరమైన వస్తువుల్ని కొనుక్కోవడానికి గిరిజనులు చాలామంది వస్తుంటారు. ఎక్కువగా ఒక వస్తువుకు బదులుగా మరో వస్తువు అందించే వస్తుమార్పిడి వ్యాపారం ఎక్కువ జరుగుతుంది.

అనకాపల్లికి చెందిన దొడ్డి చిన్నబ్బాయి పాతికేళ్ళుగా ఆ సంతకు వచ్చి వ్యాపారం చేస్తున్నాడు. కొన్ని రకాల వస్తువుల్ని సంతనాడు తీసుకుని వచ్చి గిరిజనులను విక్రయిస్తుంటాడు. వారి నుంచి అమ్మకం కోసం తెచ్చిన సరుకుల్ని చౌకగా కొనుగోలు చేసి వాటిని అనకాపల్లి, కశింకోట ప్రాంతాలకు తీసుకుని వచ్చి అధిక ధరలకు విక్రయించి లాభాలు గడిస్తుంటాడు. సరుకుల్ని తీసుకుని రావడానికి, ఏజన్సీ సరుకుల్ని కిందకు తీసుకుని వెళ్ళడానికి వెళ్ళడానికి స్వంతగా వానును కూడా సమకూర్చుకున్నాడు.

చాలా సంవత్సరాలుగా వ్యాపారం చేస్తుండటం వల్ల గిరిజన గ్రామాల వారితో చిన్నబ్బాయికి మంచి పరిచయాలు ఉన్నాయి. అనకాపల్లి నుంచి ఏజన్సీ ప్రాంతానికి వచ్చినప్పుడు ముందు గిరిజనుల మనసుల్ని, తర్వాత వారు పండించిన సంపదను దోచుకోవడం మొదలుపెట్టాడు.

గిరిజనుల నుంచి చింతపండు, పసుపు వంటి వివిధ రకాల అటవీ ఉత్పత్తులను ఇతర వస్తువులను చౌకగా కొనుగోలు చేసి అనకాపల్లికి తరలించడం ద్వారా ఎంతో లాభపడ్డాడు. ధనవంతుడిగా మారిపోయాడు.

ఏజన్సీలో తీవ్రవాదుల ప్రాబల్యం పెరిగిపోవడంతో చిన్నబ్బాయికి ఇబ్బందులు కూడా మొదలయ్యాయి. పాతికేళ్ళుగా ఎదురు లేకుండా నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యం కుప్పకూలుతున్నట్లు అతనికి అనిపించేది.

మావోయిస్టులు అడవుల్లో ఏ ఏ ప్రాంతాలలో సంచరిస్తున్నారు, ఏ గ్రామాలకు తరచూ వస్తుంటారన్న విషయాలు. కొండకోనల్లో ఏ రూటులో వారు ప్రయాణిస్తుంటారన్న సంగతులను గిరిజనుల ద్వారా తెలుసుకుని తెలిసిన పోలీసులకు సమాచారాన్ని అందించేవాడు. పోలీసుల అండదండలు తనకు పుష్కలంగా ఉన్నాయని చిన్నబ్బాయి నమ్మేవాడు.

అతను అందించిన సమాచారం ఆధారంగానే వీరరాజు ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ విషయం చిన్నబ్బాయికి తెలుసు.

వీరరాజు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడంతో మావోయిస్టులు రెచ్చిపోయారు.

అంతవరకు చిన్నబ్బాయి మీద మావోయిస్టులకు కొంచెం అనుమానం ఉండేది. పోలీసులు చేసిన ఎన్‌కౌంటర్ వెనక చిన్నబ్బాయి హస్తం ఉందన్న విషయాన్ని కొంతమందిని కలుసుకుని నిర్ధారించుకున్నారు. ఎక్కడైతే వ్యాపారం చేస్తుంటాడో ఆ సంతలోనే అతనిపై దాడి చేయాలని వ్యూహాన్ని రూపొందించారు.

ఆ రోజు..

సంతలో పసుపు బస్తాలను గిరిజనుల నుంచి కొనుగోలు చేసి వేనులోకి వాటిని ఎక్కిస్తుండగా ఎనిమిదిమంది సాయుధులైన యువకులు అతడిని చుట్టుముట్టారు. అందరి చేతుల్లోనూ తుపాకులున్నాయి. ఆలివ్ గ్రీన్ దుస్తులు ధరించి ఉన్నారు. వారి నడుం చుట్టూ తూటాల బెల్టులు ఉన్నాయి.

వారిని చూసిన ఎవరికైనా మావోయిస్టులని అర్థమైపోతుంది.

చిన్నబ్బాయికి అంతమందిని చూడటంతో గుండె ఝల్లుమంది పై ప్రాణాలు పైనే పోయాయి.

చిన్నబ్బాయి కాలరు పట్టుకుని దగ్గరకు లాక్కున్నారు.

ప్రాణభయంతో చిన్నబ్బాయి అరుస్తున్నాడు. ఏడుస్తూ తనకు ఏ పాపం తెలియదని వదిలిపెట్టమని ప్రాధేయపడ్డాడు.

గుంపుగా వచ్చిన యువకుల్లో ఒక వ్యక్తి గండ్రగొడ్డలిని తీసుకుని చిన్నబ్బాయి కుడికాలును క్రరను నరికినట్లు నరికేసాడు. జారుగా ఉన్న గొడ్డలి అతని శరీరం నుంచి కాలును వేరు చేసింది.

రక్తం లావాలా ఎగ చిమ్మింది.

సంతలో జనం అందరూ చూస్తూనే ఉన్నారు. ఎవరినోటి వెంటా ఒక్కమాట కూడా రాలేదు.

"గిరిజనుల న్యాయమైన హక్కులను సాధించడానికి నిజాయితీగా పోరాటం చేస్తున్న మా గురించి ఇతను పోలీసులకు సమాచారం అందించాడు. ఇకపై ఎవరు ఇటువంటి పని చేసినా మాకు తెలిసిపోతుంది వారికి కూడా ఇదే గతి పడుతుంది" నినాదాలు చేస్తూ మావోయిస్టులు హెచ్చరించారు.

తర్వాత నినాదాలు చేసుకుంటూ వెళ్ళిపోయారు.

సంతలో స్మశాన నిశ్శబ్ధం అలుముకుంది.

పోలీసు జీపు చింతపల్లి బయలుదేరింది.

విజయం ప్రెస్ రిపోర్టరు గీతామాధురి డిజిటల్ కెమెరా, రైటింగ్ ప్యాడ్ పట్టుకుని వెనుక సీటులో కూర్చుంది.

ఎస్పీ శ్యామ్‌సుందర్ కారు ముందుకు వెళ్ళిపోయింది. వెనుక బయలుదేరిన జీపులో సర్కిల్ ఇన్స్పెక్టరు గోవిందరావు మరో నలుగురు కానిస్టేబుళ్ళు ఫొటోగ్రాఫర్, డాక్టరు మొదలైన వారు ఉన్నారు.

నర్సీపట్నం దాటిన తర్వాత జీపు చింతపల్లి ఘాట్‌రోడ్డులోకి ప్రవేశించింది. కొండలపైకి వెళుతున్న రహదారి మెలికలు తిరిగి ముందుకు సాగుతోంది.

"చింతపల్లిలో రిపోర్టరు సుబ్రమణ్యాన్ని పికప్ చేసుకుని కొంగపాకలు వెళ్ళాలి, వివరాలు సేకరించి ఎవరూ రాయని విధంగా ఎక్స్‌క్లూజివ్ వార్తను పబ్లిష్ చేయాలి. " గీతామాధురిలో ఆలోచనల పరంపర. "వ్యక్తుల్ని చంపడంవల్ల మనుష్యుల్లో మార్పు వస్తుందా? మనుషుల్లో మార్పు తీసుకుని రావడానికి ఏం చేయాలి? "

చింతాలమ్మ గుడిరాగానే జీపు ఆగింది. పక్కనున్న టీ కొట్టువాడు వంగి వంగి దణ్ణాలు పెడుతూ జీపు దిగిన సర్కిల్ ఇన్స్పెక్టరు దగ్గరకు వచ్చాడు.

"స్పెషల్ టీ" సిఐ గోవిందరావు ఆర్డరు చేసాడు.

తన పక్కనే కెమెరా మెడలో వేసుకుని నిల్చున్న గీతతో "మేడం! విజయం రిపోర్టరుగా ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు" ప్రశ్నించాడు.

"అయిదేళ్ళు"

"చూసారా. మా ఉద్యోగాలు? వారం రోజులు ఏజన్సీలో ఉండి నిన్నే విశాఖపట్నం వచ్చాను. మళ్ళీ ఉదయం ఈ డ్యూటీ తగిలింది. భార్యాపిల్లలతో గడిపింది ఒక్కరోజు కూడా లేదు."

"మీ ఉద్యోగాలు మా ఉద్యోగాలు ఒకటే లెండి. ఎటొచ్చీ మీవి ప్రభుత్వ ఉద్యోగాలు. మావి ప్రైవేటు ఉద్యోగాలు. అంతే తేడా"

"ఏమి ఉద్యోగాలో! సుఖం లేకుండా పోయింది."

ఇంతలో టీ వచ్చింది.

జీపులో ఉన్నవారు కిందకు దిగి అందరూ తలో టీ గ్లాసు అందుకున్నారు.

"మా అమ్మాయి టెన్త్‌క్లాసుకు వచ్చింది. ఎలా చదువుతున్నావని అడిగే తీరిక. సమయం దొరకడం లేదు. ఎంతో బాధగా ఉంది తెలుసాండీ!?"

గీతామాధురి ఏమీ మాట్లాడలేదు.

"వీరు మావోయిస్టులు కాదండీ. దోపిడీ దొంగలు. వారు చేస్తున్న పనులకు ఎవరు అడ్డువచ్చినా ఊరుకోరు. ప్రతినెలా మామూళ్ళు దండుకుంటారు. రేంజర్లు, అటవీ సిబ్బంది ఎస్టేట్ మేనేజర్లు నెలవారి మామూళ్ళు ఇవ్వవలసిందే ఇవ్వకపోతే మాడి మసైపోతారు " సర్కిల్ ఇన్స్పెక్టరు గోవిందరావు తన మనసులో ఉన్న అక్కసునంతా వెళ్ళగక్కాడు.

జీపు స్టార్టు అయింది.

గీత సెల్ ఫోను తీసి చింతపల్లి రిపోర్టరు సుబ్రమణ్యానికి ఫోను చేసింది. ''మరో అరగంటలో చింతపల్లి సెంటర్‌కు జీపులో వస్తున్నాం. దానిని కేచ్ చెయ్యి'' అంది.

పోలీసు జీపు అరగంటలోపే చింతపల్లి చేరింది.

సుబ్రమణ్యం జీపును ఆపించి ఎక్కాడు.

జీపు పోలీసు స్టేషను దాటుతుండగా అక్కడున్న సబ్‌ఇన్‌స్పెక్టరు పరుగు పరుగున దగ్గరికి వచ్చాడు. ''సంతలో వ్యాపారస్తుడి కాళ్ళను తెగనరికారు. కొంగపాకల వైపు వెళ్ళొద్దు'' అన్నాడు.

''పర్వాలేదు. ఎస్పీ దొర వెళ్ళిపోయారు'' గోవిందరావు జీపును ముందుకు పోనిచ్చాడు.

గంట తర్వాత కొంగపాకల ఊరి పొలిమేర వచ్చింది.

దూరంగా సంత జరిగే ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంది అక్కడ కూడా పోలీసులు తిరుగుతున్నారు.

''కొంగపాకలు దాటుకుని కొండవార నుంచి పదికిలోమీటర్లు వెళ్ళి రెండు కొండలు ఎక్కి దిగితే ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం వస్తుంది'' సి.ఐ గోవిందరావు అందరితో చెప్పాడు.

గీత కిందకు దిగి, కొంగపాకల గ్రామసరిహద్దు ప్రాంతం వివిధ ఏంగిల్సులో ఫోటోలు తీసింది.

తర్వాత జీపు బయలుదేరింది. గంటపాటు తుప్పల్లో డొంకల్లో ప్రయాణం చేసిన తర్వాత డ్రైవరు కల్వర్టుపై జీపు ఆపాడు.

గీత మరోసారి కిందకు దిగి ఆ ప్రాంతమంతా ఫోటోలు తీసుకుంది. ఎన్‌కౌంటర్ కథనం రాసేటప్పుడు జరిగిన ప్రాంతం గురించి రాయడానికి ఈ ఫోటోలు ఉపకరిస్తాయని ఆమెకు తెలుసు.

ఆగిన జీపుకు దూరంగా వెళ్ళి, వెనుక నుంచి మరికొన్ని కోణాలను కెమేరాలో బంధించసాగింది.

ఇంతలో అనుకోని ఊహించని సంఘటన.

పెద్ద విస్పోటనం.

ఏమి జరిగిందో తెలిసే లోపునే జీపు ఆగిన కల్వర్టు పెద్ద శబ్దంతో పేలిపోయింది, అంతెత్తు ఎగిరి పడింది. చెవులు చిల్లులు పడిన శబ్దం! ఒక్క క్షణం జరిగిందేమిటో ఆమెకు అర్ధం కాలేదు. కాలిన మాంసం వాసన ముక్కుపుటాలకు తగిలింది.

చిన్నబ్బాయి గాయపడిన ప్రాంతానికి, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి పోలీసులు వస్తారని మావోయిస్టులు గుర్తించి ఈ దాడి చేసారని అర్ధమైంది. కల్వర్టు పేల్చి వేయడానికి క్లయిమూర్ మైన్సు ఏర్పాటు చేయడం వల్ల జరిగిన విస్ఫోటనమది!!

పోలీసు రిపోర్టరు సుబ్రమణ్యం కళ్ళముందే మాంసం ముద్దలుగా మారిపోయి విగతజీవులు అయిపోవడం ఆమె మనసు జీర్ణించుకోలేకపోతోంది. జరిగింది కలా నిజమా అని కూడా అనిపించింది.

ఫోటోలు తీయడం కోసం జీపు దిగడం వల్ల తాను బతికిపోయిందని అనిపించింది. అప్పటివరకూ మాట్లాడిన వారంతా కలలో మాదిరిగా మాయమైపోవడం ఆమెకు ఆశ్చర్యం అనిపించింది.

తన కారణంగా వార్తకోసం పోలీసు జీపు ఎక్కి ఏ సంబంధంలేని రిపోర్టరు సుబ్రమణ్యం నామరూపాలు లేకుండా అయిపోయాడు.

అక్కడ పరిస్థితి అస్థవ్యస్థంగా తయారైంది.

ప్రమాద సంఘటన సంచలనం అయిపోయింది. జీపులో వస్తున్న పోలీసుల్ని టార్గెట్ చేయాలనుకుని జర్నలిస్టును కూడా పొట్టన పెట్టుకున్నారన్న విషయం గీతామాధురి మర్నాడు విజయం పత్రికలో బేనర్ ఐటంగా రాసింది.

దాంతో జర్నలిస్టు దుర్మరణం వార్త లోకానికి తెలిసింది.

5

విశాఖపట్నం ప్రెస్ క్లబ్‌లో సమావేశం.

విలేకర్లకు సంబంధించి ఉన్న రెండు మూడు సంఘాలకు చెందిన నాయకులంతా హాజరయ్యారు. వివిధ పత్రికలకు విలేకర్లుగా పనిచేస్తున్న చాలామంది సమావేశానికి వచ్చారు.

తీవ్రవాదుల దాడిలో చనిపోయిన చింతపల్లి విలేఖరి సుబ్రమణ్యం మరణానికి సంతాపాన్ని ప్రకటిస్తూ అందరూ రెండు నిమిషాలు మౌనాన్ని పాటించారు.

వార్త సేకరణ కోసం వెళుతూ విధి నిర్వహణలో సుబ్రమణ్యం చనిపోయాడని విజయం పత్రిక యాజమాన్యం యాభైవేల రూపాయలు అతని కుటుంబానికి అందజేసింది. సాధారణంగా పత్రికలలో కిందస్థాయిలో పనిచేసేవారిని స్ట్రింగర్లు అంటారు. వీరు ఏదైనా పని చేసుకుంటూ పార్టుటైంగా విలేఖర్లుగా పనిచేస్తుంటారు. వీరు పత్రికలో ఉద్యోగస్తులు కాదు అందువల్ల అటువంటి స్ట్రింగరుగా పనిచేస్తున్న సుబ్రమణ్యానికి ఎటువంటి పరిహారం ఇవ్వడం కుదరదని యాజమాన్యం తేల్చి చెప్పింది కానీ స్టాఫ్ రిపోర్టరుగా పనిచేస్తున్న గీతామాధురి యూనిట్ మేనేజరును ఒప్పించి పరిహారం వచ్చేలా చేసింది.

సుబ్రమణ్యానికి పత్రికా విలేఖరిగా వచ్చే ఆదాయం ఏమీలేదు. కానీ విలేఖరి పరపతి కోసం రాయడం ఆమె పట్ల ఇష్టంతో ఈ పనిని చేస్తున్నాడు మందుల దుకాణం నడపడం వల్ల కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

అతను హఠాత్తుగా చనిపోవడంతో కుటుంబం అస్తవ్యస్తం అయిపోయింది. అందువల్ల అతన్ని కుటుంబాన్ని ఆదుకోవాలని జర్నలిస్టు సంఘాలు అన్నీ నిర్ణయాన్ని తీసుకున్నాయి.

అందుకే ఆ రోజు సమావేశాన్ని పెట్టుకున్నారు.

సుబ్రమణ్యం కుటుంబానికి సహాయం అందించాలని ఇచ్చిన పిలుపుకు చాలామంది స్పందించారు. తమ వద్ద ఉన్న డబ్బులను స్వచ్ఛందంగా అందించారు. జర్నలిస్టు సంఘనాయకులు అడగ్గానే సమావేశానికి వచ్చిన వారు డబ్బుల్ను విరివిగా అందించారు. అలా వచ్చిన డబ్బులు 76 వేలు అయ్యాయి. వాటితోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న జర్నలిస్టు సోదరులనుంచి కూడా విరాళాలు సేకరించి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులకు అందించాలని నిర్ణయిం తీసుకున్నారు.

చాలామంది విలేఖర్లు ఆనాటి సంఘటనలో ప్రధాన బాధ్యురాలిగా ఉన్న గీతామాధురిని విషయాలను వివరించమని అన్నారు.

ఆమె వేదికను ఎక్కి ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత సంఘటనా ప్రదేశానికి తాను వెళ్ళడానికి సుబ్రమణ్యాన్ని తీసుకుని వెళ్ళడం అక్కడ కల్వర్టుపైన జీపును ఆపిన సమయంలో తీవ్రవాదులు దానిని పేల్చి వేసిన విషయాలను అన్నీ పూసగుచ్చినట్లు వివరించింది.

సుబ్రమణ్యం చనిపోయిన విషయం అక్కడ అందరిలో విషాదాన్ని విచారాన్ని నింపింది.

ఆ తర్వాత తీవ్రవాదుల నుంచి అన్ని పత్రికా కార్యాలయాలకు ఒక ప్రెస్ నోట్ అందింది. చేతితో రాసి జిరాక్సు తీయించిన కాపీ "పోలీసు జీపును పేల్చి వేసింది తామేనని అందులో అమాయకుడిపై విజయం రిపోర్టరు సుబ్రమణ్యం ఉన్నాడన్న విషయం తమకు తెలియదని పేర్కొన్నారు. పత్రికా విలేఖర్లు అంటే తమకు ఎంతో గౌరవం ఉందని అతని మృతి ఎంతో విచారాన్ని వ్యక్తం చేస్తున్నాం" అని అందులో ఉంది.

చాలారోజులు గీత మనిషి కాలేకపోయింది.

మనసు అంతా ఏదోలా అయిపోయింది. ఏ పనిచేయాలని అనుకున్నా ఏ వార్త టైపు చేస్తున్నా అమాయకుడైన సుబ్రమణ్యం గుర్తుకు వచ్చేవాడు. తన కారణంగానే అతను చనిపోయాడేమో అని బాధపడింది.

6

రాష్ట్రంలో తీవ్రవాద కార్యక్రమాలు ఉధృతంగా జరుగుతున్నాయి.

ప్రభుత్వంపైన తీవ్రవాదులకు ఎందుకు అంత వ్యతిరేకత ఉందో తెలియడంలేదు. ఏజన్సీ ప్రాంతాలలో అన్యాయాలు, అక్రమాలు, మోసాలు ఎక్కువగా జరుగుతున్నందువల్ల తీవ్రవాదులు కూడా వాటిని అణిచివేయడానికి అంతే పట్టుదలతో ఉన్నారన్న విషయం అర్థం అవుతోంది.

ఎదురుగా నీలాకాశం కనిపిస్తోంది.

గీతామాధురి వార్తలను కంప్యూటరులో టైపు చేస్తోంది.

నగరంలో పెరిగిపోతున్న భూకబ్జాల గురించి వార్త ఎన్నో వివరాలను సేకరించి కంపోజ్ చేసింది. అందులో తప్పులను సరి చూసుకుంటూ మరోసారి చదువుతోంది. భూముల విలువ పెరిగిపోవడంతో ఆక్రమణలు కూడా పెరిగిపోతున్నాయి. పేదవారి ముసుగులో కొంతమంది బడాబాబులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆ వివరాలన్నీ వార్తలో రాసింది.

"సార్ పిలుస్తున్నారు మేడం!" బోయ్ చెప్పాడు.

అంతవరకు చదివిన వార్తను సేవ్ చేసి న్యూస్ ఎడిటర్ రాజారావు చాంబర్‌లోకి వెళ్ళింది.

చాలా సంవత్సరాలు పత్రికా రంగంలో ఉండటం వల్ల రిటైర్‌మెంటు దశలో ఆ స్థాయికి వచ్చాడు రాజారావు. చాలా విషయాలపై అతనికి ఎంతో అవగాహన ఉంది. వార్తల విషయంలో చర్చించడానికి అప్పుడప్పుడు న్యూస్ ఎడిటర్‌ను కలవడం పరిపాటి ఆ విధంగా పిలిచారేమో అనుకుంది.

"గీతగారూ రాష్ట్రంలో తీవ్రవాద కార్యకలాపాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను వారు ధ్వంసం చేస్తున్నారు. చాలా సందర్భాలలో పోలీసుల్ని తమ శత్రువులుగా చూస్తున్నారు. అనేక సందర్భాలలో పరస్పర దాడులకు పాల్పడుతున్నారు. వర్గశత్రు నిర్మూలన కార్యక్రమంగా వారి కార్యకలాపాలు జరుగుతున్నాయి" అన్నారు.

"అవును సార్. ఈ కార్యకలాపాలు ఎంత కాలం కొనసాగుతాయో ఎప్పటికి ముగుస్తాయో తెలియడంలేదు. ఎవరూ కూడా తగ్గడం లేదు."

"అందుకే నాకో ఆలోచన వచ్చింది గీతగారు. తీవ్రవాదులు ఎన్‌కౌంటర్లు చేసిన సమయంలో ప్రెస్ నోట్లు అందిస్తుంటారు. తాము ఎందుకు దాడులు చేసామో అప్పుడప్పుడు తెలియజేస్తుంటారు కానీ పూర్తి స్థాయిలో వారెందుకు తీవ్రవాద కార్యకలాపాలల్లో మునిగి తేలుతున్నారన్న విషయం తెలుసుకోవలసి ఉంది. అండర్‌గ్రౌండులో ఉన్న ముఖ్యమైన నాయకుడ్ని ఎవర్నయినా మనపత్రిక తరపున ఇంటర్వ్యూ చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాను."

"తీవ్ర వాద సంస్థలపై ప్రభుత్వ నిఘా ఉంది. వారి కార్యకలాపాలు గురించి నిఘా సంస్థలు ఆరా తీస్తుంటాయి. కీలకమైన వ్యక్తుల్ని కలుసుకోవడం చాలా కష్టం."

"జర్నలిజం వృత్తిలో నీవంటి నిబద్ధత కలిగిన వారు కొద్దిమంది మాత్రం ఉంటారు. అందుకే ఈ విషయాన్ని నీకు చెబుతున్నాను. నీకు అభ్యంతరం లేకపోతే ఈ విషయాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని ఈ పనిని నువ్వే చేపితే చాలా బాగుంటుంది" రాజారావు నవ్వుతూ అన్నాడు.

"నేనా?" గీతామాధురి ఆశ్చర్యపోయింది.

"అవును. నువ్వయితేనే బాగుంటుంది. స్త్రీగా నీకు కొన్ని వెసులుబాట్లు ఉంటాయి. ఈ కార్యక్రమాన్ని చేయడంవల్ల నీ పేరు రాష్ట్రంలోనే మారుమోగిపోతుంది. ఈ కార్యక్రమాన్ని చేసినందుకు మన పత్రికా యాజమాన్యం నుంచి నీకు సంపూర్ణ సహకారం ఉంటుంది."

విజయం పత్రికలో చాలామంది స్టాఫ్ రిపోర్టర్లు ఉంటుండగా న్యూస్ ఎడిటర్ తనకే ఈ బాధ్యతను ఎందుకు అప్పగిస్తున్నారో గీతకు మొదట అర్థంకాలేదు. అటువంటి సాహసంతో కూడిన కార్యక్రమం తనకు అప్పగించడం ఒకలాంటి ఆనందాన్ని కలిగించింది.

ఆమె ఆలోచనలో ఉంటుండగానే "తీవ్రవాద నాయకుడ్ని కలుసుకోవాలని అనుకుంటే ప్రస్తుతం ఉద్యమంలో ఉంటున్నవారిలో ప్రముఖుడైన వ్యక్తిని కలుసుకోవాలి అలా కలుసుకునే వ్యక్తికి సంబంధించిన లింకు మనకు అందుబాటులో ఉంది."

"ఎవరా నాయకుడు?"

"క్రాంతిమిత్ర.. కారుణ్యానాథ్.. కంజరన్న.. శ్రీకాంత్. ఇవన్నీ ఒక వ్యక్తి పేర్లే."

గీతామాధురికి ఆ పేర్లు వినిపించలేదు. చివరిలో చెప్పిన శ్రీకాంత్ పేరు చెవుల్లో మారుమోగిపోయింది.

సుబ్రమణ్యం హత్యకు సంతాపాన్ని తెలియజేస్తూ తీవ్రవాదులు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో పేరు కూడా శ్రీకాంత్ అని ఉన్న విషయం గీతకు గుర్తుకు వచ్చింది.

తీవ్రవాదిగానే కాకుండా తనతో యూనివర్సిటీలో చదివిన శ్రీకాంత్ కూడా ఆమె మదిలో మెదిలాడు.

తీవ్రవాద నాయకుడ్ని ఇంటర్వ్యూ చేయడానికి న్యూస్ ఎడిటర్‌కు తన ఆమోదాన్ని తెలియజేసింది.

**"కలుసుకునే** కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతాయి సిద్ధంగా ఉండాలి. గుడ్‌లక్" న్యూస్ ఎడిటర్ రాజారావు.

గీత సెలవు తీసుకుని బైటికి వచ్చింది. బైటికి వస్తుండగా గీతామాధురి శ్రీకాంత్‌ను గుర్తుచేసుకుంది.

అయిదేళ్ళ క్రితం ఆంధ్రా యూనివర్సిటీలో చదువు గుర్తుకు వచ్చింది. హాస్టల్‌లో చేరిన సంగతి ఆ సమయంలో జరిగిన శ్రీకాంత్‌తో పరిచయం వరుసగా ఆమెకు గుర్తుకు వచ్చాయి.

## 7

ఆంధ్రా యూనివర్సిటీ. రాత్రి పదకొండు గంటలు దాటి పోయింది. లేడీస్ హాస్టల్ నిశ్శబ్దంగా ఉంది. దాదాపు అన్నిరూముల్లోనూ లైట్లు ఆరిపోయి ఉన్నాయి. ఒకటి రెండు రూముల్లో మాత్రం లైట్లు వెలుగుతున్నాయి అలా వెలుగుతున్న రూంలో గీత జ్యోతి చదువుకుంటున్నారు.

ఎవరో గోడ గెంతిన శబ్దం. వారి రూంను అనుకుని ప్రహరీ గోడ ఉంది దొంగ ఎవడో ప్రవేశించాడన్న విషయం ఇద్దరికీ అర్థం అయింది. మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

కాపలాగా ఉన్న వాచ్‌మేన్ ఏమైనట్లు ఇద్దరు ఒకేసారి అనుకున్నారు. అడుగులు చప్పుడు నిశ్శబ్దంలో స్పష్టంగా వినిపిస్తున్నాయి.

తలుపు వద్దకు వచ్చి ఆగిపోయిన విషయం ఇద్దరికి స్పష్టంగా తెలుస్తోంది. ఊపిరి బిగపట్టారు వారు భయంతో బిర్రబిగుసుకుపోయి ఉంటున్న సమయంలో తలుపు చప్పుడైంది.

"ప్లీజ్ తలుపు తియ్యండి" ఎవరిదో అభ్యర్ధన.

గొంతు తెలిసిందే

"నేను శ్రీకాంత్‌ను. వెంటనే డోర్ తియ్యండి. ప్లీజ్" అతని మాటల్లో అభ్యర్ధన అర్థింపు ఉన్నాయి.

అతని గొంతుకని గీత గుర్తుపట్టింది.

"రాత్రిపూట ఎందుకొచ్చారు? ప్లీజ్ వెళ్ళిపోండి. లేకపోతే మీ మీద కంప్లైంటు చేస్తాను" జ్యోతి హెచ్చరించింది.

"ప్రాణాపాయంలో ఉన్నాను. ముందు తలుపు తీసి నేను చెప్పింది వినండి" అతని మాటల్లో అదోలాంటి జాలి.

గీత తలుపు తీసింది.

తుపాకీ గుండులో లోపలికి దూసుకుని వచ్చి వెంటనే లైటును ఆర్పి వేసాడు.

చీకట్లో జ్యోతి గీత బిక్కచచ్చిపోయారు.

"ప్లీజ్ ఏమీ అనుకోకండి. నన్ను తరుముతున్నారు." అతని మాటలు పూర్తికాక ముందే పది పదిహేను బూట్లు జతల టకటకలు ఆ హాస్టల్‌లో ప్రతిధ్వనించాయి.

ఈ హడావుడి గందరగోళం చూసి చాలా రూముల్లో లైట్లు వెలిగాయి. పడుకున్నవారు లేచిపోయారు.

"హాస్టల్ గోడ గెంతడం చూసాను సార్" అంటున్నారు ఎవరో.

క్విక్ వెతకండి పట్టుకోండి అరుపులు కేకలు దండింపులు నిశ్శబ్దంగా ఉన్న హాస్టల్ వాతావరణమంతా మారిపోయింది. చాలామంది రూముల్లోంచి బైటికి వచ్చి ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అన్ని గదులూ చెక్ చేయండి" అధికారి ఆదేశం. గీత తానున్న రూం కిటికీ కాస్త తెరిచింది.

హాస్టల్ వరండాలో పోలీసులు అటూ ఇటూ తిరుగుతున్నారు. శ్రీకాంత్ కోసం పోలీసులు వెతుకుతున్నారా? గీతలో ఆశ్చర్యం. పోలీసులు ఒక్కొక్క రూం తలుపు తెరిచి లోపల డ్రామా చూస్తున్నారు. వారి వెనక వాచ్‌మెన్. హాస్టల్ వార్డెను భయం భయంగా తచ్చాడుతున్నారు. గీతామాధురిలో ఆలోచనలు.

తమతో చదువుతున్న శ్రీకాంత్ మీద ఎంతో గౌరవభావం ఆమెకు ఉంది. ఇతర మగవాళ్ళ మాదిరిగా లేని అతని చూపులు ఆమెకు నచ్చుతాయి. ప్రమాదంలో ఉన్న శ్రీకాంత్‌ను ఎలాగైనా రక్షించాలి అనుకుంది.

శ్రీకాంత్ దగ్గరికి వచ్చి "ఈ మంచం కిందన దుప్పటి కప్పుకుని దూరిపోండి" అంటూ దుప్పటిని అందించి మంచాన్ని చూపించింది.

క్షణం ఆలస్యం చేయకుండా శ్రీకాంత్ దూరంగా ఉన్న మంచం కిందకి దూరిపోయాడు. ఎవరికీ అనుమానం రాకుండా సామాన్ల మాదిరిగా దుప్పటి చుట్టేసుకున్నాడు.

గీత పుస్తకాలను, ఇతర సామాన్లను మంచం కింద అడ్డంగా సర్దేసింది. తర్వాత తానే వెళ్ళి తలుపు తీసింది.

హాస్టల్‌లో అన్ని రూములు తెరిచే ఉన్నాయి. నిద్రమత్తులో ఉన్న అమ్మాయిలు రూములనుండి బైటికి వచ్చి ఆసక్తిగా చూస్తున్నారు.

హడావుడిగా తిరుగుతున్న కానిస్టేబుల్‌ను పిలిచి "ఎవరికోసం?" అని అడిగింది.

"శ్రీకాంతంట. మా ప్రాణం మీదకు తెచ్చాడు. నా నిద్ర చెడగొట్టి నన్ను తీసుకొచ్చాడు మా ఎస్.ఐ" అతని మాటలు పూర్తికాకముందే ఆ సబ్ ఇన్స్పెక్టరు అక్కడికి వచ్చాడు. తచ్చాడుతున్న కానిస్టేబుల్‌తో "ఈ రూం చూసారా?" అంటూ గది తలుపు తోసుకుని లోపలికి తలపెట్టాడు.

ఆ కానిస్టేబుల్ ఒకసారి లోపలికి వెళ్ళి "చూసాను సార్" అంటూ అతని వెనకే వెళ్ళిపోయాడు.

"హమ్మయ్య" గీత ఊపిరి పీల్చుకుంది.

హాస్టల్‌లో మరో అరగంట పాటు గందరగోళం కొనసాగింది.

వచ్చిన పోలీసు బృందం వెళ్ళిపోయింది. అంతవరకు ఆ గదిలో ఎవరూ ఏమీ మాట్లాడలేదు. మంచం కింద నుంచి బైటికి వచ్చిన శ్రీకాంత్ "థాంక్యూ గీతగారూ మీరు చేసిన సహాయాన్ని మరిచిపోలేను" అన్నాడు.

"పోలీసులెందుకు మీకోసం వెతుకుతున్నారు? మీరేం తప్పు చేసారు?" నెమ్మదిగా అడిగింది గీత.

"హత్య చేసారా?" జ్యోతి ఆతృతగా ప్రశ్నించింది.

"నిజంకోసం పోరాటం చేసాను. న్యాయం చేయాలని ప్రశ్నించాను. తప్పు చేసిన వారిని దండించాను. అందుకే నాపై తప్పుడు పిర్యాదులు. రెండు క్షణాలు ఆగి కాస్త మంచి నీళ్ళిస్తారా?" అడిగాడు.

గీత బాటిల్ తీసి అందించింది.

బాటిల్ దించకుండా గటగటా తాగేసాడు.

"వస్తానండీ. మళ్ళీ కలిసినప్పుడు వివరంగా మాట్లాడతాను" సమాధానం కోసం చూడకుండా చీకటిలో కలిసిపోయాడు.

గీతామాధురికి చాలాసేపటివరకూ నిద్రపట్టలేదు.

శ్రీకాంత్ కోసం పోలీసులు ఎందుకు గాలిస్తున్నారు? అతను చేసిన తప్పేమిటి? తమతోపాటు స్టూడెంటుగా ఉన్న వ్యక్తికోసం పోలీసులు అర్ధరాత్రిపూట గాలించవలసినంత తప్పు అతనేమి చేసి ఉంటాడు. గీతామాధురిలో ఆలోచనా పరంపర.

అదే శ్రీకాంత్‌తో గీతకు మొదటి పరిచయం.

అంతకుముందు చాలాసార్లు యూనివర్సిటీ కేంపస్‌లో అతడ్ని చూసింది. వివిధ సమస్యలపైన విద్యార్థుల మెస్ బిల్లుల సమస్యలపైనా అతను చేసిన ఉద్యమాల గురించి పోరాటాల గురించి వింది. కొన్నింటిలో తానుకూడా పాల్గొంది. అతను మాట్లాడుతుంటే మాటలు ప్రవాహం మాదిరిగా వచ్చేస్తుంటాయి. మాటలు తూటాల్లా తుపాకీ గుండుల్లా ఎదుటివారి మనసుల్లోకి దూరిపోతుంటాయి. ఎంతసేపు వింటున్నా ఇంకా వినాలనే అనిపిస్తుంది.

అయితే కలిసి మాట్లాడింది. లేదు పరిచయం చేసుకున్నది కూడా లేదు ఎక్కడో మనసు అట్టడుగు పొరల్లో ఇష్టంగా ఉండిపోయింది.

అర్ధరాత్రి రూంలో కలుసుకోవడమే మొదటి పరిచయం.

ఆ పరిచయమే చనువుకు దారితీసింది. సాన్నిహిత్యానికి దోహదం చేసింది.

**8**

"గీతగారూ..!"

యూనివర్సిటీ గ్రంథాలయంలో పుస్తకాల మధ్య నిశ్శబ్దంలోంచి వినిపించిన పిలుపుకు ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

నవ్వుతూ శ్రీకాంత్. మాసిపోయిన దుస్తులు. చెదిరిన క్రాప్. కళ్ళు మాత్రం తీక్షణగా ఉన్నాయి.

"ఒకసారి బైటికి వస్తారా?" ఆమె సమాధానం కోసం చూడకుండా తాను నడుచుకుని ముందుకు సాగిపోయాడు.

గీతామాధురి లేచి నిల్చుంది. లైబ్రరీ నుంచి బైటికి వచ్చింది. దూరంగా చెట్లకింద సిమ్మెంటు బెంచీపై శ్రీకాంత్ కూర్చుని ఉన్నాడు గీత అతని దగ్గరికి వెళ్ళిపక్కన కూర్చుంది.

"ఆ రోజు రాత్రి మీ రూములో మీరు కల్పించిన ఆశ్రయాన్ని మరిచిపోలేను. మీకు మరోసారి కృతజ్ఞతలు"

ఆమె చిన్నగా నవ్వింది తర్వాత. "మానవత్వం ఉన్న మనిషిగా ఎవరైనా అటువంటి పరిస్థితిలో ఉన్నవారికి సాయం చేస్తారు. నేను కూడా అదే చేసాను."

"అలా అనకండి. మీ నిర్ణయం ఎంత రిస్కుతో కూడుకున్నదో నాకు తెలుసు. పోలీసులు మీ రూంలోకి పూర్తిగా రాలేదు కాబట్టి సరిపోయింది వచ్చి వెతికితే మంచం కింద ఉన్న నేను పట్టుపడితే మీ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించలేకపోతున్నాను. ఎంతో ధైర్యంతో తీసుకున్న నిర్ణయం."

గీతకు అతని ప్రశంస ఆనందాన్ని కలిగించింది.

కానీ మొహంలో కనిపించనీయలేదు "అవునూ.. పోలీసులు మీకోసం ఎందుకు వెతుకుతున్నారు."

"అదంతా పెద్ద కథ."

"కథలో మీరు హీరోనా?"

"హీరోలాంటి కేరక్టరే, కానీ నన్ను విలన్ని చేసారు."

"అంటే?"

"నేను ఏ తప్పూ చేయలేదు. నిజం కోసం న్యాయం కోసం పోరాటం చేసాను. అందుకే నాకోసం పోలీసులు గాలించారు."

"ఏమైంది?"

"వీరబాబు అనే నిరుపేద యువకుడు డిగ్రీలో కొన్ని సబ్జక్టులో పాస్ చేయిస్తానని యూనివర్సిటీ గుమస్తా ఒకరు చెప్పడంతో పూర్తిగా నమ్మేసాడు. రెండు సబ్జెక్టులు పోతే వాటికి చెరో రెండువేలు ఆ గుమస్తాకి ఇచ్చాడు. అయినా పాస్ కాలేదు. ఆ విషయం రాడికల్ స్టూడెంట్ యూనియన్ లీడరుగా ఉన్న నా దృష్టికి వచ్చింది. ముందు వీరబాబుని తిట్టాను. అలా పాస్ కావాలను అనుకోవడం తప్పని అన్నాను. వీరబాబును మోసం చేసాడని తీసుకున్న డబ్బులు వెనక్కి ఇవ్వమని గుమస్తాను నిలదీసాను. వాడు నా మీద కూడా కలబడ్డాడు. ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. ఈడ్చి కొట్టాను. ఆ గుమస్తా ఆసుపత్రిలో చేరాడు అప్పటికే అతనికున్న రుగ్మతలతో అనుకోకుండా చనిపోయాడు. ఆ హత్యానేరం నామీద పడింది" శ్రీకాంత్ వివరంగా చెప్పాడు.

గీతామాధురి శ్రీకాంత్ చెప్పిలన్ విషయాన్ని ఆసక్తిగా వింది.

"అందుకే పోలీసులు నావెంటపడ్డారు. జరిగిన దాంట్లో నా తప్పులేదు. న్యాయం మీరే చెప్పండి."

గీతకు ఏమి మాట్లాడాలో తెలియలేదు.

"గుమస్తా చనిపోతాడని నేను అనుకోలేదు. అతడిని చంపాలన్న ఆలోచన కూడా నాకు లేదు. అయినా హత్యానేరం నామీద పడింది."

"ఇంతకీ ఇప్పుడు ఏం చేస్తున్నారు?"

"నా కేరక్టరు మంచిది కాదని యూనివర్సిటీ నుంచి నన్ను సస్పెండు చేసారు పోలీసులు నా గురించి గాలిస్తున్నారు."

"ఈ పరిస్థితుల్లో ఇంత ధైర్యంగా బైటికి రావడం" ఆమె మాటలు మధ్యలోనే ఆగిపోయాయి.

"నాకేం భయంలేదు. మిమ్మల్ని కలిసి మీకు వాస్తవం చెప్పాలని అనుకున్నాను. చెప్పాను. నన్ను పోలీసుల నుంచి రక్షించినందుకు మీకు కృతజ్ఞతలు కూడా చెప్పడం కనీస ధర్మం అనుకున్నాను అందుకే వచ్చాను. అంతే"

"ఎక్కడికి వెళతారు?"

"ఎక్కడికి వెళ్ళాలో నాకే తెలియడంలేదు. ఈ దోపిడీ వ్యవస్థ మీద అన్యాయాలకు అక్రమాలకు కొమ్ము కాసే వారిపైనా అసహ్యం పేరుకుని పోయింది. ఈ వ్యవస్థలో కుళ్ళుని కడిగేయడానికి నాకులాంటి మరికొంతమందిని తయారు చేయాలని అనుకుంటున్నాను. యూనివర్సిటీలో నా చదువుకు కూడా గుడ్‌బై చెబుతున్నాను."

"చదువు మానేస్తున్నారా?"

"ఈ చదువు వల్ల ఏ ప్రయోజనం నాకు కనిపించడంలేదు. పుస్తకాలుకన్నా నిరుపేదల జీవితాలను చదవాలని అనిపిస్తోంది వారితో కలిసి జీవించాలని ఉంటోంది. వారితో కలిసిపోయి వారి సమస్యలపై పోరాటం చేయాలని అనిపిస్తోంది."

గీతామాధురి ఏమి మాట్లాడలేకపోయింది.

యూనివర్సిటీ కేంపస్ చాలా కోలాహాలంగా ఉంది. చాలామంది స్టూడెంట్స్ లైబ్రరీకి వస్తున్నారు. కొంతమంది కేంటిన్ వైపు వెళుతున్నారు.

"గీతగారూ మీరంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. మీ నెమ్మదితనం చాలా ఇష్టం. కొంతకాలంగా మిమ్మల్ని ప్రత్యేకంగా గమనిస్తున్నాను. ఇష్టమైన వ్యక్తికి అయినా వాస్తవాలు చెప్పి వోడ్కోలు తీసుకోవాలని ఇక్కడికి వచ్చాను."

గీతామాధురి కళ్ళు చెమర్చాయి.

యూనివర్సిటీలో ఆమె అంటే చాలామందికి ఇష్టముంది ఎవరూ ఇంతవరకు డైరెక్టుగా చెప్పలేదు. ఆమెకు టీన్‌ఏజ్‌లో కూడా ఎవరూ ఇటువంటి మాటలు చెప్పలేదు. అందుకే మనసు ఏదోలా అయిపోయింది.

శ్రీకాంత్ మాటలు హృదయ స్పందన కలిగించాయి.

"వస్తాను. ఎప్పుడైనా అవకాశం ఉంటే కలుస్తాను" వెనక్కి తిరిగి చూడకుండా మెల్లగా నడుచుకుని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మరెప్పుడూ కనిపించలేదు.

యూనివర్సిటీలో పోస్టుగ్రాడ్యుయేషను పూర్తి అయిన తర్వాత జర్నలిజంలో చేరి అందులో కూడా డిప్లొమా సంపాదించింది. ఆ తర్వాత విజయం పత్రికలో స్టాఫ్ రిపోర్టరుగా ఉద్యోగంలో చేరిపోవడం క్రమంగా అతడిని మరిచిపోయింది. ఇది జరిగి అయిదారేళ్ళు అయిపోయింది.

మళ్ళీ ఇన్ని సంవత్సరాల తర్వాత శ్రీకాంత్ పేరు గుర్తుకు వచ్చింది. అదీ తీవ్రవాద నాయకుడి హోదాలో. అతనూ ఇతనూ ఒక్కరేనా? ఈ వ్యవస్థమీదా? వ్యవస్థలో జరుగుతున్న అన్యాయాలు దోపిడీలపై నాకోపంతో శ్రీకాంత్ మావోయిస్టుగా మారిపోయాడా? ప్రెస్‌నోట్‌లో ఉన్న శ్రీకాంత్ పేరు ఇతనిదేనా? ఈ విషయం ఎలాగైనా తెలుసుకోవాలి" అనుకుంది.

అప్పుడు గుర్తుకు వచ్చింది రూమ్మేట్ జ్యోతి.

జ్యోతి హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో స్టెనోగా పనిచేస్తోంది. ఇద్దరిమధ్యా చాలా సంవత్సరాల గేప్ వచ్చింది. ఆమె ఫోను నంబరును సంపాదించి ఫోన్ చేసింది.

క్షేమ సమాచారాలు అడిగిన తర్వాత "యూనివర్సిటీలో మనతో చదివిన శ్రీకాంత్ ఏమి చేస్తున్నాడో తెలుసా?" అని ప్రశ్నించింది.

"నక్సలైటు శ్రీకాంతా?" ఎదురు ప్రశ్న.

"శ్రీకాంత్ నక్సలైటా?" గీతలో ఆశ్చర్యం.

"పత్రికారంగంలో ఉన్న నీకు ఈ విషయం తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. అతను మావోయిస్టుగా మారిపోయి ఉద్యమంలో ఎప్పుడో చేరిపోయాడు. అతని గురించి నాకు కూడా వివరాలు పెద్దగా తెలియవు కానీ పెద్ద నాయకుడిగా ఉన్నాడన్న విషయం మాత్రం తెలుసు.

వ్యవస్థ మీద ఉన్న వ్యతిరేకత పెరిగి పెరిగి తీవ్రవాద ఉద్యమం వైపుదారితీసిందా? గీతలో ఆలోచనలు. అంతవరకు తన మనసులో అస్పష్టంగా ఉన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ఆ రోజే బలంగా నిర్ణయించుకుంది.

## 9

విజయనగరం బస్టాండు చిత్తడిచిత్తడిగా ఉంది. కురుస్తున్న వర్షం తగ్గి రెండురోజులు అయిపోయినా వాతావరణం చల్లగా ఉంది. ఎదురుగా టీ స్టాల్ కనిపిస్తోంది. వేడి వేడి టీ తాగాలని మనసు పీకుతున్నా తన కోసం వచ్చేవారు మిస్సవుతారని నిగ్రహించుకుంది.

చేతిలో ఉన్న బాగ్‌ను కిందపెట్టింది.

రెండుగంటలపాటు ప్రయాణం వల్ల అలసట అనిపిస్తోంది కానీ ఆమె మనసులో అలసటకన్నా ఆతృతే కనిపిస్తోంది.

పక్కనున్న కిళ్ళీ కొట్టులో వేలాడదీసిన కొత్త పత్రికల ముఖచిత్రాలను పదేళ్ళ కుర్రాడు ఆసక్తిగా చూస్తున్నాడు.

గీతకు అసహనంగా ఉంది.

"విజయం రిపోర్టరు గీతగారు మీరేనా?"

గీత పక్కకు నెమ్మదిగా అడిగాడో యువకుడు. అతడికో పాతికేళ్ళు ఉంటాయి. మాసిపోయి పెరిగిపోయిన గెడ్డంతో చాలా రెక్లెస్‌గా ఉన్నాడు.

"అవును" అంది.

"మిమ్మల్ని రిసీవ్ చేసుకుని తీసుకుని రమ్మన్నారు. నా వెనుక రండి."

కిందనున్న బాగ్‌ను అందుకుని గీత అతడ్ని అనుసరించింది.

ఆగి ఉన్న ఆర్టీసి బస్సును ఎక్కించి "ముందు సీట్లో కూర్చోండి. టిక్కెట్లు నేనే తీస్తాను" మరో మాట లేకుండా వెనక సీటులోకి వెళ్ళిపోయాడూ.

బస్సు నెమ్మదిగా బయలుదేరింది.

బస్సుతోపాటు గీత ఆలోచనలుకూడా ముందుకు సాగుతున్నాయి.

న్యూస్ ఎడిటర్ రాజారావు ఎక్కడో అడవుల్లో ఉంటున్న తీవ్రవాద నాయకుడితో తనకు ఇంటర్వ్యూ ఏర్పాటు చేయడం రెండు మూడు రోజులుండాలని అనుకున్నా తాను వంటరిగా బయలుదేరడం అన్నీ గుర్తుకు వస్తున్నాయి.

బస్సు విజయనగరం దాటిపోయి పల్లెబాట పట్టింది. అలసటగా ఉండటంతో కళ్ళు మూసుకుంది గీత. రెండు మూడు గంటల పాటు బస్సు ముందుకు సాగింది. అప్పుడప్పుడు కళ్ళు తెరిచి కిటికీలోంచి బైటికి చూసేది మళ్ళీ కళ్ళు మూసుకునేది. రెండు గంటల తర్వాత బస్సు చిన్న పల్లెటూరులో ఆగింది.

"దిగండి మేడం" మెల్లగా వెనకనున్న వ్యక్తి చెప్పాడు.

గబుక్కున బేగ్ పట్టుకుని లేచి నిల్చుంది. అప్పటికే ఆ వ్యక్తి బస్సు దిగిపోయి ముందుకు నడుచుకుని వెళ్ళిపోయాడు. గీత అతడిని అనుసరించింది.

నాలుగైదు ఫర్లాంగులు నడిపించి దూరంగా ఉన్న గెస్టుహౌసు దగ్గరికి తీసుకుని వెళ్ళాడు. తాను లోపలికి రాకుండా "మీరు లోపలికి వెళ్ళి రెండవ నంబరు గదిలో విశ్రాంతి తీసుకోండి. మిమ్మల్ని ఎవరూ ఏమీ అడగరు. అన్ని ఏర్పాట్లు చేసాం. భోజనం చేసిన తర్వాత మిమ్మల్ని తీసుకుని వెళ్ళడానికి వస్తారు"

"మీరు రారా?"

"నాకు అప్పగించిన పని పూర్తి అయిపోయింది" మరో మాటకు అవకాశంలేకుండా అతను అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

గీత వంటరిగా మిగిలిపోయింది.

తర్వాత వాచ్‌మేన్ వచ్చి బేగ్‌ను తీసుకుని రెండవ నంబరు గదిలోకి తీసుకుని వెళ్ళి "మీకు ఏం కావాలన్నా బెల్ కొట్టండి" అంటూ వెళ్ళిపోయాడు.

అరగంటలో స్నానం చేసి ఫ్రెష్‌గా తయారైంది.

తర్వాత బెల్‌కొట్టి వాచ్‌మన్ లోపలికి వచ్చాడు తీసుకుని వచ్చిన భోజనం కేరేజీని టేబుల్‌పై పెట్టాడు. వాటర్ బాటిల్‌ను కూడా పక్కన పెట్టాడు. తర్వాత వస్తాను అంటూ బూటికి వెళ్ళిపోయాడు. గీతకు అప్పుడు టైం గుర్తుకు వచ్చి వాచ్ చూస్తే రాత్రి ఏడైంది.

గెస్టు హౌసులో లైట్లు వెలుగుతున్నాయి.

చలిగాలి వీస్తుండటంతో కిటికీ తలుపు దగ్గరకు వేసింది. మరో అరగంట తర్వాత భోజనాన్ని ముగించింది.

రాత్రి పదిగంటలకు మేడం అంటూ ఉదయం తనతోపాటు వచ్చిన యువకుడు తలుపు తట్టాడు అతని గొంతు గుర్తుపట్టి మెల్లగా తలుపు తీసింది.

"మీకోసం జీపు సిద్ధంగా ఉంది. తయారవండి."

"ఈ రాత్రా?"

"రాత్రిపూటే ప్రయాణం."

ఏమి చేయాలో గీతామాధురికి తెలియలేదు. ఏ ఊరో తెలియని ప్రాంతంలో ముక్కూ మొహం తెలీని మగవాళ్ళ వెనుక రాత్రిపూట వంటరిగా వెళ్ళడం ఆమెకు ఏదోలా అనిపించింది. తాను ఈ పనికి ఒప్పుకున్నప్పుడే ఇటువంటి పనులు ఉంటాయని ఆమెకు తెలుసు. అందుకే కర్తవ్యం ముందు ఇటువంటి చిన్నచిన్న విషయాలను పట్టించుకోకూడదని మనసుకు సర్దిచెప్పుకుంది.

పావుగంటలో తయారై బాగ్‌తో బైటికి వచ్చింది. గెస్టు హౌసు గోడపక్కన పాత జీపు ఉంది.

డ్రైవరు పక్కన ఫ్రంట్ సీట్లో కూర్చుంది. ఆమె కూర్చోగానే జీపు ముందుకు కదిలింది.

ఊరు దాటిన తర్వాత కొండమలుపు పక్కనుంచి ఉన్న కాలిబాట వెంబడి జీపు పరుగులు తీస్తోంది. జీపు వెనుక మరో నలుగురైదుగురు ఉన్నారు.

కొండదారి గతుకులమయంగా ఉంది చాలా ప్రాంతాలు ఎగుడుదిగుడుగా ఉన్నాయి. అందువల్ల కుదుపులకు జీపు అటూ ఇటూ కదులుతోంది. చల్లటిగాలి శరీరానికి తగులుతోంది. కళ్ళు మూతలు పడుతున్నా గీతకు నిద్రరావడంలేదు.

జీపులో కూర్చున్నవారు ఏమీ మాట్లాడటం లేదు. రాత్రి నిశ్శబ్దం భయంకరంగా ఉంది. ఊరు దాటిపోయి అడవిలోపలికి చాలా దూరం వచ్చేసారు. చెట్లు తప్ప ఏమీ కనిపించడంలేదు. ఎక్కడో దూరంలో ఉన్న జంతువుల అరుపులు అప్పుడప్పుడూ వినిపిస్తున్నాయి.

మూడు గంటలు ప్రయాణించిన తర్వాత దూరంగా మినుకు మినుకు మంటున్న లైట్లను చూసి జీపుని డ్రైవరు ఆపాడు.

అలసటతో చల్లగాలికి నిద్రపోయిన గీత లేచింది. జీపులో ఉన్న వారంతా కిందకు దిగడంతో డ్రైవరు జీపును వెనక్కి మలుపు తిప్పాడు. తర్వాత వచ్చిన తోవనే వెనక్కి వెళ్ళిపోయాడు. జీపునుంచి దిగినవారు గీతను పక్కనున్న రాయిపై కూర్చోపెట్టారు.

"గూడెంలోకి వెళ్ళొస్తాం. అంతవరకూ వెయిట్ చేయండి" వారిద్దరూ దీపం వెలుగువైపు నడుచుకుని ముందుకు వెళ్ళిపోయారు. మిగిలిన ముగ్గురూ గీతదగ్గరే ఉండిపోయారు.

ఆకాశంలో చుక్కలు మినుకు మినుకుమంటున్నాయి. ఇంకా పూర్తిగా పైకి రాని చంద్రుడు కొద్దికొద్దిగా మెరుస్తున్నాడు. వాతావరణం చల్లగా ఉండటంతో బేగ్‌లో నుంచి షాల్ బైటికి తీసి భుజం చుట్టూ కప్పుకుంది.

**అందరూ** గీతనే విచిత్రంగా చూస్తున్నారు.

"మనం ఎక్కడున్నాం?" అడిగింది.

ఎవరూ ఏమీ సమాధానం చెప్పలేదు అందులో ఉన్న యువకుడు "మనం వెళ్ళవలసిన ప్రాంతానికి దగ్గరగానే ఉన్నాం. కమాండర్ అన్నని రేపు ఉదయం కలుస్తాం. అంతవరకు వెయిట్ చేయాలి" వారితో అన్నాడు. మనం ఉన్న ప్రాంతం ఎక్కడుంది?"

ఎవరూ నోరు మెదపలేదు.

"మీరు తీవ్రవాదులేనా?"

ఎవరినుంచీ సమాధానం రాకపోవడంతో గీత ఆశ్చర్యపోయింది.

తర్వాత వారితో కలిసి ఉన్న వ్యక్తి "మీతో మాట్లాడటానికి మాకు అనుమతి లేదు" అన్నాడు.

గీతా మాధురి ఆశ్చర్యంగా చూసింది.

తర్వాత "అంత నియంతృత్వమా?" అంది.

"తప్పుగా అనుకోకండి. ఇది మాకు మేము ఏర్పాటు చేసుకున్న క్రమశిక్షణ. ఒక సిద్ధాంతం కోసం ఆశయం కోసం కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఈ ఉద్యమంలో ఇటువంటి నిబద్ధత ఎంతో అవసరం. ఇది ఒకలాంటి క్రమశిక్షణ వంటిదనే అనుకోవాలి" మరో యువకుడు చెప్పాడు.

వారితో మాట్లాడటం వృధా అనుకుంది గీత గంట తర్వాత అంతకు ముందు వెళ్ళిన ఇద్దరు యువకులు జీపు దగ్గరికి వచ్చారు. వారితో ఇద్దరు స్త్రీలు కూడా ఉన్నారు. తర్వాత అందులో ఓ వ్యక్తి గీత వైపు తిరిగి "ఈ రాత్రి అంతా మీరు అడవిలో ప్రయాణించవలసి ఉంటుంది. మీకు తోడుగా ఈ ఆడవాళ్ళిద్దరూ ఉంటారు" మరో మాటకు అవకాశం లేకుండా వారిద్దరు చీకటిలో మాయమైపోయారు.

ఇద్దరు ఆడవాళ్ళు తనతో కలవడం కాస్త ఊరట కలిగించింది.

వచ్చిన వారిద్దరూ గిరిజన స్త్రీలు నల్లగా ధృఢంగా ప్రౌఢంగా ఉన్నారు. మొదట గమనించలేదు కానీ ఇద్దరి వద్దా రెండు తుపాకులు ఉన్నాయి.

"పదండి" కొండ పక్కకు దారితీసారు.

టార్చిలైటు వెలుగులో వారిని అనుసరించింది గీత

తుప్పలు డొంకలు దాటుకుంటూ చీకట్లో నడవడం కొంచెం కష్టంగానే అనిపిస్తోంది అయినా కర్తవ్యం ముందు కష్టం గుర్తుకు రావడంలేదు. అడవీ ప్రాంతంలో సన్నని కాలిబాటు మాత్రం ఉంది. అది కూడా సరిగా కనిపించడంలేదు. దానిని చూసుకుని అడుగులో అడుగు వేసి నడక సాగించింది.

అర్ధరాత్రిలో ఎటువైపు ఎక్కడికి వెళుతున్నామో తెలియని పరిస్థితిలో మూడు గంటల పాటు ఇద్దరితోపాటు కలిసి నడిచింది.

తూరుపు దిక్కున వెలుగు రేఖలు కనిపిస్తున్నాయి.

ఆ యువతులిద్దరూ కలిసి నడవడంలో గీతతో మాటలు కలిపారు. రాజకీయాలు పత్రికలు వంటి అనేక విషయాలను వారు చర్చించుకున్నారు. వారు వివిధ రకాల విషయాలు చెబుతున్నా ఉద్యమం గూర్చి పెదవి విప్పడంలేదు.

దూరంగా జలపాతం కనిపించింది.

ఎత్తయిన ప్రదేశం నుంచి నురుగలు కక్కుతూ నీళ్ళు కిందకు జాలువారుతున్నాయి. గాలిలో తేమ శరీరానికి చల్లగా తగులుతోంది.

మరి నడవలేమని కాళ్ళు మొరాయిస్తున్నాయి. రాత్రంతా నిరంతరాయంగా నడవడం వల్ల అలసట నిస్సత్తువ కమ్ముకుంటున్నాయి.

ముగ్గురూ ఆగిపోయారు.

"ఈ ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకుందాం" గీత సమాధానం కోసం చూడకుండా వారి వద్దనున్న తుపాకులను పక్కన పెట్టారు.

అరగంటలో స్నానం చేసి గీత తయారైపోయింది.

అప్పటికి తెల్లవారిపోయింది వెలుగురేఖలు విచ్చుకున్నాయి.

అడవిలో చెట్లుమీద రకరకాల పిట్టలు గోలగోలగా అరుస్తున్నాయి. జలపాతం హోరు మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది సూర్యోదయ కిరణాలు చెట్ల మధ్యలో నుంచి పొడుచుకుని వస్తున్నాయి.

గీత కెమెరా తీసి చుట్టుపక్కల అందమైన ప్రదేశాలను ఫోటోలుగా తీసి కెమెరాలో బంధించింది జలపాతాన్ని రెండు మూడు ఏంగిల్సులో తీసింది.

తర్వాత ముగ్గురు ముందుకు కదిలారు.

## 10

గుబురుగా ఉన్న చెట్లు. ఆ మధ్యలో ఖాళీ స్థలం. అక్కడ చిన్నచెట్టు. ఆ చెట్టుకింద నీడలో చాప పరిచి ఉంది. దానిమీద ముగ్గురు యువకులు కూర్చుని ఉన్నారు. వారి పక్కన పుస్తకాలు తుపాకులు చేతి సంచులు వంటి సామగ్రి ఉంది.

ఆలీవ్ గ్రీన్ దుస్తులు ధరించిన నలుగురు యువకులు నాలుగు దిక్కుల్లోనూ కాపలాగా నిల్చున్నారు.

దూరం నుంచి వారిని చూడటం గీతకు విస్మయంగా ఉంది.

నిర్మానుష్యమైన అడవిలో వారి కదలికలు ఆశ్చర్యం కలిగించాయి.

ఇద్దరు యువతులు గీతను అక్కడికి తీసుకుని వచ్చారు. ఇద్దరు యువతులు గీతను అక్కడికి తీసుకుని వచ్చారు. అంతవరకూ కూర్చుని పుస్తకాలు చూస్తున్నవారు తలెత్తారు. కూర్చున్నవారిలో ఇద్దరూ లేచి నిల్చుని "అన్నా మేం ఏర్పాట్లు చూస్తాం" అంటూ కదిలారు.

రెండు జతల కళ్ళు కలుసుకున్నాయి.

"శ్రీకాంత్" అప్రయత్నంగా గీత.

"గీత.. గీతా మాధురి"

ఇద్దరిలోనూ చెప్పలేని ఆశ్చర్యం. రెండు నిమిషాల పాటు ఎవరి నోటి వెంబడి మాటలు రాలేదు. తర్వాత శ్రీకాంత్ తేరుకుని "లేడీ రిపోర్టరు ఇంటర్వ్యూ కోసం అడిగిన విషయం చెప్పారు. మా భావాలు ఆలోచనలు కూడా ప్రజలకు తెలియజేయాలని

అంగీకరించాను. విజయం పత్రిక సర్క్యులేషను ఎక్కువగాబట్టి వాణి ఎక్కువమందికి చేరుతుందని ఆమోదించారు. విజయం రిపోర్టరుగా నువ్వు వస్తావని అసలు ఊహించలేకపోయాను'' అన్నాడు.

గీతకు అంతులేని ఆశ్చర్యంగా ఉంది.

శ్రీకాంత్ పెద్దగా మారలేదు. మనిషి కాస్త నల్లబడ్డాడు. అతని చూపులో తీక్షణత తగ్గలేదు కళ్ళల్లో చురుకుతునం పోలేదు. మనిషి కాస్త సన్నబడ్డాడు. అతని కళ్ళల్లో ఏదో తెలియని తపన. గమనించింది.

''శ్రీకాంత్ బాగున్నావా? యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ ఇప్పటికీ నీలో మార్పులేదు. నక్సలైటు ఉద్యమంలో పనిచేస్తున్నావని విన్నాను. కానీ ఇంత పెద్దస్థాయి నాయకుడివని అనుకోలేదు'' అంది. గీతకు శ్రీకాంత్‌తో పరిచయం కొద్దిగా ఉంది అయినప్పటికీ సంబోధనలో ఏకవచనం ఎలా వచ్చిందో అర్ధంకాలేదు.

''నేను నాయకుడ్ని కాదు. ఈ ఉద్యమంలో పనిచేస్తున్నవారంతా నాయకులే. వారంతా వారి స్థాయిలో నాయకత్వాన్ని వహిస్తుంటారు. వారి పనుల ఆధారంగానే కేడర్లు ఉంటాయి.''

గీత హేండ్‌బేగ్ కిందన పెట్టి చతికిల పడిపోయింది.

''రాత్రంతా కొండల్లో అడవుల్లో ప్రయాణం. పూర్తిగా అలసిపోయాను నిద్రకూడా లేదు. నిన్ను కలుసుకోవాలంటే ఇంత శ్రమపడాలా? నువ్వు ఎవరికీ అందుబాటులో ఉండవా?'' ప్రశ్నించింది.

''పోలీసుల గురించి నీకు తెలియంది ఏముంది? మా వాళ్ళు ఎక్కడ కనిపించినా పిట్టల్ని కాల్చేస్తున్నారు. నన్ను కలవడానికి పత్రికా విలేఖరి వస్తున్నందున వారికి ఎటువంటి వాసన తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. అందుకే అన్ని ఏర్పాట్లు. అంతే.''

ఓ యువకుడు ఫ్లాస్కుతో టీని తీసుకుని వచ్చాడు గ్లాసులు కూడా తీసుకుని వచ్చి ఫ్లాస్కు పక్కన పెట్టాడు శ్రీకాంత్. ఫ్లాస్కులో టీని గ్లాసుల్లోకి ఒంపి గీతకు ఒకటి అందించాడు. ''నువ్వు నాకు ఇదివరకే తెలుసునన్న విషయం మరిచిపో. లేకపోతే పోలీసులు నీ వెంట కూడా పడతారు'' అన్నాడు.

గీత నవ్వి ఊరుకుంది.

తర్వాత అతనివైపు తిరిగి ''శ్రీకాంత్ నువ్వు ఎందుకిలా మారిపోయావన్న విషయం ఇప్పటికీ నాకు అంతు చిక్కడంలేదు.''

శ్రీకాంత్ దీర్ఘంగా నిట్టూర్చి తర్వాత ''నేను ఏమీ మారిపోలేదు. ఒక చెంపమీద కొడితే మరో చెంప చూపించి కొట్టినవాడిలో జాలి కలిగించి అతడి మనసును మార్చాలని అనుకునే అహింసావాదిని కాదు. సామాన్యుల్ని, అమాయకుల్ని పీల్చి పిప్పి చేస్తున్న దోపిడీ వ్యవస్థ అంటే భయం లేనివాడిని. అన్యాయాలు చేస్తూ అందలాలు ఎక్కుతున్నవారంటే అసహ్యం. మనషుల్ని మనుషులుగా చూడలేనివారంటే కపి కుక్కలు పందులు గొర్రెలు. మేకలు వంటి జంతువుల కన్నా సాటి మనిషిని మనిషిగా చూడలేని వారంటే కోపం. ఈ విధంగా తయారైన వ్యవస్థ మీద అసహనం పేరుకుని పోయింది. అందుకే ఈ వ్యవస్థపైనే యుద్ధం ప్రకటించాలని నిశ్చయించుకున్నాను. అటువంటి సమయంలో నా ఆలోచనలకు అనుగుణమైన సంస్థ. లేదా వేదిక ఉంటే బాగుణ్ణని అనుకునేవాడిని. ఆ సమయంలో నాకు ఈ సంస్థ కనిపించింది సామాన్య కార్యకర్తగా ఇందులో ప్రవేశించాను. అంచెలంచెలుగా ఎదిగి దళ కమాండర్ స్థాయికి చేరుకున్నాను'' అన్నాడు.

గీతా మాధురి ఏమీ మాట్లాడలేదు. శ్రీకాంత్‌లో ఆవేశం తను నమ్మిన సిద్ధాంతాన్ని తన వాదాన్ని బలపరుచుకోవడానికి చెబుతున్న ధృఢత్వానికి ఆశ్చర్యపోయింది. శ్రీకాంత్ జేబులో నుంచి సిగరెట్ తీసి వెలిగించాడు.

గీత అతనివైపు అదోలా చూస్తూ ''నేను ఉన్నంతసేపూ మానేయలేవూ?'' అంది.

ఏమనుకున్నాడో ఏమో కాలుతున్న సిగరెట్టును దూరంగా విసిరేసి నవ్వుతూ ఆమెవైపు చూసాడు.

"థాంక్యూ శ్రీకాంత్."

"ఎన్నాళ్ళ నుంచి ఈ విలేఖరి ఉద్యోగం చేస్తున్నావు?"

"అయిదేళ్ళయింది."

"విలేఖరి ఉద్యోగం బాగుందా?"

"నాకు ఎంతో నచ్చింది. రోజూ చేసేది ఒకేలాంటి పని అయినప్పటికీ ఇందులో విసుగుపుట్టదు. ప్రతిరోజూ కొత్తదనంగానే ఉంటుంది పనిచేసే రోజు సెలవుపెడితే ఏదోలా ఉంటుంది" అంది.

"ఈ వృత్తిలో ఉన్నవారిలో చాలామంది అవినీతిపరులుగా ఉన్నారని బ్లాక్ మెయిలర్లుగా ఉన్నారని అంటారు."

"ఉండవచ్చు ఉండటానికి కూడా పత్రికల యాజమాన్యాలే కారణం. పనిచేస్తున్నవారికి జీతాలు ఇవ్వరు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవారి పరిస్థితి మరీదారుణంగా ఉంటుంది వారు ప్రకటనలు సేకరించి తెస్తేనే జీతాలు ఇస్తారు. అదికూడా నామమాత్రంగానే ఇస్తుంటారు. కొన్ని మేనేజిమెంట్లు అసలు ఇవ్వరు. ఈ వృత్తి మీద ఆధారపడిన వారు ఎలా బతగ్గలరు? అందుకే తమ పరపతిని అడ్డుపెట్టుకుని మోసాలకు పాల్పడున్నారు. ఇటీవల కాలంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువైపోయింది విలేఖర్లు అంటే చాలామందికి అసహ్యం కలుగుతోంది. నా వంటి స్టాప్ రిపోర్టర్లలలో కూడా కొంతమంది అవనీతిపరులు ఉంటారు కానీ నాలాంటి స్టాఫ్ రిపోర్టర్లకు ఉద్యోగస్తుల మాదిరిగా నెలవారి జీతాలు వస్తున్నందున గ్రామీణ విలేఖర్లంత దారుణంగా ఉండదు."

"యాజమాన్యాలను మార్చలేమా?"

"ఇదో విష సర్కిల్ శ్రీకాంత్. ఈ పని చేయడం అలవాటు పడిన వారు మరో పని చేయలేరు అందువల్ల జీతాలు ఇవ్వకపోయినా ఒక పత్రిక కాకపోతే మరో పత్రిక మారుతూ ఇదే పనిని చేస్తుంటారు."

"పత్రికా రంగంలో మంచి యాజమాన్యాలు రావాలని కోరుకోవడం తప్ప మనం ఏమి చేయగలం?"

"అవును అంతే కదా?"

"మొత్తం మీద నీకు నచ్చిన రంగంలో కొలువు కుదిరిందన్నమాట. కొలువు అనే పదాన్ని వత్తి పలికాడు శ్రీకాంత్.

అతను అలా అనడం గీతకు ఏదోలా అనిపించింది.

"సాధారణంగా నేను పత్రికలకు దూరంగా ఉంటాను. మీ విజయం పత్రిక నుంచి ఇంటర్వ్యూ కోసం ప్రతిపాదన వచ్చింది. మా కేడర్‌లో ఇంటర్వ్యూలు ఇచ్చేంత పెద్దవాడిని కాదు కానీ ఈ ఉద్యమంలో నాకు కీలకమైన భాగస్వామ్యం ఉండటం వల్ల ఈ ఏర్పాటు జరిగింది. తీవ్రవాదం పట్ల కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. దానిని తొలగించడానికి మా సిద్ధాంతం. మా పోరాట విధానం తెలియజేయడానికి మీడియా అవసరం ఏర్పడింది. నన్ను ఇంటర్వ్యూ చేయడానికి నువ్వు వచ్చావన్న విషయం తెలిసిన దగ్గర నుంచి నాకు ఏదోలా ఉంది" అన్నాడు.

హేండ్ బేగ్‌లో నుంచి మినీ టేపు రికార్డరు బైటికి తీసింది.

"ఇంటర్వ్యూ అనే కన్నా ఇష్టాగోష్టిగా మాట్లాడుకుంటే బాగుంటుందేమో?" శ్రీకాంత్.

"ఎలా అయినా పర్వాలేదు"

ప్రశ్నల పరంపర మొదలైంది.

"మీ ఉద్యమం ఎందుకోసం?"

"సమాజంలో అడుగడుగునా అన్యాయాలు జరుగుతుంటే వాటిని చూస్తూ ఊరుకోకూడదు. పేదవాళ్ళపై ధనవంతులు చేస్తున్న దమనకాండను ఎదిరించాలి. అందుకే ఈ ఉద్యమం."

"అన్యాయాలను ఎదిరించటానికి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సమంజసమా చెప్పండి?"

"కొన్ని పరిస్థితులలో తప్పడంలేదు. చట్టాన్ని కాపాడవలసిన వారుకూడా అవినీతిలో కూర్చుకునిపోతున్నారు. ధనవంతులకు రాజకీయనాయకులకు వత్తాసు పలుకుతున్నారు. అందుకే తప్పడంలేదు"

"మీ ఆశయం మంచిది అయినప్పుడు అడవుల్లో ఎందుకు దాక్కోవాలి? ఈ పోరాటం నేరుగా చేయవచ్చుకదా?"

"నేరుగా చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయి."

"మావోయిస్టులో నక్సలైట్లో ఎవరైతే ఏమిటి మీ వాళ్ళు సామాన్యులను కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.సమాజం పుచ్చిపోయింది. దోపిడీ మయం అయిపోయింది అని మాట్లాడేవారే దోపిడీలను చేస్తున్నారు. ఆశయం ముసుగులో కాంట్రాక్టర్లను ధనవంతులను బెదిరిస్తున్నారు. మీ మాట వినని వారిని దండిస్తున్నారు. మీ చెప్పుచేతుల్లోకి తీసుకుంటున్నారు. మీమీద చాలామంది ఆరోపణలు చేస్తున్నారు"

శ్రీకాంత్ రెండు నిమిషాలు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా "వారి ఆరోపణల్లో కొంత వాస్తవం ఉందేమో? మా ఉద్యమం బలంగా ఉందని తెలుసుకుని దీనిని అడ్డుపెట్టుకుని కొంతమంది నకిలీలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. అటువంటివారి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మేము అన్యాయంగా ఎవరినీ బెదిరించడంలేదు. దినదినగండంతో బతుకులు వెళ్ళదీస్తున్న నిరుపేదల్ని ఆదుకోవడానికి మా పోరాటానికి నిధులు అవసరం. పేద ప్రజల పొట్టలు కొట్టి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్న అవినీతి పరుల నుంచి మా ఉద్యమం నడిపించడానికి వనరులు సేకరించడం తప్పుకాదు. రాజకీయ పార్టీలన్నీ బహిరంగంగానే ఈ వసూళ్ళు పార్టీ ఫండు పేరుతో వసూలు చేస్తున్నాయి కదా?"

కొన్ని పాయింట్లను గీత పుస్తకంలో రాసుకుంది.

"వ్యక్తి హింసను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు?"

"సమాజంలో ఒక వ్యక్తి చీడపురుగు మాదిరిగా తయారైనట్లయితే అతని కారణంగా మొత్తం సమాజం కలుషితం అయిపోతుంది. అటువంటి చీడపురుగుల్ని సమాజం నుంచి తొలగించవలసిన అవసరం ఉంది."

"ఎంతమందిని అలా చేస్తారు?"

"సమాజంలో ఎన్ని చీడపురుగులు ఉంటే అన్నింటినీ నిర్మూలించవలసిన అవసరం ఉంది."

"మీకు ఎవరిమీదో కోపం వస్తుంది అది వారిమీద చూపించలేరు కానీ మీకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్థులను ధ్వంసం చేస్తున్నారు. అలా చేయడం సమర్థనీయమా?

"ప్రభుత్వం చేస్తున్న దమననీతి మీద మా నిరసన తెలియజేయడానికి ఇదొక మార్గం. ఇందువల్ల నష్టం జరిగి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలుసు అయినా అవి తాత్కాలికమే."

"మీ ఆలోచన విపరీతంగా ఉంది."

"విపరీతం ఏమీకాదు. ఈ కుళ్ళు సమాజంలో మార్పుకోసం అందర్నీ వదులుకుని కష్టాలను కొని తెచ్చుకుని పోరాటాలు చేస్తున్న మమ్మల్ని దొరికితే చెట్లకు తాళ్ళతో కట్టివేసి ఎన్‌కౌంటరు పేరుతో కాల్చి పారేస్తున్నారు. ఈ విధానాలకు ఎప్పుడూ మేము వ్యతిరేకమే" శ్రీకాంత్ మాటల్లో ఆవేశం.

"మీ ఆశయం ఏమిటి?"

"ప్రజలందరికీ ఒకేలాంటి సదుపాయాలు కల్పించాలి. కానీ ఈ సమాజంలో ధనవంతులు మరీ ధనవంతులుగా ఉండిపోతున్నారు. పేదవాళ్ళు మరీ నిరుపేదలుగా మారిపోతున్నారు. వీరి మధ్య వ్యత్యాసం తొలగించాలి"

"ప్రభుత్వం కృషి చేస్తున్నది కదా?"

"ప్రభుత్వం చేపడుతున్న పథకాలు కార్యక్రమాలు కొంతమందికి మాత్రం ప్రయోజనాలు కలిగిస్తున్నాయి. ప్రజలకు అందిస్తున్నామని వారి పేరుతో కొన్ని పందికొక్కులు వాటిని బుక్కుతున్నాయి."

"ప్రభుత్వంద్వారా ఈ పథకాలు సక్రమంగా అమలు జరిగేలా మీరు చూడవచ్చుకదా?"

"ఈ వ్యవస్థ కింద నుంచి మీద వరకు అంతా కలుషితం అయిపోయింది ఒకరిద్దరి వల్లా మార్చురాదు. ఒక్కసారిగా కూడా మార్చలేం."

"మీ పద్ధతిలో అయితే మార్పు వస్తుందా?"

"తప్పకుండా వస్తుంది. ఉదాహరణలతో సహా వివరించగలను. నిరూపించగలను. ఏజన్సీలో తూనికకు సేకరించే గిరిజనులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను ఇవ్వడంలేదు. మధ్య దళారీలు లాభాలు గడిస్తున్నారు. ఈ దోపిడీని నిరోధించడానికి కొంతమంది వ్యాపారస్తులకు వార్నింగులు ఇచ్చాం. వారు గిరిజనుల్ని వేధించడం మొదలుపెట్టారు. దాంతో ఏదో పరిష్కారం చూడాలని వారు తూనికకు నిల్వచేసుకున్న గోడాంలను తగలబెట్టాం. గిరిజనుల్లో ఈ చర్య కొంత ధైర్యాన్ని కలిగించింది. ఆ తర్వాత పరిస్థితి గిరిజనులను చాలా అనుకూలంగా తయారైంది ఈ విషయంలో మేము జోక్యం చేసుకోకపోతే అసలు సమస్య పరిష్కారం అయ్యేదికాదు"

గీత పుస్తకంలో రాసుకోవడం తప్ప ఏమీ మాట్లాడలేదు. తాము నమ్మిన సిద్ధాంతాలు గురించి వారు ఎంతలా సమర్ధించుకుని మాట్లాడగలరో శ్రీకాంత్ మాటలు విన్న తర్వాత గీతకు అర్ధమైంది.

తర్వత ఎన్నో విషయాలను అడిగి తెలుసుకుని రాసుకుంది. మావోయిస్టులకు ఆయుధాలు ఎక్కడినుంచి వస్తున్నాయి. మిలిటెంటు విధానంలో వారికి శిక్షణ ఎవరు ఎక్కడ ఇస్తున్నారు. ఉద్యమానికి ఏ పార్టీ మద్దతు ఉంది వంటి అనేక విషయాలను గీత శ్రీకాంత్‌ను అడిగింది. కొన్ని విషయాలు అర్ధమైనట్లూ కానట్టూ చెప్పాడు. అతను చెప్పడంతో తేడా ఉందో తను వినడంతో తేడా ఉందో తెలియదు కానీ చాలా విషయంలో సస్పెన్సుగానే ఉండిపోయాయి.

మాట్లాడుతున్నప్పుడు శ్రీకాంత్‌లో ఒకలాంటి ఆవేశం. తను నమ్మిన సిద్ధాంతంకోసం చూపిస్తున్న నిబద్ధత గీతలో ఎంతో ఆసక్తిని కలిగించాయి.

అతను చెప్పిన అంశాలలో కొన్ని ముఖ్యాంశాలను రాసుకుంది.

తాను తీసుకుని వచ్చిన కెమెరాలో సమావేశం జరుగుతున్నట్లు తాను శ్రీకాంత్‌తో కలిసి కూర్చుని మాట్లాడుతున్నట్లు వెనుక నుంచి పక్కనుంచి వివిధ రకాల ఏంగిల్సులో ఫోటోలు తీయించింది. తీసిన ఫోటోలలో మావోయిస్టులు ఫోటోలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంది.

గీత ఎన్ని జాగ్రత్తలు తీసుకుని ఫోటోలు తీసినప్పటికీ శ్రీకాంత్ వెన్నంటి ఉన్న మరో యువకుడు ఆమె వద్ద ఉన్న డిజిటల్ కెమెరాను తీసుకుని మొత్తం పరిశీలించాడు. అందులో ఏఏ ఫోటోలు ఉన్నాయో చూసుకుని కెమెరాను తిరిగి అందజేసాడు.

ఆ సమయంలో ఇద్దరు యువకులు శ్రీకాంత్ దగ్గరికి వచ్చారు. వారు తనతో మాట్లాడటానికి వచ్చారని శ్రీకాంత్ లేచి నిల్చుని దూరంగా వారిని తీసుకుని వెళ్ళి అయిదు నిమిషాలు మంతనాలు జరిపాడు.

తర్వాత గీతా మాధురి దగ్గరకు వచ్చి "భోజనం చేసిన తర్వాత మా వాళ్ళు డ్రాప్ చేస్తారు. మా విధానం ప్రజలందరికి తెలిసేలా వార్త రాయాలి" శ్రీకాంత్ నెమ్మదిగా చెప్పాడు.

"కుటుంబాలను నగర జీవితాలను అన్నీ వదులుకుని అన్నలుగా ఈ అడవిలో అందరికోసం కృషి చేయడం అభినందనీయం"

శ్రీకాంత్ గీతవైపు సంతృప్తిగా చూసాడు.

"మీ అందరిలో ఇదే కమిట్‌మెంటు ఉందా?"

"ఒకొక్కరిదీ ఒకో కథ. అందరూ తలో కారణంగా ఈ ఉద్యమంలో ప్రవేశించారు. నిజంగా వారి పరిస్థితుల్లో ఎవరు ఉన్నా ఏమీ చేయలేక వారి మాదిరిగానే ఈ ఉద్యమంలో చేరతారు."

"అంటే?"

"అన్యాయాన్ని ఎదిరించడం."

తర్వాత శ్రీకాంత్ అడవిలోపలికి వెళ్ళి ముగ్గురు యువకుల్ని వెంట బెట్టుకుని గీత దగ్గరకు తీసుకుని వచ్చాడు. "వీరు ముగ్గురూ అన్యాయాలకు బలి అయిపోయారు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో తీవ్రవాదులుగా మారిపోయారు. వీరిజీవితాల్లో ఎదురైన ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొన్నారు" అని వారి వివరాలు చెప్పాడు.

గీతామాధురి వారి వివరాలు పేర్లు తన నోట్ పుస్తకంలో రాసుకుంది. చిరునామాలు ఫోను నంబర్లు కూడా రాసుకుంది.

"ఈ వివరాలతో వార్తగా రాసేకన్నా వారి ప్రాంతాలకు స్వయంగా వెళ్ళి వారి వివరాలు పరిశీలిస్తే మరిన్ని తెలియని వివరాలు తెలుస్తాయి. జర్నలిస్టుగా అటువంటి ప్రయత్నం చేస్తే బాగుంటుంది" శ్రీకాంత్.

"శ్రీకాంత్ నీతో కలిసి మాట్లాడటం ఇంటర్వ్యూ చేయడం ఒక ఎత్తయితే ఈ ముగ్గురి విషయం మరో ఎత్తు. వెరీ ఇంట్రెస్టింగ్"

"గీతామాధురిగారూ. వీరు ముగ్గురేకాదు. ఈ మొత్తం ఉద్యమంలో కొనసాగుతున్న వారందరికీ ఒకో కథ ఉంది. అందరూ అన్యాయాలను ఎదిరించాలనుకున్నవారే. అయితే ఈ ముగ్గురూ మూడు ప్రత్యేక పరిస్థితుల్లో నక్సలైట్లుగా మారారు. అందుకే వీరి గురించి ప్రత్యేకంగా చెప్పాను" అన్నాడు శ్రీకాంత్.

"ఈ ముగ్గురి జీవితాలను ప్రత్యేకంగా పరిశీలిస్తాను."

ఆ తర్వాత మావోయిస్టులందరితో కలిసి నేలమీద సహపంక్తి భోజనం చేసింది. నవ్వుతూ కుటుంబసభ్యులమాదిరిగా అందరూ ఒకరితో ఒకరు సన్నిహితంగా ఉంటూ కలిసి భోజనాలు చేసారు. ఈ విషయం గీతకు ఎంతో నచ్చింది. అక్క అన్న అంటూ ఉద్యమస్ఫూర్తితో కలిసిపోవడం ఆకట్టుకుంది.

"ఎంతో తెలివైన శ్రీకాంత్ తన జీవితాన్ని అడవులకే అంకితం చేసుకుంటాడా?" గీత మదిలో ఆలోచనలు.

ఆమెకు గతం ఒకసారి గుర్తుకు వచ్చింది.

శ్రీకాంత్‌తో పరిచయం, అతని వ్యక్తిత్వం, పేదవాళ్ళ పట్ల అతను చూపించే అభిమానం అస్పష్టంగా అతనిపై పెంచుకున్న ప్రేమ జ్ఞాపకం వచ్చాయి. తర్వాత అడగలేక "ఈ అడవుల్లో ఎందుకు వంటరి పోరాటాలు నిరంతరం భయంతో బతకడం చక్కగా ఉద్యోగం చేసుకోవచ్చుకదా?" అడిగింది.

గీత ప్రశ్నకు శ్రీకాంత్ పకపకా నవ్వాడు.

"నేను నా కోసం బతకాలంటే ఉద్యోగం కోసం నా తలను తాకట్టు పెట్టాలి. కానీ నేను బతుకుతున్నది బాధలు పడుతున్న అభాగ్యులకోసం ఎవరి కిందో పనిచేయడం నా మనస్తత్వానికి సరిపడదు. అందుకే ఉద్యోగం చేయాలన్న విషయాన్ని చాలా కాలం క్రితమే

మరిచిపోయాను. నా సుఖాన్ని, కుటుంబాన్ని, స్నేహితుల్ని కూడా వదులుకున్నాను" శ్రీకాంత్ ఓ క్షణం మాట్లాడటం ఆపుచేసాడు. ఎందుకో శ్రీకాంత్ గొంతులో అదోలాంటి జీర. తర్వాత "నువ్వు కూడా నన్ను మంచి ఫ్రెండుగా గుర్తుంచుకో. నేను నీకు తెలుసునని ఇద్దరి మధ్యా పరిచయం ఉందని ఎవరికీ చెప్పకు. నీకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి" అన్నాడు శ్రీకాంత్.

మరో అరగంటలో గీత తిరుగు ప్రయాణమైంది.

గీత లేచి నుంచుని ముందుకు కదులుతుండగా ఆమె దగ్గరగా వచ్చి "నువ్వంటే ఇప్పటికీ నాకు ఎంతో అభిమానం ఇష్టం" నెమ్మదిగా ఆమెకు మాత్రం వినిపించినట్లుగా అన్నాడు.

శ్రీకాంత్ ఆ మాటలు నెమ్మదిగా చెప్పినా చెవుల్లోంచి గుండెల్లో కి చేరిపోయాయి. మనసులో ఏదో అలజడి. తుఫాన్ రేపినట్లయింది ఒక్కసారి మనసంతా పులకరించిపోయినట్లయిపోయింది.

"నాక్కూడా" తను కూడా అంతే నెమ్మదిగా శ్రీకాంత్‌కు మాత్రం వినిపించినట్లు అని కింద నున్న బాగ్ అందుకుంది.

అన్నల వెంట ముందుకు సాగిపోయింది.

## 11

**విజయం** పత్రికా కార్యాలయం

సేకరించిన వివరాలను గీత క్రమపద్దతిలో రాసుకుంది. శ్రీకాంత్‌ను అడిగిన ప్రశ్నలు అతను చెప్పిన సమాధానాలను కూడా వివరంగా రాసింది. శ్రీకాంత్ మాట్లాడిన వివరాలు ఆధారంగా ఏమీ మిస్ కాకుండా టేప్ రికార్డులో రికార్డు చేసిన విషయాలను వింటూ తప్పులను సరిదిద్దింది. మొత్తం జరిగిన సంభాషణ నాలుగైదురోజులు సీరియల్‌గా ప్రచురించడానికి వీలుగా నోట్సును తయారు చేసుకుంది.

ఇంటర్వ్యూలతోపాటు పక్కన బాక్సు ఐటంలుగా ప్రచురించడానికి వీలుగా తీవ్రవాద ఉద్యమం రాష్ట్రంలో ఎప్పుడు ఎలా మొదలైంది అనే విషయాలను శ్రీకాకుళం రైతాంగ పోరాటం దగ్గర నుంచి వరుసగా రాసుకుంది. ఇంతవరకు జరిగిన హింసాకాండ ఎంతమంది చనిపోయారు? ఎన్ని ఎన్‌కౌంటర్లు ఎన్ని జరిగాయి రాష్ట్రంలో నక్సలైట్లు ధ్వంసం చేసిన ఆస్థుల వివరాలు వంటివి కూడా సేకరించి ప్రతిరోజూ ఇంటర్వ్యూతోపాటు ప్రచురించడానికి వీలుగా తయారు చేసింది.

మొత్తం వివరాలను కంప్యూటరులో కంపోజ్ చేసి న్యూస్ ఎడిటర్ రాజారావుకు చూపించింది. అతను తన కంప్యూటరులో వాటిని చదివాడు. సమగ్రంగా తయారైన ఇంటర్వ్యూ వివరాలు అతనికి ఎంతో సంతృప్తిని కలిగించాయి.

తర్వాత గీతవైపు చూస్తూ "కంగ్రాట్సు గీతా మాధురి ఎంతో రిస్కు తీసుకుని సమగ్రంగా వివరాలను సేకరించావు. నక్సలైటు నాయకుడ్ని ఎంటువంటి ప్రశ్నలు అడిగితే బాగుంటుందని నేను అనుకున్నానో నువ్వు కూడా అటువంటి ప్రశ్నలనే శ్రీకాంత్‌ని అడిగావు. ఈ వార్త మన పేపరుకు ఎక్సుక్లూజివ్ ఐటెం అవుతుంది. ఈ వార్త పబ్లిష్ చేస్తున్న విషయం మన ఆఫీసులో కూడా రహస్యంగా ఉంచాలి. న్యూస్ ఎడిటర్‌తో మాట్లాడతాను" అన్నాడు.

"థాంక్యూ సార్ మీకు నచ్చడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. నేను పడిన కష్టం అంతా మరచిపోయేలా చేసింది."

"గీతా కష్టం అంటే గుర్తుకు వచ్చింది నువ్వు నక్సలైటు నాయకుడ్ని ఇంటర్వ్యూ చేయడానికి ఎలా వెళ్ళావన్న విషయం కూడా ప్రత్యేక కాలంగా రాయి దానిని కూడా పబ్లిష్ చేద్దాం. మొత్తం నువ్వు బయలుదేరినప్పటినుంచి అన్ని వివరాలు వివరంగా రాయి పబ్లిష్ చేద్దాం" అన్నాడు.

తర్వాత అడవిలో చేసిన ప్రయాణం గురించి అక్కడి వాతావరణం గురించి న్యూస్ ఎడిటర్ రాజారావు అడిగి తెలుసుకున్నాడు గీత చెబుతున్న విషయాలు వింటుంటే అతనికి ఎంతో ఎగ్జయిటింగు అనిపించింది. ఒక లేడీ జర్నలిస్టు ఎంతో రిస్కు తీసుకుని సాహసోపేతమైన వార్తను సంపాదించడం ఎంతో ముచ్చట కలిగించింది.

ప్రముఖ తీవ్రవాద నాయకుడితో విజయం ఇంటర్వ్యూ మహిళా విలేఖరి అడవిలో ఉన్న నాయకుడ్ని కలుసుకుని చేసిన ప్రత్యేక వార్త రేపటి సంచికలో అంటూ మొదటి పేజీలో ప్రచురించడానికి వీలుగా ప్రకటన తయారు చేసి కంపోజ్ చేయించాడు తర్వాత ఎడిటోరియల్ సెక్షనుకు పంపించాడు.

మర్నాడు విజయం పత్రికలో వచ్చిన ఆ ప్రకటన ఎంతో సంచలనం కలిగించింది చాలామంది దానిని చూసి విజయం పత్రికకు ఫోన్లు చేసి ఆరా తీసారు.

ఆ మరుసటిరోజు విజయం పత్రికలో శ్రీకాంత్ ఇంటర్వ్యూ మొదలైంది గీత ఏజన్సీలో తీసిన ఫోటోలు ఇతర వివరాలు ప్రచురణ జరిగాయి. సైడ్ ఏంగిల్‌లో ఉన్న శ్రీకాంత్ ఫోటో కూడా పబ్లిష్ అయింది.

ఇంటర్వ్యూ మధ్యలో బాక్సు ఐటంలుగా రాష్ట్రంలో తీవ్రవాద కార్యకలాపాల వివరాలు ఉన్నాయి. మరో పక్క గీత అడవిలోకి ఎలా వెళ్ళింది? ఎంత రిస్కు తీసుకుని ప్రయాణించిందన్న కథనం కూడా సీరియల్‌గా పక్క పేజీలో పబ్లిష్ ఐంది.

ఈ వార్తల కదంబం వరుసగా అయిదురోజులపాటు విజయం పత్రికలో పబ్లిష్ అయ్యాయి. మొదటిరోజు ఒక మాదిరిగా రెస్పాన్సు వచ్చింది. ఆ తర్వాత పత్రికాఫీసువారు ఎవరూ ఊహించని స్పందన లభించింది.

మేధావుల నుంచి పౌరహక్కుల సంఘం నాయకులనుంచి వామ పక్షాల నుంచి ఉత్తరాలు ఫోను కాల్సు అందుకున్న గీత ఎంతో పొంగిపోయింది.

చాలా సంవత్సరాలుగా విలేఖరిగా పనిచేస్తున్నా, ఎన్నో వార్తలు రాసినా అనేక కుంభకోణాలను వెలికి తీసినా ఇంతటి ప్రతిస్పందన ఎప్పుడూ కనిపించలేదు.

గీతకు ఒకలాంటి గర్వం కలిగింది. తనమీద తనకు ఎంతో నమ్మకం ఏర్పడింది.

వివిధ వర్గాల నుంచి వచ్చిన స్పందన ఒకలా ఉంటే పోలీసుల నుంచి వచ్చిన ప్రతిస్పందన మరోలా ఉంది వారి నుంచి అటువంటి ప్రతిఘటన ఎదురవుతుందని గీత అనుకోలేదు వార్తల ప్రచురణ జరిగి ప్రజలనుంచి మెచ్చుకోలు మిగిల్చిన సంతోషం నుంచి ఆమె తేరుకోకముందే పోలీసులు ఆమె ముందు ప్రత్యక్షం అయ్యారు.

విశాఖ గురుద్వార జంక్షను దగ్గరలో సందులో గీత ఉంటోంది. బుల్లెట్‌పై సబ్ ఇన్స్పెక్టరు ఇంటికి వచ్చి తలుపు తట్టాడు.

సాధారణంగా ప్రెస్ రిపోర్టరుగా పోలీసులు ఆమె ఇంటికి చాలాసార్లు వస్తుంటారు. "రండి" ఆహ్వానించింది కానీ అతను లోపలికి రాలేదు. "ఎస్పీ దొరగారు వస్తున్నారు" అని సమాచారాన్ని అందించాడు.

పది నిమిషాల్లో ఎస్పీ శ్యామసుందర్ ఇంటిలిజెన్సు అధికారి సర్కిల్ ఇన్స్పెక్టరులు కలిసి ఇంటికి వచ్చారు. కారులో ఎస్పీ వస్తే జీపులో మిగిలినవారు వచ్చారు.

గీత వారిని ఆహ్వానించి లోపలికి తీసుకుని వెళ్ళింది.

సాధారణంగా ఎస్పీ స్థాయి అధికారి అధికారికంగా ప్రైవేటు వ్యక్తుల వద్దకు అరుదుగా వస్తుంటారు. కానీ ఎస్పీ శ్యామ్‌సుందర్ పోలిసు డ్రెస్‌లో రావడం గీతకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

వారికి టీని స్వయంగా అందించింది.

పత్రికల గురించి ఇతర రాజకీయ అంశాలు మాట్లాడిన తర్వాత "శ్రీకాంత్ ఇంటర్వ్యూ చాలా బాగుంది. వార్తలో అడుగడుగునా మీ లెగ్ వర్క్ కనిపించింది. చాలా కష్టపడి ఉంటారు. ఈ వార్తా కథనాలవల్ల మంచి జర్నలిస్టు అనిపించుకున్నారు" ఎస్పీ ప్రశంసించాడు.

గీత నవ్వి "థాంక్స్" చెప్పింది.

"లేడీ జర్నలిస్టుగా ఎంతో ధైర్యం చేసి అడవుల్లోకి వంటరిగా వెళ్ళడం గొప్ప విషయం. చాలా సాహసం చేసారు."

"మా ఉద్యోగంలోనూ మీ ఉద్యోగంలోనూ ఇటువంటి సాహసాలు చేయడం సహజమేకదా?"

ఈలోపు ఎస్పీ పక్కనున్న ఇంటిలిజెన్సు అధికారి కలగజేసుకుని "కొన్ని వివరాలు కావాలమ్మా అని అడిగాడు అతని మాటల్లో పెద్దరికం కొట్టొచ్చినట్లు కనిపించింది.

"ఏమిటి?"

"శ్రీకాంత్ ఎలా ఉంటాడు? ఎక్కడ ఉంటున్నాడు? అతని వెనుక దళంలో ఎంతమంది సభ్యులు ఉంటారు"

ఈ మాటలతో గీత కాస్త తేరుకుంది.

పోలీసు అధికారులు ఎందుకు వచ్చారో అప్పుడు స్పష్టంగా అర్ధం అయింది. తర్వాత నెమ్మదిగా "నాకు తెలిసిన వివరాలన్నీ వార్తలో వివరంగా రాసాను. అంతకు మించి నాకు ఏమీ తెలియవు."

"తీవ్రవాదుల ముసుగులో ఎంతోమంది అమాయకుల్ని పొట్టన పెట్టుకుంటున్నారు. సిద్ధాంతాలు పక్కన పెట్టి దోపిడీ దొంగలుగా తయారవుతున్నారు. తీవ్రవాదాన్ని, తీవ్రవాదుల్ని నివారించవలసిన అవసరం ఉంది. మీరు కాస్త సహకారాన్ని అందిస్తే పోలీసు అధికారులుగా మా పని మేము చేసుకుని పోతాము" ఎస్పీ శ్యామ్‌సుందర్ కూల్‌గా చెప్పాడు.

గీతకు ఏమి సమాధానం చెప్పాలో తెలియలేదు. వారివైపు చూస్తుండిపోయింది.

"గీతగారూ మీకు ఎవరినుంచి ఎటువంటి ప్రమాదం ఎదురుకాదు. ఎటువంటి ఇబ్బంది లేకుండా మేం చూసుకుంటాం. మీరు అందించే వివరాలు మాకు ఎంతో మేలు చేస్తాయి."

"నాకు ఏమీ తెలియదు సార్. అడవుల్లోకి ఎలా వెళ్ళానో ఎలా తిరిగి వచ్చానో నాకే తెలియడంలేదు."

"పోనీ ఈ ఫొటో చూసి చెప్పండి" అంటూ ఇంటిలిజెన్సు అధికారి జేబులోంచి ఒక పాస్ పోర్ట్‌ను తీసి గీతకు అందించాడు. పదేళ్ళ క్రితం శ్రీకాంత్ ఏదో స్టూడియోలో తీయించుకున్న ఫోటో అది. "ఇతనే రకరకాల పేర్లతో చలామణి అవుతున్న తీవ్రవాద నాయకుడు."

"పోలికలు అంతగా తెలియడంలేదు. ప్రస్తుత నాయకుడి ఎప్పటిదో ఈ ఫోటో అనుకుంటాను."

"ఇప్పుడు ఎలా ఉన్నాడు?"

"సాధారణంగా"

"అంటే?"

"నాకు వర్ణనలు చేయడం తెలియదు సర్. అతనిలో ప్రత్యేకత ఏమీ కనిపించలేదు. అందరి మాదిరిగానే మామూలుగా ఉన్నాడు. అయినా ఇవన్నీ నన్ను ఎందుకు అడుగుతున్నారో తెలియడంలేదు. పత్రికా విలేఖరిగా నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి. మరి కొంత స్వేచ్ఛకూడా ఉంది. నాకు న్యూస్ అందించిన వారి పేర్లు రహస్యంగా ఎవరికీ వెల్లడించనవసరంలేదు."

"తెలుసు మేడం. ప్రభుత్వాన్ని కూలదోయటానికి కుట్రపన్నుతున్న వ్యక్తుల గురించి వివరాలు తెలుసుకోవలసిన అవసరం మాకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తులకు సంబంధించిన సమస్త వివరాలను తెలియజేయవలసిన కనీస బాధ్యత మీక్కూడా ఉందన్న విషయం మరిచిపోకూడదు" ఎస్పీ శ్యామ సుందర్ మాటల్లో అధికారం కనిపించింది.

ఎస్పీ శ్యామసుందర్ అధికార దర్పం మొదటిసారి గుర్తించింది.

ఎస్పీ చిన్న నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

తర్వాత పత్రికల గురించి వార్తలు గురించి పత్రికా యాజమాన్యాల గురించి కొత్తగా పత్రికారంగంలో వస్తున్న మార్పుల గురించి చాలా వివరాలను అడిగి గీతనుంచి తెలుసుకున్నాడు. అతని మాటలు వింటుంటే ఒక పోలీసు అధికారికి తనదికాని రంగం గురించి చాలా విషయాలు తెలుసునని గీత గుర్తించింది.

తర్వాత పిచ్చాపాటి మాట్లాడి "వస్తా మేడం" ఎస్పీ శ్యామ్ సుందర్ లేచి నిల్చున్నాడు. అతని వెనుక వచ్చిన సిబ్బంది కూడా లేచారు.

గీత వారికి వీడ్కోలు పలికింది.

వచ్చిన వారు వెళ్ళిపోయిన తర్వాత బైట కార్లు జీపులు కదిలే వరకూ లోపల ఉన్న గీత అమ్మగారు రామలక్ష్మి బైటికి రాలేదు.

తర్వాత కూతురు దగ్గరికి వచ్చి "ఏమిటే ఇదంతా పోలీసులు ఎందుకు వచ్చారు? వారి ప్రశ్నలు ఏమిటి అలా ఉన్నాయి?" ప్రశ్నించింది.

"ఏమీ లేదమ్మా పత్రికల్లో ఉద్యోగాలు చేస్తున్న వారింటికి ఇటువంటి గెస్టులు వస్తూనే ఉంటారు. మరేం పర్వాలేదు" లోపలికి దారి తీసింది.

తన కూతురు తనకు ఎందుకు అర్థం కావడంలేదోనని రామలక్ష్మి ఆలోచనల్లోకి జారిపోయింది.

## 12

విజయవాడు ముత్యాలంపాడు

ఆ ప్రాంతంలో చాలా లాడ్జిలు ఉన్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో శ్రీదేవి లాడ్జి ఉంది. అందులోనుంచి బైటికి వచ్చి ఆటో ఎక్కుతుండగా శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేసారు. తమకు ముందుగా అందిన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో కాపలా కాసి పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న సంచిలో ఉన్న తీవ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

శ్రీకాంత్‌ను పట్టుకున్న విషయం వారం రోజులు గోప్యంగా ఉంచారు. అసలు ఎక్కడా తెలియనివ్వలేదు.

విషయం బైటికి పొక్కిపోవడంతో పౌరహక్కుల సంఘం నాయకులు తీవ్రవాద ఉద్యమ సానుభూతిపరులు పత్రికా ప్రకటనలు విడుదల చేసారు. శ్రీకాంత్‌ను అరెస్టు చేసినా అరెస్టును అధికారికంగా చూపించకుండా మాయం చేసారని ఆందోళన ప్రారంభించారు. అతడిని తక్షణం కోర్టులో ప్రవేశపెట్టాలని లేకపోతే ఎన్‌కౌంటర్ చేసి చంపేస్తారని ఈ ప్రకటనల్లో పేర్కొన్నారు.

కొద్ది రోజుల ముందే శ్రీకాంత్ ఇంటర్వ్యూ విజయం పత్రికలో రావడంవల్ల అతని గురించి రాష్ట్రంలో చాలామందికి తెలుసు. అతను పోలీసులకు పట్టుబడ్డాడని తెలిసి తర్వాత ఆ విషయం రాష్ట్ర స్థాయిలో చాలా సంచలనం కలిగించింది. తీవ్రవాదంపై తన భావాలను తెలియజేసిన కొన్నిరోజుల్లోనే పోలీసులు అతడిని చాకచక్యంగా పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కొంతమంది పోలీసుల్ని ప్రశంసించారు.

శ్రీకాంత్ ఎలా ఉంటాడో ఎవరికీ తెలియదు. అతడిని ఎవరూ చూడకపోయినా తీవ్రవాద ఉద్యమంలో అతని ప్రభావం ఎక్కువగా ఉండటంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది.

పోలీసులు పట్టుకున్న వెంటనే చెట్టుకు కట్టి ఎన్‌కౌంటర్ చేసారని కొన్ని పత్రికలు ఊహాగానాలతో వార్తలు రాసాయి. "శ్రీకాంత్ బతికే ఉన్నాడా?" అనే శీర్షికతో ఒక పత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది.

పోలీసులు చివరికి కోర్టులో ప్రవేశపెట్టారు.

శ్రీకాంత్‌ను కోర్టుకు తీసుకుని వస్తున్న సమయంలో చాలా బందోబస్తును ఏర్పాటు చేసారు.

కోర్టు శ్రీకాంత్‌కు రిమాండ్ విధించింది

అతడిని సెంట్రల్ జైలుకు తరలించారు.

శ్రీకాంత్ అరెస్టు కావడంతో అతని స్థానంలో జీవన్ దళ కమాండర్‌గా బాధ్యతల్ని స్వీకరించాడు. అంతవరకు శ్రీకాంత్ నిర్వహించిన కార్యక్రమాలన్నీ చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నాడు.

పోరాటమే ప్రాణంగా ఉద్యమమే ఊపిరిగా మావోయిస్టుగా నిరంతరం శ్రమించిన శ్రీకాంత్‌ను విజయవాడలో పోలీసులు అరెస్టు చేయడాన్ని జీవన్ జీర్ణించుకోలేకపోతున్నాడు. అతనికి ఆ విషయం మింగుడు పడటంలేదు.

తనతోపాటు ఎంతోమందికి తీవ్రవాద ఉద్యమంలోకి తీసుకుని వచ్చి గిరిజనుల కోసం పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన శ్రీకాంత్ ఉండవలసింది జైల్లో కాదు. తమ వద్ద అని కున్నాడు. అతడిని ఎలాగైనా విడిపించాలి జీవన్‌లో ఆలోచనల పరంపర.

ఎలా? ఎలా?

పోలీసులు శ్రీకాంత్ ద్వార నక్సలైటు ఉద్యమానికి సంబంధించిన అనేక రహస్యాలను రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తారన్న విషయం జీవన్‌కు తెలుసు. ఈ పరిస్థితుల్లో అతడిని ఎలా రక్షించాలి? ఏమి చేయాలి?

బెయిల్‌కు అవకాశంలేని సెక్షన్లు శ్రీకాంత్ పై విధించారు.

అందువల్ల న్యాయపరంగా శ్రీకాంత్ జైలు బైటికి వస్తాడన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లిపోయింది. ఎన్ని సంవత్సరాలైనా సెంట్రల్ జైలులో శ్రీకాంత్ మగ్గిపోవలసిందేనా? ఏం చేయాలి? ఏదైనా చెయ్యాలి.

దళంలో ముఖ్యులైన వారితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాడు.

సహచరులందరికీ విషయాన్ని వివరించి ఏం చేయాలో చర్చించాడు.

శ్రీకాంత్ నాయకత్వం పట్ల దళసభ్యులంతా విశ్వాసాన్ని ప్రకటించారు. వచ్చిన వారందరూ ఒకేలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ఎలాగైనా శ్రీకాంత్ జైలునుంచి బైటికి రావలని అందరూ కోరుకున్నారు.

అందరి అభిప్రాయాలను విని జీవన్ తీవ్రంగా ఆలోచించాడు.

తనకు వచ్చిన ఆలోచనను సహచరులందరికీ తెలియజేసాడు. తాను తీసుకున్న నిర్ణయం వల్ల మాత్రమే శ్రీకాంత్ బైటికి రాగలడని వివరించాడు వచ్చిన వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నాడు.

అమలు చేయడానికి కార్యాచరణ తయారు చేసాడు.

జీపు నెమ్మదిగా ముందుకు కదులుతోంది.

డ్రైవరు పక్కన జీపు ముందు సీట్లో ఎమ్మెల్యే బాలన్న కూర్చున్నాడు.

వెనుక సీట్లో ఇంజనీరింగు సిబ్బంది ఉన్నారు నియోజకవర్గంలో మారుమూల గ్రామాలలో రోడ్ల నిర్మాణాలను పరిశీలించడానికి బయలుదేరారు.

ఆ నియోజకవర్గాన్ని బాలన్న శాసనసభ్యుడిగా మొదటిసారి ఎన్నికయ్యాడు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగి నిరంతరం ప్రజా సమస్యలతో మునిగితేలుతుంటాడు. ఎమ్మెల్యేగా మంచి పేరు సంపాదించాడు.

యువకుడు, విద్యావంతుడు కావడంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ఏ మారుమూల ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా వెళ్ళి పలకరించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరిస్తుంటాడు. ప్రజలు ఎవరు ఏ శుభకార్యానికి పిలిచినా తప్పకుండా వెళుతుంటాడు.

వెళ్ళిన ప్రాంతంలో నిర్మాణ పనులను పరిశీలించాడు.

వివిధ కారణాలతో పెండింగులో ఉండిపోయిన పనులను ఎంతకాలంలో పూర్తిచేయవచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నాడు అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు.

కుదుపులతో వస్తున్న జీప్ సడన్‌గా ఆగిపోయింది.

బాలన్న ముందు జీపు డ్రైవరు వైపు తర్వాత రోడ్డువైపు చూసాడు.

జీపులోపల కూర్చున్న అధికారులు ఇతర సిబ్బంది కూడా ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

రోడ్డు మధ్యలో పదిమంది యువకులు తుపాకులు పట్టూకుని నిల్చున్నారు. అందరూ ఆలివ్ గ్రీన్ దుస్తులు ధరించి ఉన్నారు.

"ఎం.ఎల్.ఏ బాలన్నగారూ మీరు మా వెంట రావాలి" వారిలో ఒక యువకుడు జీపు దగ్గరికి వచ్చి నెమ్మదిగా అడిగాడు.

"ఎందుకు?" బాలన్న అడిగాడు.

"మిమ్మల్ని కిడ్నాప్ చేస్తున్నాం. మాతోపాటు అడవుల్లోకి తీసుకుని వెళుతున్నాం. మీమీద మాకు ఎటువంటి కోపం కాని వ్యతిరేకత కానిలేదు. మా నాయకుడు శ్రీకాంత్‌ను విడిపించాలని అనుకుంటున్నాం. ఈ ప్రభుత్వం దిగి రావడానికి అధికార పార్టీలో మంచి పేరున్న మిమ్మల్ని ఎంచుకున్నాం."

మరో యువకుడు జీపు దగ్గరికి వచ్చి తన భుజాన ఉన్న తుపాకీని పక్కన పెట్టి జీపుకున్న అన్ని టైర్లలలో గాలిని తొలగించాడు.

"మా డిమాండ్ ఈ కవరులో ఉన్న ఉత్తరంలో రాసాం. కలెక్టరు ద్వారా ప్రభుత్వానికి దీనిని అందించండి" ఇంజనీరింగు అధికారికి అందజేసాడు.

జీపులో ఉన్నవారందరిలో అదోలాంటి మౌనం.

ఎవరూ నోరు మెదపలేకపోతున్నారు.

"అందరూ వెళ్ళండి."

జీపులోంచి ఎవరూ కిందకు దిగలేదు. అప్పుడు ఎమ్మెల్యే బాలన్న కలగజేసుకుంటూ "మరేం పర్వాలేదు మీరు వెళ్ళిపోండి" అన్నాడు.

సిబ్బంది భయం భయంగా జీపు దిగారు.

మట్టిరోడ్డులో నడక మొదలుపెట్టారు.

మావోయిస్టులు బాలన్నను కొంతదూరం నడిపించుకుని వెళ్ళారు. తర్వాత కొండవారన్ ఉన్న మారుతీ వేనులో ఎక్కించారు. మిగిలిన వారు అందులో సర్దుకుని కూర్చున్నారు.

వాను ముందుకు దూసుకుని పోయింది.

14

**జర్నలిస్టుగా** ప్రతిరోజూ రకరకాల వార్తలు రాస్తోంది.

విధి నిర్వహణ చేస్తున్నా మనసులో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న కుళ్ళు, కుతంత్రాలు అన్యాయాలు, అక్రమాలను నిరోధించేవారే లేరా అనిపిస్తోంది.

సాధారణ మనుషులు తీవ్రవాదులుగా ఎందుకు మారుతున్నారో ఆమెకు అర్థంకావడంలేదు. దోపిడీలు అన్యాయాలు జరుగుతున్నప్పుడు చూస్తూ ఏమీ చేయలేని పరిస్థితులు మనుషుల్లో ఆవేశాన్ని కలిగించి తీవ్రవాదం పట్ల ఆకర్షితులు అవుతున్నారా అనిపించింది. సామాజిక పరిస్థితులు మనుషుల్లో మార్పును కలిగిస్తున్నాయి అనుకుంది గీత.

తను శ్రీకాంత్‌ను అడవిలో కలిసిన సమయంలో ముగ్గురు యువకుల గురించి చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. వారి ముగ్గురి నేపధ్యం ఏమిటి? దోపిడీని ఎదిరించడానికి తీవ్రవాదులుగా మారారా? వారు మార్పు వెనుక నిజమైన కారణాలు ఏమిటివంటి విషయాలను తెలుసుకోవాలని అనుకుంది. ఆ విషయాలు తెలుసుకుంటే మరో మంచి వార్తా కథనం అవుతుందని ఆమె మనసు చెబుతోంది.

పుస్తకం తీసి వివరాలను చూసింది.

రామరాజు, సుదర్శన్, పడాల్ ముగ్గురూ మూడు వేరువేరు ప్రాంతాలకు చెందినవారు. మూడు వర్గాలకు చెందినవారు. ముగ్గురి జీవితాలను పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి అనుకుంది గీత.

సెలవుకోసం దరఖాస్తు చేసింది.

"మళ్ళీ సెలవా?" న్యూస్ ఎడిటర్ రాజారావు ఆశ్చర్యాన్ని, విస్మయాన్ని వ్యక్తం చేశాడు.

"అవును సార్. మా అక్కావాళ్ళింటిలో ఫంక్షను ఉంది తప్పకుండా వెళ్ళాలి" అబద్ధం చెప్పకూడదని అనుకుంది కానీ నిజం చెప్పడంవల్ల కూడా అంతగా ప్రయోజనం ఉండదని ఆ విధంగా అంది.

సెలవు మంజూరైన తర్వాత విజయం ఆఫీసునుంచి బైటికి వచ్చి నేరుగా ఇంటికి చేరుకుంది.

రామలక్ష్మి వంటరిగా గదిలో కూర్చుంది.

"అమ్మా రేపు ఊరు వెళుతున్నాను. ఖచ్చితంగా మూడురోజుల్లో తిరిగి వచ్చేస్తాను" అంది.

"నీ ఉద్యోగం రకరకాల ఈ తిరుగుళ్ళు చూస్తుంటే నాకు ఏదోలా ఉంది. పెళ్ళి చేసుకోవలసిన వయసులో నీ హడావుడి నాకర్థంకావడంలేదు"

"ఈ ఉద్యోగంలో ఇటువంటివి మామూలే. తప్పవు" గీత తల్లి మరోమాట మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదు.

15

భీమిలి బస్టాండులో గీత బస్సు దిగింది. బీచ్‌కు వెళ్ళే రహదారి మరో పక్క గంటస్థంభం కనిపించాయి. రామరాజు అడ్రసు సులభంగానే తెలుసుకుంది.

సుభాష్‌రోడ్డులో పాత పెంకుటిల్లు. తలుపు తీసే ఉంది. లోపలికి వెళ్ళగానే వృద్ధురాలు ఎదురైంది. గీతను చూసి "ఎవరమ్మా? ఎవరు కావాలి?" అని ఆప్యాయంగా ప్రశ్నించింది.

"రామరాజు ఇల్లు ఇదే కదండీ?"

"అవును. వాడితో పని ఏమిటమ్మా? వాడు ఇక్కడ ఉండటంలేదు కదా?" అంది.

గీత ఆ ఇంటిని పరిశీలనగా చూసింది. విలువైన సామాన్లేవీ కనిపించలేదు. పేదరికం ఆ ఇంటిలో కాపురం చేస్తున్నట్లుగా ఉంది. తర్వాత ఆమె వైపు తిరిగి "రామరాజు ఎక్కడ ఉంటున్నారు?" అని అడిగింది.

"తెలీదమ్మా? వాడికి ఆవేశం ఎక్కువ. వాళ్ళనాన్నగారి పెన్షను విషయంలో చాలామందితో గొడవలు పడ్డాడు తిక్క తిక్కగా సమాధానం చెప్పి పెన్షను విషయంలో అడ్డుపుల్ల వేసిన గుమాస్తాను చితకబాదాడట. వాడిమీద పోలీసు కేసులుకూడా పెట్టారు. ఎక్కడికి వెళ్ళిపోయాడో తెలియదు నాకు. పెన్షను రాలేదు. కానీ గొడవ మాత్రం ముదిరిపోయింది. వాడు నా దగ్గరకి ఎప్పుడు వస్తే అప్పుడు పట్టుకుందామని పోలీసులు కాచుక్కూచున్నారు" అమాయకంగా చెప్పింది.

గీత మనసు ఏదోలా అయిపోయింది.

"ఎటువంటి ఆదాయం. ఆధారం లేకుండా బతకమని ఆ దేముడు నా నుదుటున రాసాడు గాబోలు" ఆమె లోపలికి వెళ్ళింది. రెండు నిమిషాలు గ్లాసుల చప్పుడు వినిపించింది. తర్వాత బైటికి వచ్చి "అమ్మా నువ్వెవరో నాకు తెలీదు. ఎందుకు నా దగ్గరికి వచ్చావోకూడా తెలీదు. కనీసం టీ నీళ్ళు ఇద్దామని అనుకున్నా ఇంటిలో పంచదార నిండుకుంది" వృద్ధురాలు సంజాయిషీ ఇస్తున్న మాదిరిగా చెబుతున్న విషయాలు వింటుంటే గీత హృదయం ద్రవించుకుపోయింది.

"మీ అబ్బాయి నన్ను పంపించాడు. మీవారి పెన్షను విషయం మీతో మాట్లాడటానికి వచ్చాను" గీతామాధురి చిన్న అబద్ధం చెప్పింది.

వృద్ధురాలి కళ్ళల్లో వెలుగు కనిపించింది.

"వాడు ఎక్కడున్నాడమ్మా? క్షేమంగా ఉన్నాడా? ఏమి చేస్తున్నాడు?" కన్నతల్లి ఆవేదన ఆ మాటల్లో స్పష్టంగా కనిపించింది.

గీత రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. తర్వాత "చాలా దూరంలో ఉన్నాడు. చిన్న ఉద్యోగం కూడా చేస్తున్నాడు. తొందరలోనే అన్ని వివరాలు తెలుస్తాయిలే" మాటలను పొడిగించడానికి అవకాశం ఇవ్వకుండా ముగించింది.

తర్వాత ఆ వృద్ధురాలికి భర్తకు సంబంధించిన రావల్సిన పెన్షను గురించి అన్ని వివరాలను తెలుసుకుంది. కొన్ని కాగితాలను ఫోనులో ఫొటోలను తీసుకుంది. "వస్తానమ్మా" ముందుకు కదిలింది.

"భోజనం చేసి వెళితే?" ఆ వృద్ధురాలు తన మాటను పూర్తి చేయలేకపోయింది. ఆమె తనకు ఒకపూట కూడా భోజనం పెట్టలేని దయనీయమైన స్థితిలో ఉందని ఆ మాటల్లో స్పష్టంగా తెలుస్తోంది. ఆ ఇంటి పరిస్థితి చూస్తే గీతకు ఏదోలా అనిపించింది.

రామరాజు తండ్రి పేరు రామచంద్రరాజు. అతను విలేజ్ డెవలెప్‌మెంటు అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసారు. పదవీ విరమణ సమయంలో పించను సెటిల్ కాలేదు. ఆ సమయంలో అనారోగ్యంతో చనిపోయారు. అప్పటినుంచి రామరాజే ఆ కుటుంబానికి ఆధారం అయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ చేసిన తర్వాత ప్రభుత్వపరంగా రావల్సిన పరిహారాలు ఏమీ రాలేదు.

వివరాలు అన్నీ తన వద్ద ఉంచుకున్న తర్వాత మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్ళింది.

కార్యాలయంలో విలేఖరిగా పరిచయం చేసుకుంటే వారి నుంచి రెస్పాన్సు ఒకలా వస్తుంది. అది ఆమెకు ఇష్టంలేదు. అందువల్ల సామాన్య వ్యక్తిగా వెళ్ళి సమస్యను తెలుసుకోవాలని అనుకుంది. అందుకే రామరాజు బంధువుగా పరిచయం చేసుకుంది.

"ఏమంటారు?" విసుగ్గా చూసాడు గుమస్తా.

"మీ కార్యాలయంలో పనిచేసిన రామచంద్రరాజు పెన్షను విషయం చాలా సంవత్సరాలుగా పెండింగులో ఉంది. ఇన్ని సంవత్సరాలు ఎందుకు జాప్యం జరిగిందో అర్థం కావడంలేదు."

"ఆ రామరాజు పెద్ద ఉగ్రవాది. అతనికి అంత ఆవేశం పనికిరాదు. ప్రభుత్వ కార్యాలయంలో మేము కష్టపడి పనిచేస్తున్నది ఎందుకు? కాస్త పై ఆదాయం వస్తుందనేగా?"

గీతకు మొత్తం పరిస్థితి అర్థం అయిపోయింది.

ఈ వ్యవహారాన్ని తానే స్వయంగా పరిశీలించాలని అనుకుంది. గుమస్తా వైపు తిరిగి "అయితే ఏమి చేయమంటారు?" అంది.

"మీకు ప్రత్యేకంగా చెప్పేది ఏముంది? ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. తయారు చేసిన పెన్షను ప్రతిపాదనల్ని మళ్ళీ పంపించాలి. ఫైలు కొత్తగా తయారు చేసి పంపించాలి. అన్నిపనులు చేయడం అంత ఈజీకాదు. కనీసం అయిదువేలు అయినా అవుతుంది." అన్నాడు.

"అయిదువేలా?"

"ఎందుకలా ఆశ్చర్యపోతారు? రామచంద్రరాజు మా ఆఫీసులో పనిచేసిన వ్యక్తిగాబట్టి ఆ రేటు. లేకపోతే ఇంకా ఎక్కువే."

గుమస్తా మాటలు వింటుంటే గీతలో ఒక్కసారి నిస్సహాయత ఆవరించింది. పదవీ విరమణ చేసిన వ్యక్తి మృతి చెందితే తర్వాత తనకు రావల్సిన ఫించను కోసం లంచం ఇవ్వాలా? రేపు ఈ గుమస్తా రిటైర్ కాడా? అటువంటి విషయాలు వీరికి పట్టవా? అనిపించింది.

తర్వాత మండలి అభివృద్ధి అధికారిని కలిసింది.

అతని పేరు సుబ్బయ్యనాయుడు. మన్ను తిన్నపాములా ఉన్నాడు. కదలలేని దున్నపోతు ఆకారంలో ఆమెకు కనిపించాడు. కుర్చీలో అటూ ఇటూ కదులుతూ గీతను చూసి "ఏమికావాలి?" అంటూ ప్రశ్నించాడు. అతని మాటల్లో అధికార దర్పం స్పష్టంగా కనిపించింది. మొత్తం విషయం అంతా వివరించి చెప్పింది. గుమస్తా లంచం అడిగిన విషయాన్ని కూడా వివరించింది.

సుబ్బయ్యనాయుడు పడిపడి నవ్వాడు.

"నువ్వు ఏకాలంలో ఉన్నావో అర్థంకావడంలేదు. వాడు తనకు రావల్సిందే చెప్పాడు. ఆ పింఛను ఫైలు మీద నేను సంతకం చేయాలి. నేను సంతకం చేస్తేనే దానికి విలువ. ఈ ఫైలు ఆమోదం పొందితే మీకు మీ కుటుంబానికి వేలకు వేలు డబ్బులు వస్తాయి. అలా వస్తున్నప్పుడు కొంత సొమ్ము ఖర్చు చేయడంలో ఇబ్బంది ఏమిటి? గారపళ్ళను బైటికి పెట్టి ప్రశ్నించాడు.

"మాకు ఎవ్వరి సొమ్మూ అప్పనంగా రావడంలేదు. ప్రభుత్వపరంగా రావల్సిందే ఇస్తున్నారు. మా సొమ్ము మాకు ఇవ్వడానికి ఇన్ని ఆటంకాలా?"

సుబ్బయ్యనాయుడు ఏమీ మాట్లాడలేదు.

గీతకు చాలా అసహనం అనిపించింది.

అధికారుల్లోనూ ప్రభుత్వ సిబ్బందిలోనూ అవినీతి జాఢ్యం ఇంతలా విస్తరించుకుని పోవడం ఆమె జీర్ణించుకోలేకపోయింది. ఒకో సంఘటన చూస్తున్న కొద్దీ చెప్పలేని అసంతృప్తి, కోపం అసహనం ఆమెలో ఆవరించాయి.

జిల్లా కేంద్రానికి బయలుదేరింది. జిల్లా ట్రెజరీ అధికారిని కలుసుకుంది. జరిగిన విషయమంతా వివరించింది. అక్కడ కూడా ఆమెకు అదే పరిస్థితి ఎదురైంది.

"ఏమి చేస్తాం చెప్పమ్మా? కింద నుంచి ప్రపోజల్సు వస్తే కాని మేము ఏమీ చేయలేం. ఇటువంటి పనులు వెంటవెంటనే జరిగిపోవాలంటే సాధ్యంకాదు" అన్నాడతను.

విలేఖరిగా ఏ అధికారిని కలుసుకోవాలన్నా క్షణాల్లో పని అవుతుంది. కార్డు పంపిస్తే లోపల ఎవరున్నా ముందు తననే రమ్మంటారు కానీ సామాన్య వ్యక్తి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలని గీత చేసిన ప్రయత్నం ఆమెను దిమ్మతిరిగేలా చేసింది.

"ఇంతకూ నన్ను ఏమి చేయమంటారు?" అడిగింది.

ఆ అధికారి గీతను విచిత్రంగా చూసాడు.

తర్వాత "నేను ఇవన్నీ వివరించి చెప్పడానికి లేను. అలా చెప్పే టైము కూడా లేదు. మీ పెన్షన్ ప్రతిపాదనలు మండలం నుంచి రాష్ట్ర కేంద్రానికి వెళ్ళాలి. అక్కడ పరిశీలన తర్వాత మంజూరవుతుంది. ఉద్యోగి సర్వీసు రిజిష్టరు సరిగా లేకపోతే వెనక్కి వస్తుంది. అన్నీ సక్రమంగా ఉండి మంజూరైతే పెన్షనుకు ఇంతని గ్రాట్యుటీకి ఇంతని చెల్లింపులు చేయవలసి ఉంటుంది" అతను చెప్పుకుని పోతున్నాడు.

"ఇంతమందికి ఇన్ని రకాలుగా సమర్పించుకుంటూ పోతే ఆ కుటుంబానికి మిగిలిందేమిటి?"

"నీకు విషయం చెప్పాను. అంతేకానీ నిన్ను విశ్లేషణ చేయమనలేదు" అన్నాడు ఆ అధికారి.

"అన్నీ సక్రమంగా ఉండి మాకు రావల్సిన సొమ్ముని చెల్లించడానికి ఎందుకిన్ని ఆటంకాలు?" గీత ప్రశ్నించింది.

"దయచేసి మీరు బైటికి వెళతారా? నాకు చాలా పని ఉంది" కరుగ్గా అని ఎదురుగా ఉన్న ఫైలులో తలదూర్చాడు.

ఉసూరుమంటూ బైటికి వచ్చింది. ఇంతవరకు అధికారుల నుంచి మర్యాదలు అందుకోవడం చూసింది కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఏమి చేయాలో తెలియడం లేదు. ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో అర్థం కావడంలేదు. నిరుపేదలుగా ఉన్న రామరాజు కుటుంబీకులు అధికారులు అడిగిన లంచాలు ఇచ్చుకోలేరు. జీవనాధారం అయిన కుటుంబ యజమాని చనిపోతే ఏ ఆధారం లేకుండా సంసారాన్ని ఈడడం చాలా కష్టం. అటువంటి కష్టంలో ఉన్న రామరాజు కుటుంబ సమస్యకు పరిష్కారం ఏమిటి?

ఎవరిమీదో చెప్పలేని కసి ఆమెలో ప్రారంభమైంది. సమాజం పూర్తిగా కలుషితం అయిపోయిన విషయం మరోసారి స్పష్టంగా అర్థమైంది. సాటి మనిషి బలహీనతపై ఆడుకునే పెద్దమనుషులు నిరుపేదల్ని, అమాయకుల్ని పీక్కుతినే రాక్షస సంస్కృతి ఇతరుల బలహీనతలపై డబ్బులు సంపాదించాలన్న తాపత్రయం ఎప్పుడు పోతుందో అర్థంకావడంలేదు. గీతలో ఆలోచనలు ముసురుకున్నాయి.

రామరాజు అందుకేనా తీవ్రవాదిగా మారిపోయాడు?

ఇటువంటి అవనీతి సమాజాన్ని వ్యతిరేకించాలని ఎవరికి ఉండదు? వ్యక్తుల్లో గూడుకట్టుకుంటున్న అవినీతి స్వార్థం ఎప్పుడు నిర్మూలన జరుగుతుంది?

భారంగా ముందుకు అడుగులు వేసింది.

ఏ ఆధారంలేని నిరుపేద రామరాజు లంచాలు, ముడుపులు సమర్పించుకోలేక అలా అడిగిన వారిమీద తిరగబడ్డాడు. అందుకే తీవ్రవాదిగా ముద్రవేయించుకున్నాడు. ఎవరికీ తెలియనంత దూరప్రాంతానికి వెళ్ళిపోయాడు.

ఇటువంటి పరిస్థితుల్లో ఎవరున్నా వారు చేసేది కూడా రామరాజు మాదిరిగానే ప్రవర్తిస్తారన్న విషయం ఆమెకు అర్థం అయింది. ఎంతో శాంతంగా ఉన్న తనకు జరుగుతున్న వ్యవహారాలు చూస్తుంటే అసహ్యం వేసింది. వ్యవస్థ మీద కోపం తెప్పించింది. రామరాజు వంటి యువకుడిలో ఎందుకు ఆవేశం రాదు అనుకుంది.

16

ఎమ్మెల్యే బాలన్న కిడ్నాప్ వ్యవహారం రాష్ట్రంలో తీవ్రమైన సంచలనం కలిగించింది. ప్రజాభిమానం ఎక్కువగా ఉన్న ప్రజాప్రతినిధిని నక్సలైట్లు బలవంతంగా అడవుల్లోకి తీసుకునిపోవడం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఒక కుదుపు కుదిపింది.

ప్రతి దగ్గరా ఇదే విషయం చర్చనీయాంశంగా మారింది.

పత్రికలన్నీ మొదటి పేజీలో బేనర్ ఐటంగా ఈ వార్తనే ప్రముఖంగా ప్రచురించాయి. రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. బాలన్న మంచి వ్యక్తిగా అజ్ఞాత శత్రువుగా ఉండటం వల్ల పార్టీలతో సంబంధం లేకుండా అన్ని పార్టీలకు చెందిన నాయకులు ఈ సంఘటనను ఖండించారు. అధికార పార్టీ శాంతి భద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలం అయిందని ప్రతిపక్ష పార్టీకి చెందిన చాలామంది నాయకులు పత్రికా ప్రకటనలు జారీ చేసారు.

"సెంట్రల్ జైలులో ఉన్న శ్రీకాంత్‌ను తక్షణం విడుదల చేయాలి. లేకపోతే తమ ఆధీనంలో ఉన్న ఎమ్మెల్యే బాలన్నను హతమారుస్తాం" తీవ్రవాదులు అల్టిమేటం జారీ చేసారు.

ఈ విషయం కూడా పత్రికలలో వార్తగా వచ్చింది. ఈ వార్త చాలామందిలో ఆందోళన కలిగించింది. బాలన్న నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో బంద్ జరిగింది. అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులు దగ్గరుండి మరీ దుకాణాలను ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు.

ఈ సంఘటన పట్ల అన్ని వర్గాలకు చెందినవారు రకరకాలుగా స్పందించారు. చాలామంది తీవ్రవాదుల వైఖరిని దుయ్యబట్టారు. అధికార పార్టీలో కొంతమంది నాయకులు మండల కేంద్రాలలో రిలే నిరాహారదీక్షలు మొదలుపెట్టారు.

శ్రీకాంత్‌ని బేషరతుగా విడుదల చేసేంతవరకు పరిస్థితిలో ఎటువంటి మార్పురాదని తీవ్రవాదులు మరో హెచ్చరిక జారీ చేసారు.

ఆ సమయంలో అనూహ్యమైన సంఘటన జరిగింది.

ఎమ్మెల్యే బాలన్న భార్య భానుమతి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆమరణ దీక్షకి పూనుకుంది. తన భర్తని ప్రాణాలతో విడిచిపెట్టాలని కోరుతూ దీక్షా శిబిరంలో కూర్చుంది. ఆమెకు మద్దతుగా చాలామంది మహిళలు శిబిరంలో కూర్చున్నారు. వారికి మద్దత్తుగా అఖిల పక్షనాయకులు వివిధ మండలాల్లో ధర్నాలు చేపట్టారు

నియోజకవర్గ సమస్య రాష్ట్ర సమస్యగా మారింది.

పరిస్థితి అల్లకల్లోకంగా తయారైంది.

వార్తా పత్రికలలో వివిధ రకాల వార్తా కథనాలు ప్రచురణ జరుగుతున్నాయి. ఇంటిలిజెన్సు అధికారులు కూడా పరిస్థితిని అంచనా వేయలేకపోయారు.

17

సుదర్శన్ ఇంజనీరింగు విద్యార్థి.

చదువును మధ్యలో వదిలిపెట్టి తీవ్రవాద ఉద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. గీతకు అతని గురించి అంతకు మించిన సమాచారం లభించలేదు.

ఇంజనీరింగు కాలేజీ హాస్టల్‌కు వెళ్ళి సుదర్శన్ గురించి వివరాలను తెలుసుకుంది. అతనితో రూంలో ఉండే జగన్ చిరునామా సంపాదించి అతనితో మాట్లాడింది. అతను సుదర్శన్ గురించి చాలా విషయాలను చెప్పాడు.

సుదర్శన్ గ్రామీణ వాతావరణంలో పెరిగినవాడు చాలా తెలివైనవాడు. అతని చదువుకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. ఆ సమయంలో కొంతమంది రాడికల్ విద్యార్థి సంఘం నాయకులు పరిచయం అయ్యారు. వారు చేసే ప్రసంగాలకు మాటలకు ఎంతో ప్రభావితం అయిపోయాడు. వారి ఆలోచనలను పుణికి పుచ్చుకుని తనకు అన్యాయాలు చేసిన వారందర్నీ వ్యతిరేకించాడు.

సుదర్శన్ మీద ఇంజనీరింగు కాలేజీలో లెక్చరర్లు ప్రొఫెసర్లు కక్ష కట్టారు. అన్యాయాన్ని సహించలేని అతని మనస్థత్వం ఆ కాలేజీలో ఇమడలేకపోయింది. అందుకే అందర్నీ ఎదిరించాడు. జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేసాడు ఫలితంగా కాలేజీనుంచి బైటికి పంపివేయబడ్డాడు. జగన్ చెప్పిన విషయాలు క్రమపద్ధతిలో వరసగా లేకపోయినా సుదర్శన్ మనస్థత్వం గీతకు పూర్తిగా అర్థమైపోయింది.

తెలివితేటలు లేని విద్యార్థులకు ఎక్కువ మార్కులు రావడం ఇంటర్నల్ మార్కుల విషయంలో పక్షపాతంగా వ్యవహరించడం కొంతమంది విద్యార్థుల పట్ల కావాలనే వివక్ష చూపించడం. కాలేజీలో కుల రాజకీయాలు వంటివి చూసి అతను తట్టుకోలేకపోయాడు.

ఆ సమయంలో కాలేజీ ఎన్నికల్లో పోటీ చేసాడు.

సుదర్శన్ పట్ల అయిష్టత కలిగిన కొంతమంది కళాశాల సిబ్బంది లెక్చరర్లు అతని ఓటమి కోసం తీవ్రంగా పనిచేసారు. వారి ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి. ఓడిపోవడంతో సుదర్శన్ తీవ్రంగా అప్‌సెట్ అయ్యాడు. అన్యాయాలు చేసినవారి మీద కసీ కోపం విపరీతంగా పెంచుకున్నాడు. సమాజం కుళ్ళిపోయిందని దీనిని మరమ్మత్తు చేయాలని తీవ్రవాదిగా మారిపోయాడు.

అతని వివరాలు సేకరించిన తర్వాత సామాన్యులలో తిరుగుబాటు మనస్థత్వం ఎందుకు ఏర్పడుతుందో గీతామాధురికి అర్థమైంది. పరిస్థితులకు రాజీపడలేని వారు దోపిడీ వ్యవస్థలో ఇమడలేనివారు మాత్రమే సమాజాన్ని మరమ్మత్తు చేయాలని అదీ తీవ్రవాదంతోనే అని నమ్ముతారని తెలిసింది.

యూనివర్శిటీలు, కళాశాలలు రాజకీయ నిలయాలుగా తయారైన విషయం ఆమెకు తెలియంది కాదు. కానీ ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న వారందరూ తీవ్రవాదులుగా ఎందుకు మారడంలేదు? గీత మదిలో ప్రశ్నల పరంపర.

**సుదర్శన్** జీవితం ఇంజనీరుగా మొదలు కావల్సి ఉండగా మొదలు నరికిన చెట్టులా ఎందుకు అయిపోయింది? అతని తెలివితేటలు ప్రజలకు ప్రభుత్వానికి ఉపయోగపడవ్వలసి ఉండగా ఎందుకూ కొరగాకుండా అడవులకే పరిమితం ఎందుకు అయిపోయింది? లోపం ఎక్కడుంది? వ్యవస్థలోనూ వ్యక్తులలోనా?

ఆలోచిస్తుంటే గీత బుర్ర వేడెక్కిపోయింది.

ఏదో చెప్పలేని ఆవేదన మనసంతా పేరుకుని పోయింది.

తాను పరిశీలించవలసిన మూడవ వ్యక్తి పడాల్. అతని గురించి తెలుసుకుంటే మరి కొన్ని తెరలు కూడా తొలిగిపోతాయని గీతకు అనిపించింది. అందుకు తగిన ప్రయత్నాలు చేయాలని నిశ్చయించుకుంది

బాలన్న కిడ్నాప్ వ్యవహారం ప్రభుత్వ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ప్రజలు ఆందోళనలు ధర్నాలు నిరాహార దీక్షలు చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

శ్రీకాంత్‌ను వదిలిపెట్టాలని ఒక పక్క తీవ్రస్థాయిలో ప్రభుత్వంపైన వత్తిడి వస్తోంది. తీవ్రవాద ఉద్యమంలో ఉన్న వ్యక్తిని ఎంతో కష్టపడి పట్టుకున్నామని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టవద్దని మరో పక్క పోలీసు అధికారులు ప్రభుత్వానికి నచ్చచెపుతున్నారు. తీవ్రవాద ఉద్యమంలో కీలక పాత్రను నిర్వహిస్తూ దళ కమాండర్‌గా ఉన్న వ్యక్తిని అరెస్టు చేసిన తర్వాత వదిలిపెట్టడం సరికాదని కొంతమంది ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు. ఈ రెండు విరుద్ధమైన సంఘర్షణల మధ్య ఏమి చేస్తే ఏమవుతుందోనని ప్రభుత్వం పూర్తి తికమకలో పడిపోయింది.

ప్రభుత్వ యంత్రాంగానికి చెందిన వివిధ విభాగాల అధికారులను, ప్రతి నిధులను ప్రభుత్వం సమాయత్తం చేసింది. శాసనసభ్యుడిని విడిపించలేని ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షాలు దుయ్యబట్టడం ఎమ్మెల్యేను తీవ్రవాదుల చెర నుంచి విడిపించాలని అతని అనుచరులు చేస్తున్న ఆందోళనా కార్యక్రమాల గురించి ఆ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

ఆ సమావేశంలోనే శ్రీకాంత్‌ను విడుదల చేయకపోతే ఎమ్మెల్యే బాలన్న్ అశవాన్ని పార్సిల్ చేసి పంపిస్తామని తీవ్రవాదులు చివరి అల్టిమేటం జారీ చేశారు.

దీంతో మరింత ఉద్రిక్తత ఏర్పడింది.

ఎమ్మెల్యే బాలన్న కిడ్నాప్ వ్యవహారం. శ్రీకాంత్ కోసం తీవ్రవాదులు పట్టుపట్టడం. రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలు తెలుసుకుని గీత ఆశ్చర్యపోయింది. తాను సెలవులో ఉండటం వల్ల ఈ ఉదంతాలపై విజయంలో వార్తా కథనాలను ఇవ్వలేకపోయింది.

తమ నాయకుడు శ్రీకాంత్ కోసం ఎంతో చిత్తశుద్దితో కృషిచేసే కార్యకర్తలను చూసి ఆమెకు సరదా అనిపించింది. శ్రీకాంత్ అంత పటిష్టమైన కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నందుకు ఆశ్చర్యపోయింది. జైలులో ఉన్న వ్యక్తి కోసం ఎవరికీ తెలియకుండా అడవుల్లో ఉన్న అన్నలు ప్రయత్నాలు చేయడం ఆమెకు ముచ్చట కలిగించింది.

శ్రీకాంత్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడిచిపెడుతుందా?

ప్రభుత్వం తలవంచేంత వరకు శ్రీకాంత్ కోసం తీవ్రవాదులు అంత సిన్సియర్‌గా కృషిచేయగలరా? పట్టువదలకుండా అతని విడుదల కోసం ప్రయత్నాలు చేయగలరా? అనేక ప్రశ్నలు ప్రశ్నలుగానే ఉండిపోయాయి.

తాము నమ్మిన సిద్ధాంతాల కోసం తమ ఆశయాలు ఆదర్శాలను సాధించడం కోసం సుఖాలనన్నింటినీ వదులుకుని అడవుల్లో సంచరిస్తూ నిరంతర పోరాటాలు చేస్తున్న వారి చిత్తశుద్ధి పట్ల గీతలో ఆసక్తి ఏర్పడింది.

అన్యాయాలను ఎదిరించడానికి ఎటువంటి పనులు చేయడానికైనా సిద్దపడతారని గీత తీవ్రవాదుల విషయంలో అనుకునేది. కానీ తమ నాయకుడ్ని సహచరుడ్ని అరెస్టు చేసిన ప్రభుత్వం మీదే పోరాటం చేయగలరని ఆమె ఊహించలేకపోయింది.

అంతవరకు తీవ్రవాద ఉద్యమంలో తాను సేకరిస్తున్న విషయాలకు అవగాహన పెంచుకుంటున్న అంశాలకు ఈ కిడ్నాప్ మరింత స్ఫూర్తిని కలగజేసినట్లయిందని గీత అనుకుంది.

గిరిజన గ్రామమైన లంబసింగిలో బస్సు దిగగానే గీత చుట్టూ ఆ ప్రాంత గిరిజనులంతా చేరిపోయారు. చాలామంది ఆప్యాయంగా పలకరించారు.

ఆ ప్రాంతానికి చెందిన పడాల్ వివరాలు వెంటనే తెలిసాయి.

పడాల్ పట్ల ఆ ప్రాంతంలో గిరిజనులకు ఎంతో ప్రేమాభిమానాలు ఉన్నాయని అర్ధమైంది ఎవరిని కదిపినా అందరూ పడాల్‌ను దేముడిగానే కొలుస్తున్నారు. అటువంటి వ్యక్తి తీవ్రవాదిగా ఎందుకు మారిపోయాడో ఆమెకు అర్ధం కాలేదు.

పడాల్ గురించి తన నోట్సులో రాసుకున్న విషయాలను గీత మరోసారి చూసుకుంది. ఆ వివరాలు ప్రకారం అతను గిరిజనులను వడ్డీ వ్యాపారస్తుల కబందహస్తాల నుంచి కాపాడాడు. వ్యాపారస్తులు ధనవంతులు. అతనిమీద పోలీసులకు లేనిపోని విషయాలను చెప్పి వారిని ఉసిగొలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో పడాల్ పోలీసులకు భయపడి అండర్ గ్రౌండుకు వెళ్ళిపోయాడు.

గీత దగ్గరలో ఉన్న చెట్టుకింద గిరిజన స్త్రీలను కూర్చోబెట్టుకుని వారికి జరుగుతున్న అన్యాయాలను అడిగి తెలుసుకుంది.

వారు చెప్పిన వివరాల ప్రకారం... లంబసింగి గ్రామంలో రాజగిరి, గురుమూర్తి అనే ఇద్దరు వ్యాపారస్తులు చాలా మోసాలకు పాల్పడేవారు గిరిజనుల అవసరాలకు అప్పులు ఇస్తుంటారు. అధిక వడ్డీలను వసూలు చేస్తుంటారు. తీసుకున్న అప్పులు చెల్లించలేని గిరిజనులకు చెందిన ఆస్థులు భూములు అనేకం ఈ వ్యాపారస్తుల ఖాతాల్లోకి చేరిపోయాయి జరుగుతున్నది అన్యాయమని తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండేవారు. గిరిజనుల నుంచి పొందిన భూములను వ్యాపారస్తులు ఆ ప్రాంతంలో ఉన్న ఇతరులకు అన్యాక్రాంతం చేసేవారు. ఈ ప్రాంత గిరిజనులు తమ అవసరాలు తీర్చుకోవడానికి మరో అవకాశం లేక ఈ వడ్డీ వ్యాపారస్తులనే ఆశ్రయిస్తున్నారు.

గీత ఆ ప్రాంతంలోనే ఉన్న రాజగిరి గురుమూర్తిలను కలుసుకుంది.

పరస్పర పరిచయాలు అయిన తర్వాత "మీరు అధిక వడ్డీలు వసూలు చేయడం సరికాదు" అంది గీత.

చివ్వున తలెత్తాడు రాజగిరి.

"ఎలా చేసుకోవాలో మాకు తెలుసు" అంటూ తాను చేసుకుంటున్న పనిలో మునిగిపోయాడు.

"తీసుకున్న అప్పుకు న్యాయపరంగా వడ్డీని వసూలు చేయడం తప్పుకాదు. కానీ దానికి విరుద్ధంగా వసూలు చేస్తున్న మీ మీద చర్యలు తీసుకోవచ్చు"

"పో...పోవమ్మా పెద్ద చెప్పొచ్చావు"

గీతకు తల కొట్టేసినట్లయింది. కోపం తన్నుకుని వచ్చింది. ఏమీ అనకుండా తమాయించుకుంది. తర్వాత ఆ గ్రామంలో ఉన్న గిరిజన కార్పోరేషను కార్యాలయానికి వెళ్ళింది. వారు రుణాలు పంపిణీ చేసినవారి వివరాలు తీసుకుని వారందర్నీ కలుసుకుంది.

వారంతా రాజకీయ పలుకుబడి ఉన్నవారేనన్న విషయం అర్థమైంది.

ఆ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక బాంకు శాఖకు వెళ్ళి మేనేజరును కలుసుకుంది ఇచ్చిన రుణాలకు సంబంధించిన వివరాలను అడిగింది.

"మీకు తెలియదండీ ఈ గిరిజనులకు అప్పులు ఇస్తే వసూలు చేసుకోవడం చాలా కష్టం. అందరూ రుణాలు కావాలని అడుగుతుంటారు కానీ హామీలను మాత్రం ఎవ్వరూ ఇవ్వలేరు" మేనేజరు చెప్పాడు.

"అయితే ఎవరికి రుణాలను ఇస్తున్నారు?"

"హామీ చూపించినవారికి"

"గిరిజనులు రుణాలకు తగిన హామీని చూపించలేకపోతున్నారు. అందువల్ల వారు బాంకు రుణాలను పొందలేకపోతున్నారు అంతేకదా?" అంది గీత.

"అవును."

"ఈ ఏజన్సీలో ప్రత్యేకంగా గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన మీ బాంకు ఏమి చేస్తున్నట్లు?"

మేనేజరు నుంచి మొత్తం వివరాలను తీసుకుంది. ఆ కాగితాల్లో వివరాలు చూస్తే రుణాలు పొందిన వారంతా గిరిజనేతరులే. ఒకటి అరా రుణాలు పొందిన గిరిజనులున్నారంటే వారంతా రాజకీయ పరపతి ఉన్నవారు.

వడ్డీ వ్యాపారస్తులు ఆ ప్రాంతంలో ఎందుకు వర్ధిల్లుతున్నారో గీతకు అర్థమైంది. గిరిజనులకు ఏదో చేయాలని అనుకున్న పడాల్ ఆ పరిస్థితిని ఎదిరించలేక రాజీపడలేక ప్రత్యక్షంగా సమస్యను పరిష్కరించలేక తీవ్రవాద మారడంలో ఆశ్చర్యం ఏముంది?

పడాల్ నివశించిన ప్రాంతంలో గిరిజనులు ఎంతటి దుస్థితిలో ఉన్నారో చూస్తుంటే ఆమె గుండె తరుక్కుపోయింది. ఈ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ఏమి అవుతున్నాయి? ఆమెకు అర్థంకాలేదు. ఆ వివరాలన్నీ పుస్తకంలో రాసుకుంది.

తర్వాత బస్సు ఎక్కింది.

20

ఎమ్మెల్యే బాలన్నను తీవ్రవాదుల చెరనుంచి విడిపించడానికి ప్రభుత్వం అంతర్గతంగా అధికారులతో చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చింది. తీవ్రవాదులు పెట్టిన ప్రధాన షరతులకు అంగీకారాన్ని తెలియజేసింది.

శ్రీకాంత్‌ను సెంట్రల్ జైలు నుంచి విడిపించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రభుత్వం న్యాయ కోవిదులు నిపుణులతో చర్యలు సంప్రదింపులు జరిపింది. పోలీసులు శ్రీకాంత్‌పై పెట్టిన కేసులు వాటికి సంబంధించిన సెక్షన్లు వంటి వివరాలను అధికారులు పరిశీలించారు.

శ్రీకాంత్ బెయిల్ దరఖాస్తును ప్రభుత్వం తరపున దాఖలు చేయాలని నిర్ణయం జరిగింది మొత్తం కార్యక్రమాలన్నీ చురుగ్గా జరిగిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉదంతం సంచలనం కలిగించడంతో ఎటువంటి ఆటంకాలు ఎదురుకాలేదు.

అన్ని లాంచనాలు పూర్తి అయ్యాయి. అయితే సెంట్రల్ జైలు నుంచి విడుదలైన తర్వాత శ్రీకాంత్‌ను అడవుల్లో ఉన్న తీవ్రవాదులకు అప్పగించడం ఎలా అనే విషయం అందరిలోనూ చర్చనీయాంశం అయింది.

తీవ్రవాదుల నిబంధనల ప్రకారం పోలీసు అధికారులు ఇతర ప్రభుత్వ సిబ్బంది ఎవరూ శ్రీకాంత్ వెంట రాకూడదు అన్న నిబంధన అడ్డంకిగా మారింది. పోలీసులకు తీవ్రవాదులకు మధ్యన సంధాన కర్తలుగా ఉండటానికి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు ముందుకు వచ్చారు.

ఎట్టకేలకు శ్రీకాంత్ జైలు నుంచి బైటికి వచ్చాడు. జైలు బైట సిద్ధంగా ఉన్న ప్రజాస్వామ్య హక్కుల ప్రతినిధులు శ్రీకాంత్‌ను కలుసుకుని పరిచయం చేసుకున్నారు. అదివరకే వారు పరిచయం ఉండటంవల్ల శ్రీకాంత్ నుంచి ఎటువంటి అభ్యంతరం వ్యక్తం కాలేదు.

ఆ ప్రతినిధులు శ్రీకాంత్‌ను కారు ఎక్కించుకున్నారు. అతను చెప్పిన ప్రకారం ముందుకు బయలుదేరారు. అడవిలో చాలా దూరం వెళ్ళిన తర్వాత ఉప్పరగూడెం వద్ద కారును ఆపించాడు. అందరూ కిందకు దిగారు.

అక్కడినుంచి దట్టమైన అడవి మొదలవుతుంది.

"మీరు ఇక్కడే వెయిట్ చేయండి. రేపు ఉదయం ఎమ్మెల్యే బాలన్న ఇక్కడికే వస్తారు" అన్నాడు శ్రీకాంత్.

తర్వాత దట్టమైన అడవిలో కలిసిపోయాడు.

సెంట్రల్ జైలు నుంచి శ్రీకాంత్‌ను విడిపించి అడవుల్లోకి పంపిన విషయం తెలుసుకుని అందరిలోనూ ఒకటే ఆసక్తి కిడ్నాపు కథ సుఖాంతం అవుతుందా లేదా అనే విషయమే చర్చనీయాంశంగా తయారైంది.

ఉప్పరగూడెం అడవుల వద్ద ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు శ్రీకాంత్‌ను వదిలిపెట్టిన తర్వాత ఆత్రంగా ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఎమ్మెల్యే బాలన్న కాళ్ళీడ్చుకుంటూ ఆ ప్రాంతానికి వచ్చాడు. మనిషిలో అలసట. కళ్ళల్లో నిద్రలేమి అతనిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అందరూ కారు ఎక్కారు. కారు ఘాట్ రోడ్డు వెంబడి కిందకు బయలుదేరింది.

బాలన్న కారులో కూర్చున్న తర్వాత ప్రజాస్వామ్య హక్కుల సంఘసభ్యులు వివిధ రకాల ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసారు. అప్పటికే బాలన్న పూర్తిగా అలసిపోయి ఉన్నాడు. మాట్లాడటం కూడా చాలా కష్టంగా ఉంటోంది తర్వాత. "దయచేసి ఇప్పుడేమీ చెప్పలేను. ఇంటికి వెళ్ళిన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు" వారికి మరి అవకాశం ఇవ్వలేదు.

కారు కిటికీలోనుంచి చల్లటి కొండగాలి తగలడంతో అలసటతో ఉన్న బాలన్న కళ్ళు వాలిపోయాయి. నిద్రలోకి జారిపోయాడు.

బాలన్న మత్తుగా తలవాల్చేసాడు.

బాలన్న ఇల్లు చాలా కోలాహలంగా ఉంది.

బంధువులు, స్నేహితులు పోలీసులు ఇంటినిండా ఉన్నారు. కారు ఆగగానే అందరూ చుట్టుముట్టారు. పార్టీ కార్యకర్తలు నాయకులు జేజేలు పలుకుతూ నినాదాలు చేసారు. ఎవరో పెద్ద గజమాలను ఎమ్మెల్యే మెడలో వేసారు.

బాలన్న విడుదలయ్యాడని తెలుసుకుని చాలామంది పత్రికా విలేఖర్లు టీవీ ఛానెల్ రిపోర్టర్లు కూడా అతని ఇంటికి వచ్చి సిద్దంగా ఉన్నారు.

ఇంటిలోపలికి వెళ్ళగానే బాలన్న కళ్ళు భానుమతి కోసం వెతికాయి.

లోపలినుంచి బైటికి వచ్చి భానుమతి కళ్ళు బాలన్న కళ్ళతో కలుసుకున్నాయి. మృత్యుంజయుడిగా వచ్చిన భర్తను చూసి ఆనందాన్ని ఆపుకోలేకపోయింది. చుట్టుపక్కల ఎంతమంది ఉన్నా ఆగలేకపోయింది పరుగు పరుగున వచ్చి భర్తను చుట్టుకునిపోయింది.

ఎంతోమంది అక్కడున్నారు. బాలన్న ఆ విషయాలేమీ గమనించలేదు భార్యను పొదవి పట్టుకున్నాడు.

భానుమతికి దుఃఖంతో కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

ఆమెకు చెప్పలేని విచారం గొంతులోంచి తన్నుకుని వచ్చింది.

ఆగలేక వెక్కివెక్కి ఏడ్చేసింది.

పిల్లలిద్దరూ తల్లిదండ్రుల కాళ్ళను చుట్టుకునిపోయారు.

ఆ దృశ్యం అక్కడున్న వారికి అపురూపంగా అనిపించింది. అందరూ నిశ్చేష్టులై చూస్తుండిపోయారు. వచ్చిన వారందరి మనసుల్లోనూ ఆ దృశ్యం అందమైన చిత్రంలా ముద్రించుకుని పోయింది.

21

గీత తన పరిశోధన పూర్తిచేసింది. శ్రీకాంత్ చెప్పిన ముగ్గురు తీవ్రవాదుల కేసు స్టడీలో అనేక విషయాలను తెలుసుకుంది. స్వయంగా పరిశీలించడంతో ఎన్నో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. తన పరిశీలనకు సెలవలు డబ్బు సమయం ఖర్చు అయినప్పటికీ గీతకు ఎంతో సంతృప్తి అనిపించింది.

అంతవరకు తీవ్రవాదులపై ఆమెకు ఉన్న కొన్ని అపోహలు, భావాలు పూర్తిగా తొలిగిపోయాయి.

ఎవరైనా తీవ్రవాదులుగా ఎందుకు మారతారు? వారి వెనుక సామాజిక ఆర్థిక కారణాలు ఎటువంటివి? ఆమెకు కొంతమేర అవగాహన ఏర్పడింది.

ఇంటికి వెళ్ళగానే అమ్మ రామలక్ష్మి ఆతృతగా ఎదురుచూస్తోంది వచ్చి రాగానే ప్రశ్నల వర్షం కురిపించింది. "ఎవరో ఫ్రెండు దగ్గరికి వెళతానని ఇన్నిరోజులు ఉండిపోయావేం? రెండురోజుల నుంచి నువ్వు వస్తావని ఎదురు చూడటం.. నువ్వు రాకపోవడంతో నిరాశ చెందడం"

"సారీ అమ్మా వచ్చేద్దామని అనుకున్నాను. అయినా కుదరలేదు. వార్తలకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన వివరాలను సేకరించవలసి వచ్చింది."

"గీతా నీకు ఏ టీచరు ఉద్యోగమో లెక్చరరు ఉద్యోగమో అయితేనే బాగుండేది. ఆడపిల్లగా నీకు ఈ తిరుగుళ్ళేమిటమ్మా?"

"తప్పమ్మా అందరూ నీకులాగే ఆలోచిస్తే ఏ ఆడపిల్లా ఉద్యోగం చేయలేదు. మగవాళ్ళతో సమానంగా వారికి ధీటుగా ఏ ఉద్యోగమైనా చేయగలమని ఆడవాళ్ళు కూడా రుజువు చేయగలగాలి"

"నువ్వు ఎన్ని చెప్పు గీతా ఊర్లు తిరిగే ఉద్యోగం చేయడం నాకు ఇష్టంలేదు"

"అయితే ఏమి చేయమంటావు?"

"మంచి సంబంధం చూసి పెళ్ళిచేసుకుని పిల్లాపాపలతో కాపురం చేస్తే సరిపోతుంది. నీ మొగుడికి మంచి ఉద్యోగం ఉంటే సరిపోతుంది హాయిగా ఇంటిపట్టునే ఉండవచ్చు"

గీతకు విపరీతమైన కోపం వచ్చింది.

విసురుగా బెడ్రూంలోకి వెళ్ళి మంచం మీద కూలబడిపోయింది. అసలు ఆడవాళ్ళ మనస్థత్వం ఎందుకు మారదు? స్త్రీని స్త్రీయే అర్థం చేసుకోకపోతే ఎవరు అర్థం చేసుకుంటారు? ఆలోచిస్తున్న కొద్దీ అసహనం ఎక్కువ అయిపోయింది. అలసట చాలా ఎక్కువ అయినట్లయింది.

కూతురు పరిస్థితి చూసి రామలక్ష్మి మనసు ఏదోలా అయిపోయింది. తిరిగి తిరిగి అలసిపోయి ఇంటికి వచ్చిన మనిషిని బాధపెట్టానేమో అనుకుంది. దగ్గరికి వచ్చి "రా గీతా వారం రోజులుగా ఏమి తిన్నావో తెలియదు. నీకు ఇష్టమని గోంగూర పచ్చడి చేసాను" అనునయంగా వచ్చి భుజం మీద చెయ్యి వేసి కూతుర్ని దగ్గరికి తీసుకుంది.

"నాకేం అక్కరలేదు. అసలు నాకు ఆకలిగా కూడా లేదు" మంచం మీద అటు తిరిగిపడుకుంది.

"నిన్ను ఏమన్నానని అంతకోపం?"

"కోపం కాదమ్మా తల్లిగా నన్ను అర్థం చేసుకోలేదన్నది నా ఆవేదన తప్ప మరేం లేదు."

"నా చిట్టితల్లిని నేను తప్ప మరెవరు అర్థం చేసుకుంటారు? రకరకాల వార్తలు వ్యాసాలు రాస్తుంటావు కదా? తల్లి మనసును అర్థం చేసుకోలేవా? నీమీద ఇష్టంలేకో, కోపంతోనో ఏమీ చెప్పడం లేదు. నీమీద అభిమానం ప్రేమ ఉండబట్టే ఇవన్నీ చెప్పవలసి వచ్చింది" అనునయంగా అంది రామలక్ష్మి.

గీత ఆలోచించింది.

తల్లి ఆవేదన తాను కాక ఎవరు అర్థం చేసుకుంటారు? ఆమెను అర్థం చేసుకోవాలి కదా అనుకుంది.

అలా ఆలోచించగానే గీత మనసు తేలికపడి నట్లయింది. అన్నం తినడానికి మంచం మీద నుంచి లేచింది.

''భోజనం చేస్తుండగా ''నువ్వు ఊరికి వెళ్ళిన తర్వాత మీ ఎడిటరుగారు ఆఫీసు బాయిని ఇంటికి పంపించి నువ్వు ఎప్పుడు వస్తావని అడిగారు''

అమ్మ చెప్పిన విషయం వినగానే ఆఫీసులో పెండింగులో ఉన్న వార్తలు రాయవలసిన స్పెషల్ స్టోరీలు అన్నీ గీతకు గుర్తుకు వచ్చాయి.

22

**సెలవుల తర్వాత** గీత విజయం ఆఫీసుకు వెళ్ళింది.

తాను కూర్చునే టేబుల్ పైన కాగితాలు ప్రెస్ నోట్లు చిందరవందరగా వుంటే వాటిని శుభ్రంగా సర్దుకుంది. కంప్యూటర్‌ను ఆన్ చేసి అందులో తాను కంపోజ్ చేసిన వార్తల ఫైల్సును కూడా చూసుకుంది. టేబుల్ సొరుగులో వార్తలను సేకరించే సమయంలో రాసుకున్న పాయింట్లున్న నోటు పుస్తకాన్ని ఒకసారి చూసుకుంది.

ఈ పనిలో బిజీగా ఉన్న సమయంలో పక్క రూంలో ఉన్న న్యూస్ ఎడిటర్ రాజారావు నుంచి పిలుపు వచ్చింది.

అన్నీ వదిలిపెట్టి వెంటనే అతని వద్దకు వెళ్ళింది.

''కూర్చో గీతామాధురీ''

న్యూస్ ఎడిటర్ రాజారావును విష్ చేసి కూర్చుంది.

''ఈ మధ్య వరసగా సెలవులు పెడుతున్నావు. ఏమైనా పర్సనల్ సమస్యలు ఉన్నాయా?'' నెమ్మదిగా అడిగాడు.

న్యూస్ ఎడిటర్ రాజారావుకు తాను విషయ సేకరణ చేసిన అంశాల గురించి చెప్పాలని అనిపించలేదు. ఆ అవసరం కూడా ఉందని అనుకోలేదు. ''అవును సార్ మా ఫ్రెండ్ రమ్మని ఉత్తరాలు రాస్తోంది. చాలా సంవత్సరాలు అయింది ఆమెను కలుసుకుని అందుకే సెలవు పెట్టాను.''

చాలా విషయాలు మాట్లాడిన తర్వాత ''మన పత్రికలో వస్తున్న వార్తల గురించి నువ్వు రాసే వార్తలు చాలా సమగ్రంగా ఉంటాయి. నీ వార్తలను చదువుతుంటే వార్తకోసం నువ్వు చాలా కష్టపడ్డావని తెలుస్తుంది. నీ రైటింగ్సులో నీ సిన్సియారిటీ స్పష్టంగా కనిపిస్తుంది''

''అంతా మీ అభిమానం సార్.''

''నువ్వు రాసిన వార్తల వల్ల అతడిని నువ్వు చేసిన ఇంటర్వ్యూ వల్లే కదా శ్రీకాంత్‌ను పోలీసులు పట్టుకున్నారు.''

గీత తుళ్ళిపడింది.

''అవును గీతా మన విజయం పత్రికలో శ్రీకాంత్ ఇంటర్వ్యూ పబ్లిష్ కాగానే ఎస్పీ శ్యామ్ సుందర్ వలపన్నాడు. నువ్వు తీవ్రవాదుల స్థావరానికి ఎలా వెళ్ళావన్న విషయం వివరంగా రాయడంతో వారి పని సులభం అయిపోయింది. దాని ఆధారంగానే శ్రీకాంత్ ఆచూకీ కనుక్కుని పట్టుకున్నారు.

న్యూస్ ఎడిటర్ రాజారావు చెబుతున్న మాటలు ఆమెకు షాక్ కొట్టినట్లు అనిపించాయి. అతను చెబుతున్న మాటలు తలకు ఎక్కడం లేదు. ఇంతవరకు తాను ఈ ఏంగిల్‌లో ఆలోచించలేదు. న్యూస్ ఎడిటర్ చెప్పిన విషయం వాస్తవం అయితే తాను చాలా పెద్ద

పొరపాటు చేసినట్లే. తాను అభిమానించి ఇష్టపడిన శ్రీకాంత్ తన కారణంగానే పట్టుబడ్డాడన్న విషయం ఆమెలో ఎంతో ఆవేదన కలిగించింది.

"ఏమిటి గీతా ఆలోచనలో పడ్డావు?"

"ఏమీ లేదు సార్" గీత తడబడింది.

"పోలీసులు ఎంతో కష్టపడి అరెస్టు చేసిన శ్రీకాంత్‌ను తీవ్రవాదుల వత్తిడి కారణంగా జైలు నుంచి విడిచిపెట్టబడ్డాడు. మళ్ళీ పాత జీవితంలోకి వెళ్ళిపోయాడు. ఇప్పుడు కథ మళ్ళీ మొదటికి వచ్చింది."

"అంటే?"

"ఎంతో ప్లానింగ్‌తో అరెస్టు కాబడిన వ్యక్తిని ఎమ్మెల్యే బాలన్న కిడ్నాప్ ద్వారా బలవంతంగా జైలునుంచి బైటపడిపోయాడు. ఇటువంటి చీడ పురుగుల్ని ఏరి పారేయవలసిన అవసరం ఉంది" అన్నాడు.

"చీడపురుగు" అని న్యూస్ ఎడిటర్ సంబోధన గీత మనసుకు ముల్లులా గుచ్చుకుంది.

అతని అభిప్రాయం తప్పని చెప్పాలని అనిపించింది. "తప్పు సార్. వారు కూడా దేశభక్తులే. వారి ఆదర్శాలు, ఆశయాలు ఎంతో గొప్పవి. ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్ని ఎదిరించడానికి మాత్రమే వారు తీవ్రవాదులుగా మారుతున్నారు."

"శ్రీకాంత్‌ను ఇంటర్వ్యూ చేయడం, అడవిలో అన్నలతో కలిసి ఉండటంతో నీకు కూడా వారి మీద సానుభూతి పెరిగినట్లుంది."

"సానుభూతికాదు సార్. వాస్తవాన్ని చెబుతున్నాను. నాకు వారితో కలిగిన పరిచయం వారితో కలిసి ఉన్న సమయంలో తెలుసుకున్న విషయాలు చాలా ఉన్నాయి సార్. వాటిని బేరీజు వేస్తే మీరన్న మాట సరైంది కాదని అనిపిస్తుంది."

"ఏమైనప్పటికీ నువ్వు తీవ్రవాదుల సింపథైజర్‌గా మారిపోయావు" న్యూస్ ఎడిటర్ నవ్వుతూ అన్నాడు.

ఆ నవ్వు గీతలో కంపరాన్ని కలిగించింది.

ఇంతలో న్యూస్ బ్యూరో చీఫ్ శ్రీనివాసరావు రాజారావు ఛాంబర్‌లోకి అడుగుపెట్టాడు.

"రావోయ్ న్యూస్ ఎడిటర్ అతడిని ఆహ్వానించి ఎదురుగా ఉన్న కుర్చీని చూపించాడు. బ్యూరో ఛీఫ్ శ్రీనివాసరావు కూర్చోగానే ఈ రోజు ప్రోగ్రాంలు ఏమిటి?" అడిగాడు.

"బాలన్న నక్సలైట్ల చెరనుంచి విడుదలయ్యాడు. అతడిని కలిసి స్పెషల్ ఇంటర్వ్యూ చెయ్యాలని అనుకుంటున్నాను. అడవిలో అన్నల వద్ద అనుభవాలు చెబితే మంచి వార్త అవుతుంది."

అతని మాటలు విని గీత ఎలర్టు అయిపోయింది.

"శ్రీనివాస్‌గారూ మీరేమీ అనుకోనంటే నాదో రిక్వెస్టు. మీరు కలవాలనుకుంటున్న బాలన్నను కలుస్తాను, మాట్లాడతాను. ఈ సబ్జక్టును చాలావరకు నేనే డీల్ చేసాను" అంది గీత.

"ఓకే గీతగారూ. నాకు అది ఇంట్రస్టున్న సబ్జక్టు కాదు. నేను సిటీలో మరో ప్రోగ్రాంకు వెళతాను" శ్రీనివాస్ అన్నాడు.

ఈ లోపు న్యూస్ ఎడిటర్ రాజారావు కలగజేసుకుని "ఈరోజు సిటీలో చెప్పుకోదగ్గ ప్రోగ్రాములేవీ లేవు. మన విజయం తరపున మీ ఇద్దరూ వెళ్ళండి."

"ఇద్దరూనా?"

"అవును. ఒక వ్యక్తిని ఇద్దరు కలిసినప్పుడు ఎక్కువ వివరాలు, కొత్త విషయాలను మరింతగా రాబట్టడానికి అవకాశం ఉంటుంది."

ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.

ఎమ్మెల్యే బాలన్న ఇల్లు సందడిగా ఉంది.

నక్సలైట్ల చెర నుంచి విడుదల కావడంతో అతని మిత్రులకు బంధువులకు ఎంతో ఆనందంగా ఉంది. పలకరించడానికి చూడటానికి ఇంటికి వస్తున్న వారందరికీ స్వీట్లు ఇస్తున్నారు.

ఎమ్మెల్యే బాలన్నతో వ్యక్తిగతంగా పరిచయం ఉన్న బ్యూరో శ్రీనివాసరావుకు ఎంతో ఉపయోగపడింది. ఇతర పత్రికల వారికి ఎవరికీ లేని విధంగా విజయం పత్రిక్కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. ఈ విషయం ఆ ప్రాంతంలోనే ఉన్న ఇతర పత్రికా విలేకర్లకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు.

ఇంటిలోపల గదిలో సమావేశం ఏర్పాటు అయింది.

బాలన్నతోపాటు గీత శ్రీనివాసరావులు మాత్రమే ఉన్నారు.

అప్పుడు బ్యూరో శ్రీనివాసరావు తీవ్రవాద నాయకుడు శ్రీకాంత్‌ను అడవుల్లోకి వంటరిగా వెళ్ళి ఇంటర్వ్యూ చేసిన ఈ విజయం లేడీ రిపోర్టరు గీతామాధురి అంటూ పరిచయం చేసాడు.

ఆ పరిచయం వల్ల బాలన్న గీతపట్ల ప్రత్యేక ఆసక్తిని చూపించాడు.

తర్వాత వారిద్దరివైపు తిరిగి "అసలు శ్రీకాంత్ ఎవరో నాకు తెలియదు. అతడ్ని నేను చూడలేదు కూడా" అన్నాడు బాలన్న.

పరస్పర పరిచయాలు జరిగాయి. తర్వాత బాలన్న ఇంటిలోనుంచి ముగ్గురికీ అల్పాహారం, టీలు వచ్చాయి. అవన్నీ తీసుకున్న తర్వాత అసలు విషయంలోకి వచ్చారు.

"నా కిడ్నాప్ విషయం అందరికీ చెప్పి మళ్ళీ రాద్ధాంతం చేయాలని అనుకోవడంలేదు. అందుకే ఇంతకు ముందు వచ్చిన విలేకర్లందరికీ క్లుప్తంగా చెప్పాను. జరిగినదంతా ఒక అనుభవం. దానిని గుర్తుచేసుకోవడం దాని గురించి ఆలోచించడం నా వ్యక్తిగతమైన విషయం పదిమందికి ఆ విషయాలు చెప్పాలని అనుకోవడంలేదు. నేను అడవుల్లో ఉన్నంతకాలం అన్నలుగా చెప్పబడుతున్న నక్సలైట్లు నన్ను ఎంతో మర్యాదగా ప్రేమగా చూసుకున్నారు వారి ఆలోచనలు భావాలను నాకు వివరించారు. సమాజంలో జరుగుతున్న రకరకాల అన్యాయాలు నిరంతరం జరుగుతున్న దోపిడీలను నాకు చెప్పి పరిష్కారం కనుగొనాలని కోరారు. వారు చెబుతున్న విషయాలు వివరిస్తున్న సంఘటనలు విన్న తర్వాత నన్ను కిడ్నాప్ చేయడం మంచి పని అనిపించింది. వారి కోర్కె తీరడానికి ఇదొక్కటే సరైన మార్గం అనిపించింది. "ఎమ్మెల్యే బాలన్న తన మనసులో ఉన్న ఆలోచనలను వారి ముందు వివరించాడు.

బాలన్న మాటలు గీతలో ఒకలాంటి ఆనందాన్ని కలిగించాయి.

"కొన్ని రోజులు వారితో కలిసి ఉన్నారు. వారిని నిశితంగా పరిశీలించారు. వారి ఆలోచనలను పంచుకున్నారు. వారు చేస్తున్న పనులను చూసారు తీవ్రవాదుల పట్ల మీకు కలిగిన భావాలు ఏమిటి?" గీత ప్రశ్నించింది.

బాలన్న దీర్ఘంగా ఆలోచించి "మొదట వారి మీద జాలి కలిగింది. పట్టణాల్లో మనం అనేక సదుపాయాలను అనుభవిస్తున్నాం. సుఖపడుతున్నాం. వరు మాత్రం అడవుల్లో చలిలో, వర్షాలలో రకరకాల ఇబ్బందులు పడుతున్నారు. సమానత్వం అందరికీ కావాలని పోరాటాలు చేస్తున్నారు."

"వారి సిద్ధాంతాలు మీకు నచ్చాయా?"

"సిద్ధాంతాల విషయం నేను చెప్పడం లేదు. వారిని అర్ధం చేసుకోవాలంటే చాలా కాలం పడుతుంది. వారి విధానాలను ఆచరించాలంటే ఎంతో కష్టపడాలి. నాలాంటి ప్రజాప్రతినిధులకు అది సాధ్యం కాదు."

"ఏం?"

"అన్యాయాలపైనా అక్రమాలపైనా వారు పోరాటం చేయమని చెబుతుంటారు. ఏ సమస్య పరిష్కారం కావాలన్నా హింసే సరియైన మార్గమన్నది వారి సిద్ధాంతం దెబ్బకు దెబ్బ. రక్తానికి రక్తం. వారి విధానం. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా ఆ విధంగా ప్రవర్తించలేను కదా?"

"మీ సమస్యలు. అదే గ్రామాలలో కనిపిస్తున్న సమస్యలను పరిష్కరించడానికి మీరు ఏమి చేస్తుంటారు?"

"నియోజకవర్గంలో చాలా గ్రామాలలో ప్రజలు తమ సమస్యలను నాకు ఎప్పుడూ చెబుతుంటారు. కొన్ని సమస్యలను నేను తెలుసుకుంటుంటాను. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వస్తుంటాను. పరిష్కరించబడటానికి వారిపైన పదే పదే వత్తిడి తీసుకుని వస్తుంటాను."

"మీరు చేస్తున్న కృషిలో ఈ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయా?" గీత అడిగింది.

బాలన్న నిట్టూర్చాడు.

"అధికార యంత్రాంగంలో జాప్యం తప్పకుండా ఉంటుంది సమస్య తెలిసినా పరిష్కరించడానికి చాలా పనులు చేయవలసి ఉంటుంది. ఇంక జాప్యం అంటారా తప్పకుండా ఉంటుంది. సమస్యలేమైనా వెంటవెంటనే పరిష్కారం అయిపోతుంటే ప్రజల్లో కూడా అసంతృప్తి ఎందుకు ఉంటుంది? తొందరగా పనులు జరిగిపోతుంటే ప్రజలకు మా వంటి శాసనసభ్యుల అవసరం కూడా ఉండకపోవచ్చు. అందరూ సుఖంగానే ఉంటారు. అసంతృప్తి అనేది ఉండదు. అయితే ఇక్కడ ఒక సమస్య పరిష్కారానికి కృషి చేయవలసి ఉంటుంది" బాలన్న వివరంగా చెప్పాడు.

"అయితే సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల తీవ్రవాదులే ముందున్నారని అంటారా?"

"అలా అని నేను అనడంలేదు. తీవ్రవాదులంటే చాలామంది ఒకలాంటి భయం ఉంది. ఆ భయంతో వారు చెప్పిన పనులన్నీ జరుగుతుంటాయి."

"మీరు తీవ్రవాదుల వద్ద కొద్దిరోజులు ఉండటంతో వారి విషయాలు పూర్తిగా ఔపోసన పట్టేసినట్లున్నారు."

"అలా అనికాదు ఇంతవరకు నా ఊహల్లోనూ ఆలోచనల్లోనూ తీవ్రవాదులు ఇలా ఉంటారు. ఇటువంటి పనులు చేస్తుంటారు అనే భావన ఉండేది. అయితే ప్రత్యక్షంగా వారితో కలిసి ఉండటం వల్ల అన్ని విషయాలు స్పష్టంగా తెలిసాయి.

"తీవ్రవాదులు మంచివారేనా?"

"మంచివారా చెడ్డవారా అంటే నేను ఏమీ చెప్పలేను. కానీ వారు నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన వారని చెప్పగలను."

ఆ తర్వాత గీత, శ్రీనివాస్‌లు ఎమ్మెల్యే బాలన్నను అనేక ప్రశ్నలు వేసారు. తీవ్రవాదుల వైఖరిపట్ల అభిప్రాయాలను సేకరించారు.

"కిడ్నాప్ చేసి అడవుల్లోకి తీసుకుని వెళ్ళిన తర్వాత మిమ్మల్ని ఎక్కడ ఉంచారు? ఎలా చూసుకున్నారు?"

"నన్ను అడవుల్లోకి తీసుకుని వెళ్ళినప్పటి నుంచీ వారు నాతో ఎంతో మర్యాదగా ప్రవర్తించారు. నన్ను సొంత మనిషిగానే చూసుకున్నారు. ఇంటిలో కుటుంబ సభ్యుడు చాలాకాలం దూరప్రాంతంలో ఉండి ఇంటికి వస్తే ఎట్లా చూసుకుంటారో అంతటి ఆదరణ నాపట్ల చూపించారు. స్వంత మనిషిలాంటి ఆప్యాయత కనబరిచారు. వారు తిన్నదే నాకు పెట్టారు. కొండల్లో లోయల్లో చాలాదూరం వారితోపాటు నన్ను కూడా నడిపించారు. చెట్లకింద బండ రాళ్ళపైనా వాళ్ళతో గడిపాను."

"తమ దళనాయకుడు శ్రీకాంత్ విడుదల అవుతాడన్న నమ్మకం వారిలో ఉండేదా?"

"వాళ్ళ దళపతి శ్రీకాంత్ పైన వారందరికీ అపారమైన నమ్మకం విశ్వాసం ఉన్నాయి. నన్ను వారి వద్దకు తీసుకుని వచ్చినప్పటినుంచి తమ నాయకుడు మళ్ళీ తమ మధ్యకు ఎప్పుడు వస్తాడా అని రోజులు లెక్కబెట్టేవారు. ప్రతిరోజూ పేపరు సమాచారాన్ని తెలుసుకునేవారు. రేడియోను వినేవారు. ప్రభుత్వం ఎట్లా స్పందిస్తుందోనని ఎదురుచూసేవారు" బాలన్న వివరంగా చెప్పాడు.

"ఒకవేళ ప్రభుత్వం శ్రీకాంత్‌ను విడుదల చేయకపోతే మీ పరిస్థితి ఎలా ఉండేది?"

"ఖచ్చితంగా చనిపోయేవాడిని. వారు రోజూ నాతో అనేవారు. మీమీద మాకు ఎటువంటి కోపం, ద్వేష లేదు. మా కోరిక తీరడానికి ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొంటామని ప్రాణం తీయడానికైనా సిద్ధమని చెప్పేవారు"

"తీవ్రవాదులు చేసిన పని తప్పని మీకు ఎప్పుడైనా అనిపించిందా? శ్రీకాంత్‌ను జైలు నుంచి విడుదల చేయడం ప్రభుత్వం అసమర్థత అనుకుంటున్నారా?"

బాలన్న ఆ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేదు.

తర్వాత "ఎవరు ఏమి అనుకున్నా తీవ్రవాదులు తాము చేసిన పని తమకు మంచిగానే అనుకుంటున్నారు. నన్ను విడుదల చేయించడానికి ప్రభుత్వం చేసింది కూడా సమంజసమే అనుకోవాలి. ఏ పని చేసినా అన్ని వర్గాలకు సంతృప్తి కలగదు కదా? ఎవరో ఒకరు విమర్శిస్తూనే ఉంటారు."

"శ్రీకాంత్ విడుదల కావడం తీవ్రవాదుల్లో నైతిక స్థయిర్యం పెరుగుతుందంటారా?"

"పెరుగుతుందని చెప్పలేం. కానీ తమ మాట చెల్లుబాటు కావడానికి ఎటువంటి ఆయుధాన్ని ఉపయోగించాలో వారికి అర్థమైపోయింది. రానున్న కాలంలో పోలీసులు ప్రభుత్వం కిడ్నాప్ ల వంటి అనేక చర్యలను ఎదుర్కోవలసి ఉంటుంది."

"అంటే?"

"అదేనండీ పోలీసులు పట్టుకున్న శ్రీకాంత్‌ను విడిపించడానికి తీవ్రవాదులు కిడ్నాప్ చేసారు. భవిష్యత్తులో ఏ తీవ్రవాద నాయకుడు అరెస్టు అయినా అతడ్ని విడిపించడానికి మరికొంతమంది నాయకుల్ని కిడ్నాప్‌లు చేయవచ్చు."

"పోలీసులు ఎవర్నయినా అరెస్టు చేసినా ఇకపై అరెస్టు చేసినట్లు రికార్డులలో చూపించరేమో?"

ఎమ్మెల్యే బాలనన్ చిన్నగా నవ్వాడు. "పోలీసులు అరెస్టులు చేసినట్లు చూపించకపోతే ఎవరు మాత్రం ఏమి చేస్తారు?"

"మీకు తెలియనట్లు అడుగుతారేంటి? పోలీసులకు దొరికిన వారిని ఏం చేస్తారో ప్రతివారికి తెలుసు. తము ఎవరినైనా అరెస్టు చేసిన విషయం ఎవరికైనా తెలిసినప్పుడు మాత్రమే కోర్టులో ప్రవేశపెడతారన్న విమర్శ ఉంది."

"బాగా అనుభంతో చెబుతున్నట్లున్నారా?" గీత నవ్వింది.

"అనుభవం లేదు కానీ తీవ్రవాదుల చెరలో ఉన్నప్పుడు వారి మాటలు సంభాషణలు చాలా విన్నాను. అంతవరకూ పోలీసులపై నాకున్న అభిప్రాయాలు వేరు. అక్కడికి వెళ్ళిన తర్వాత కొన్ని మారాయి. వారు మాట్లాడుకుంటున్న మాటలు వింటుంటే నిజమే కదా అనిపిస్తుండేది."

"సుఖాంతమైన మీ కిడ్నాపు ఉదంతం మీకు అనేక అనుభవాలను మిగిల్చిందన్నమాట."

"ముమ్మాటికీ."

"ప్రజాప్రతినిధిగా ఎలా స్పందిస్తున్నారు?"

"ముందుగా నా నియోజక వర్గ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నేడు తీవ్రవాదుల దగ్గర నుంచి విడుదలై క్షేమంగా రావాలని కోరుకున్నవారికి ఎదురు చూసినవారికి ధన్యవాదాలు చెప్పాలి. వారు నాకోసం చాలా ఆందోళనలు చేసారు. ధర్నాలు చేసారు. నేను ఎటువంటి ఆపదా లేకుండా క్షేమంగా ఇంటికి తిరిగి రావడంతో వారు ఎంతో సంతోషపడుతున్నారు. ఇటువంటి అభిమానుల్ని సంపాదించుకున్నందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది" బాలన్న ఉద్వేగంతో చెప్పాడు.

ఎమ్మెల్యే బాలన్న ఆనందం చూసిన తర్వాత గీతకు, శ్రీనివాస్‌కు ఎంతో ముచ్చట అనిపించింది.

మరికొన్ని విషయాలు మాట్లాడిన తర్వాత "శ్రీకాంత్ పై మీ అభిప్రాయం చెప్పండి?" గీతామాధురి అడిగింది.

"శ్రీకాంత్‌ను నేను చూడలేదు. అతను ఎలా ఉంటాడో కూడా నాకు తెలీదు కానీ జరిగిన విషయాలలో ప్రత్యక్ష సాక్షిగా ఉండటం వల్ల అతని మీద నాకు ఎంతో అభిమానం పెరిగిపోయింది. నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేయడం ద్వార ప్రజాప్రతినిధిగా ప్రజల అభిమానాన్ని పొందగలిగాను. కానీ అడవుల్లో ఉన్న శ్రీకాంత్ మాత్రం ఎంతోమంది గిరిజనుల అభిమానాన్ని ప్రేమను పొందగలిగాడు. అతని సహచరులు కూడా అతనంటే ఎంతో ఇష్టాన్ని చూపించగలుగుతున్నారు. అందుకే అతనంటే నాకు అభిమానం ఏర్పడింది."

అన్ని విషయాలు రాసుకున్న తర్వాత గీత, శ్రీనివాస్‌లు లేచి నిల్చున్నారు. "ఎమ్మెల్యేగారూ చాలా థేంక్సండి. మా పేపరు విజయం మీద అభిమానంతో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మా ప్రశ్నలన్నింటికీ వివరంగా సమాధానాలు ఇచ్చారు. ఇవన్ని మీ అనుభవాలు. మీ అభిప్రాయాలుగా ప్రచురిస్తాం" అన్నారు.

గీత హాండ్ బాగ్‌లో నుంచి డిజిటల్ కెమెరాను తీసింది.

రకరకాల ఏంగిల్సులో ఎమ్మెల్యే బాలన్న ఫోటోలను తీసింది.

తర్వాత అతని వద్ద సెలవు తీసుకుని బైటికి వచ్చారు.

ఇటువంటి ఎక్సుక్లూజివ్ వార్తలు ఇతర పత్రికలకు అందకుండా సేకరించిన ప్రత్యేక కథనాలు తయారు చేసినప్పుడు విలేకర్లకు ఎంతో ఆనందంగా ఉంటుంది. అందుకే ఎంతో కష్టమైనా ఈ వృత్తిలో ఉన్నవారు కష్టంగా అనుకోకుండా ఇష్టంగా పనిచేస్తున్నారు. రోజూ చేసే పని ఒకేలాంటిది అయినప్పటికీ వారికి రొటీన్‌గా అనిపించదు.

ఇతర పత్రికలకు అందని ప్రత్యేక ఇంటర్వ్యూ విజయం కోసం లభించడం పట్ల ఇద్దరికి ఎంతో ఆనందం అనిపించింది.

బ్యూరో చీఫ్ శ్రీనివాస్. "ఈ ఇంటర్వ్యూను ప్రత్యేక తరహాలో ప్రెజెంటు చేస్తే బాగుంటుంది గీతగారూ న్యూస్ ఎడిటర్‌తో మాట్లాడాలి."

"ఓకే సార్. మీ ఇష్టం."

ఇద్దరి మనసుల్లోనూ ఆనందం పరవళ్ళు తొక్కుతోంది.

విజయం ఆఫీసు వైపు దారి తీసారు.

## 23

**మావోయిస్టు** నాయకుడు శ్రీకాంత్ విడుదల కావడంతో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఏర్పడింది ప్రభుత్వం తీసుకున్న చర్య పట్ల పలువురు హర్షాన్ని వ్యక్తం చేసారు కొద్దిమంది మాత్రం శాంతిభద్రతల పరిరక్షణ పట్ల ప్రభుత్వం విఫలం చెందిందని దుయ్యబట్టారు.

వివిధ వార్తా పత్రికలు ఈ ఉదంతంపై రకరకాల వార్తా కథనాలను ప్రచురించాయి. శ్రీకాంత్ అరెస్టు బాలన్న కిడ్నాప్ సంఘటనలపై కొన్ని పత్రికలు సంపాదకీయాలను రాసాయి.

అధికార పార్టీలో ఈ ఉదంతం సంచలనం కలిగించింది

ప్రజాభిమానం కలిగి నిజాయితీగా పనిచేస్తే శాసన సభ్యునిగా పేరున్న బాలన్న క్షేమంగా తిరిగి విడుదల కావడం ప్లస్ పాయింటుగా తయారైంది ఈ సంఘటన పట్ల మొదటి నుంచి ఎంతో ఉత్కంఠను ప్రదర్శించిన ప్రజలు ఊరట చెందారు.

అయితే..

ఈ మొత్తం వ్యవహారం పట్ల పోలీసు వర్గాలు మాత్రం తీవ్ర అసంతృప్తికి లోనయ్యాయి. ఎంతో కష్టపడి ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించి పట్టుకున్న తీవ్రవాద నాయకుడ్ని వదిలిపెట్టడం వారికి మింగుడు పడటంలేదు. చేజేతులా మంచి అవకాశాన్ని వదులుకున్నామని అసంతృప్తి చెందుతున్నారు.

"తీవ్రవాదం పెచ్చు పెరిగిపోవడానికి ప్రభుత్వం పోలీసుల వైఖరే కారణమని ఉపన్యాసాలు దంచే ప్రతిపక్ష నాయకులు మాత్రం ఏమీ గమనించడంలేదు. పోలీసులు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితుల్ని అర్థం చేసుకోరేం?" పోలీసుల్ని నిరంతరం వేధిస్తున్న ప్రశ్న.

అందరి పరిస్థితి తలో విధంగా ఉంటే ఎస్పీ శ్యామసుందర్ పరిస్థితి ఇంకో విధంగా ఉంది. జరిగిన పరిణామాలు సంఘటనలు అతనికి చాలా ఇబ్బందికరంగా మారాయి. తీవ్రవాద ఉద్యమంలో అతను నిర్వహించిన పాత్ర సామాన్యమైనదేమీ కాదు. తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన చరిత్ర అతనికి ఉంది. ఏ జిల్లాలో పని చేసినా మంచి పేరు సంపాదించుకున్నాడు. ఎంతోమంది కార్యకర్తలు తీవ్రవాదంలో ముఖ్యనాయకులుగా పనిచేసినవారు. అతని ఆధ్వర్యంలోనే ఎన్ కౌంటరు అయిపోయారు.

ఎంతో కష్టపడి పట్టుకున్న శ్రీకాంత్‌ను క్షేమంగా వదిలిపెట్టడం ఎస్పీ జీర్ణించుకోలేకపోతున్నాడు.

ఆ సమయంలోనే అతనికి డి.ఐ.జి.గా పదోన్నతి లభించింది. అతను కోరుకున్నది కూడా అదే.

వెంటనే విధుల్లోకి చేరిపోయాడు.

ఇంతవరకూ పోలీసు అధికారిగా తాను అనుభవించిన అధికారం ఒక ఎత్తయితే ఇప్పుడు నాలుగు జిల్లాల పోలీసు అధికారులపై పెత్తనం చెలాయించడం మరో ఎత్తు అయింది. ఎమ్మెల్యే బాలన్న విడుదల అయిన వెంటనే అతడ్ని కలుసుకుని పూర్తి వివరాలు ఒక అధికారిగా సేకరించాడు. తీవ్రవాద ఉద్యమం ఎంతలా వేళ్ళూనుకుని పోయిందో అతని ద్వారా తెలుసుకున్నాడు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న తీవ్రవాదుల కుట్రను అణచివేయవలసిన అవసరం ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వానికి సమాంతరంగా కార్యక్రమాలను నడుపుతున్న తీవ్రవాదులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉంది అందుకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుపుతున్న తీవ్రవాదాన్ని నిర్మూలించవలసిన అవసరం ఉందని ఇందుకోసం కార్యాచరణ పథకాన్ని తయారు చేయాలని నిశ్చయించుకున్నాడు.

డి.ఐ.జిగా బాధ్యతల్ని స్వీకరించిన తర్వాత తన పరిధిలో ఉన్న జిల్లాల్లో తీవ్రవాద ఉద్యమం పట్ల అధ్యయనం చేసాడు. ఆయా జిల్లాల్లో ఎస్పీలందరితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని వివరాలను సేకరించాడు. జిల్లాలో కార్యకలాపాలు నక్సలైట్ల కదలికలను తెలుసుకున్నాడు. జరిగిన ఎన్‌కౌంటర్ల గురించి తెలుసుకున్నాడు.

ఇప్పటివరకు జరిగిన పద్ధతిలో కాకుండా కొత్త రకంగా ఈ ఉద్యమాన్ని అణచివేయాలని ఎస్పీలకు ఆదేశాలను జారీ చేసాడు. ఇందుకోసం అవసరమైన కార్యక్రమాన్ని తయారు చేసాడు.

రాత్రి పదిగంటలు

ఫారెస్టు రేంజరు పడుకోవడానికి సిద్ధపడుతున్నాడు. అప్పటివరకూ తాగిన విస్కీ కడుపులో నాట్యం చేయడంవల్ల నరాల్లోంచి మత్తు మెత్తగా లోపలికి దిగుతుండటం వల్ల హాయిగా ఉంది.

ఆ సమయంలో పదేళ్ళ కుర్రవాడు తలుపు తట్టాడు. భార్య పుట్టింటికి వెళ్ళడం వల్ల వంటరిగా ఇంటిలో ఉంటున్నాడు.

తలుపు తీసిన తర్వాత కనిపించిన కుర్రాడిని చూసాడు. ఎవరు ఎందుకు వచ్చాడన్న విషయం అరనిమిషం వరకు అర్ధం కాలేదు.

అప్పారావు చేతిలో కవరును పెట్టి వెంటనే మాయమైపోయాడు. మద్యం మత్తులో ఉన్న అప్పారావుకు అంతా అయోమయంగా అనిపించింది. ఎవరొచ్చింది? ఏమిచ్చింది? అర్థం చేసుకోవడానికి చాలాసేపు పట్టింది.

కవరును చింపాడు. అందులో ఉత్తరం ఉంది. గబగబా చదివాడు. ''గిరిజనుల్ని మోసం చేస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్న నీ విషయం చాలాకాలంగా గమనిస్తున్నాం. సంపాదించిన డబ్బును ఏఏ బ్యాంకుల్లో దాచుకున్నావో బంగారంగా మార్చుకున్నావో మా వద్ద సమాచారం ఉంది. అందుకే నిన్ను రెండు లక్షల రూపాయల చిన్న మొత్తాన్ని అడుగుతున్నాం. అదీ మాకోసం కాదు. ఎంతోమంది పేద ప్రజలకోసం మేము చేపట్టిన ఉద్యమం కోసం. చెప్పిన విధంగా సకాలంలో నువ్వు అడిగిన సొమ్ము ఇవ్వకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. నీ చెయ్యి ఉండకపోవచ్చు. నీ కాళ్ళు మాయం కావచ్చు లేకపోతే నీ భార్య తన భర్తను కోల్పోయిన విధవరాలుగా మారవచ్చు. మేము ఏమి చేస్తామన్న విషయం ఎవరికీ తెలియదు. మేము అడిగిన సొమ్ము నీకు ఎక్కువకాదు. సిద్ధం చేసి ఉంచు. ఈ విషయం పోలీసులకు కానీ ఇతరులెవరికి కానీ తెలియడానికి వీలులేదు. మాకు ఏ మాత్రం అనుమానం వచ్చినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. రేపు రాత్రి పన్నెండు గంటలకు నీ ఇంటివద్దకు వస్తాం. డబ్బు సిద్దం చేసి ఉంచు. ఖబడ్దార్. ఇట్లు దండకారుణ్య తీవ్రవాదుల సంఘం'' అని ఉంది.

ఉత్తరం చదివి అప్పారావు బెంబేలెత్తిపోయాడు.

లంచాలను తీసుకుంటూ ఎంతో డబ్బును కూడబెట్టిన అతనికి తీవ్రవాదులంటే ఎంతో భయం. గతంలో వారు చేసిన హత్యలు గుర్తుకు వచ్చి భయంతో వణికిపోయాడు. తాగిన విస్కీ మత్తు దిగిపోయింది. మనసు మొద్దు బారిపోయింది. తక్షణ కర్తవ్యంగా ఏం చేయాలో అర్థంకాలేదు. డబ్బులు ఇవ్వాలంటే మనసు గిజగిజలాడిపోయింది.

ఫారెస్టు కాంట్రాక్టర్ల నుంచి, కలప తరలింపుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ చాలా డబ్బు మిగుల్చుకున్నాడు. దానిని తీవ్రవాదులకు ఇవ్వడం కష్టం అనిపిస్తోంది. వారు అడిగింది తన దృష్టిలో పెద్ద మొత్తంకూడా కాదు. రెండు రోజులనుంచీ బాంకు సెలవు కారణంగా వచ్చిన సొమ్మును బాంకులో జమ చేయడం కుదరలేదు కట్టలు కట్టిన సొమ్ము బీరువాలో భద్రంగా ఉంది.

డబ్బులు ఇవ్వాలా వద్దా అనే విషయంలో చాలాసేపు తటాపటాయించాడు. మనసు పరిపరి విధాలుగా ఆలోచించింది. ఆ మర్నాడు ఈ ప్రపంచంలో ప్రాణం కన్నా ఏదీ ఎక్కువ కాదన్న నిర్ణయానికి వచ్చేసాడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పినా పెద్దగా ప్రయోజనం ఉండదని అనుకున్నాడు. గదిలోపలికి వెళ్ళి బీరువా తీసి నోట్ల కట్టలను పేపర్‌లో చుట్టాడు. రాత్రి పన్నెండు గంటలు ఎప్పుడు అవుతుందా అని ఎదురు చూసాడు. తలుపు చప్పుడు కాగానే వెంటనే తీసాడు.

ఎదురుగా ఇద్దరు యువకులు భయం భయంగా నిల్చున్నారు.

''మీరేనా ఉత్తరం పంపారు?'' ఫారెస్టు అధికారి అప్పారావు అడిగాడు. అతని మాటల్లో భయం స్పష్టంగా కనిపించింది.

''అవును. డబ్బు సిద్దమేనా?''

సిద్దంగా ఉంచుకున్న కట్ట కట్టిన నోట్ల కట్టను వారిద్దరికీ అందించాడు.

తర్వాత "మరేం పర్వాలేదు కదా?" అన్నాడు నెమ్మదిగా.

"ఈ విషయం ఎవరికి చెప్పినా పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. ఉత్తరంలో రాసిన హెచ్చరికల్ని నిజం చేస్తాం" డబ్బులు తీసుకుని చీకట్లో కలిసిపోయారు. వారు వెళ్ళిపోయిన చాలాసేపటివరకు అప్పారావు పూర్తిగా తేరుకోలేకపోయాడు. జరిగినదంతా కలలా అనిపించింది. వారు అడిగిన మేరకు డబ్బులు ఇవ్వడం ఎంతో సంతృప్తి అనిపించింది. ఆ రోజు రాత్రి హాయిగా నిద్రపోయాడు.

**25**

కుమారస్వామి, కృష్ణప్రసాద్ గిరిజన యువకులు.

వారిద్దరిలో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచన పెరిగి పోవడంతో వారు రకరకాల మార్గాలను అన్వేషించారు కష్టపడకుండా ఆదాయాన్ని సంపాదించాలన్న సులభమైన విధానాల కోసం ఎదురు చూసారు. అవినీతి అధికారులకు ధనవంతుల్లోనూ తీవ్రవాదుల పట్ల అన్న భయాన్ని అవకాశంగా తీసుకోవాలని అనుకున్నారు. అందుకే తీవ్రవాదుల ముసుగులో డబ్బులు సంపాదించాలనే ఆలోచన పెరిగిపోవడంతో వారు రకరకాల మార్గాలను అన్వేషించారు కష్టపడకుండా ఆదాయాన్ని సంపాదించాలన్న సులభమైన విధానాల కోసం ఎదురు చూసారు. అవినీతి అధికారులకు ధనవంతుల్లోనూ తీవ్రవాదుల ముసుగులో డబ్బులు సంపాదించాలని పూనుకున్నారు. నకిలీ నక్సలైట్లు అవతారం ఎత్తారు.

గిరిజన ప్రాంతాల్లో నిరక్షరాస్యులు అమాయకులు ఎక్కువమంది ఉంటారు. ఏజెన్సీలో అధికారిపై పర్యవేక్షణ కూడా తక్కువగా ఉంటుంది. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు విడుదల అవుతుంటాయి. అందుకు తగిన విధంగానే అవకతవకలు కూడా జరుగుతుంటాయి. చాలా ప్రాంతాలలో నిర్మాణ పనులు జరగకుండానే బిల్లులు మంజూరు చేస్తుంటారు అన్ని శాఖల్లోనూ అవినీతి పెచ్చు పెరిగిపోయి ఉంటుంది. కుమారస్వామి కృష్ణప్రసాద్‌లు ఇది అవకాశంగా తీసుకున్నారు.

అవినీతి పరులపైనా ప్రభుత్వ నిధులను కైంకర్యం చేస్తున్న వారిపైనా దృష్టిని కేంద్రీకరించారు. వారిని బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టారు.

ముందుగా గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న ఇంజనీర్లను ఏజన్సీలో హాస్టల్ వార్డెన్లపైనా దృష్టిని కేంద్రీకరించి వసూళ్ళను ప్రారంభించారు.

ఎవరి వద్ద నుంచి డబ్బులు వసూలు చేయాలని అనుకుంటారో ఆ వ్యక్తులను ముందుగా పరిశీలన చేస్తారు. వారు అన్యాయంగా ఎంత సంపాదించారో వివరాలను సేకరిస్తారు. వారి బలహీనతలను తెలుసుకుని వారిమీద వల విసురుతారు. తాము డబ్బుల కోసం వస్తున్నామని సమాచారాన్ని ముందుగా పంపించి వారిని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. వారు అన్నీ సిద్ధం చేసిన తర్వాత కలుసుకుని వారి నుంచి డబ్బులు తీసుకుంటారు.

తాము టార్గెట్‌గా పెట్టుకుని డబ్బులు వసూలు చేసిన వారెవరి నుంచి ఇంతవరకు ఎటువంటి ప్రతిఘటన ఎదురు కాలేదు. దీంతో వారిలో ధైర్యం బాగా పెరిగిపోయింది. అవినీతి పరులు లంచగొండి అధికారులు నక్సలైట్లకు భయపడతారన్న సూత్రం కుమారస్వామి, కృష్ణప్రసాద్‌లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఫారెస్టు అధికారి అప్పారావు నుంచి రెండు లక్షల రూపాయలు సమానంగా పంచుకున్నారు.

**26**

శ్రీకాంత్ అడవుల్లోకి వెళ్ళి తన వాళ్ళను కలుసుకున్న తర్వాత సంతృప్తిగా గాలి పీల్చుకున్నాడు. ఎక్కడో విదేశాలలో చాలా కాలం ఉండి తిరిగి స్వదేశానికి వచ్చే సమయంలో చేరుకున్న సమయంలో లభించే ఆనందం అతనికి కలిగింది.

మనసు నిండా సంతృప్తి నిండిపోయింది.

మొదటిసారి జైలుకు వెళ్ళి జైలు జీవితాన్ని అనుభవించడంతో ఎంతో అనుభవాన్ని ప్రత్యక్ష్యంగా పొందాడు. అంతవరకు అడవుల్లో ప్రయాణాలు అన్యాయాలపై పోరాటాలతో జీవితం గడిచిపోయింది. ఒక్కసారి పోలీసులు అరెస్టు చేయడంతో రకరకాల అనుభూతులను పొందే అవకాశం ఏర్పడింది. పోలీసులకు చిక్కిన సమయంలో అదోలాంటి భయం కూడా శ్రీకాంత్‌లో ఆవరించింది.

జైలులో ఉన్న సమయంలో తనని అక్కడినుంచి విడిపించడానికి సహచరులు చేసిన ప్రయత్నాలు అన్నీ తెలుస్తూనే ఉన్నాయి. తనని విముక్తి చేయడానికి ఎమ్మెల్యే బాలన్నను కిడ్నాప్ చేసి ఎంత రిస్కుకు పాల్పడ్డాడో ఆలోచిస్తుంటే ఎంతో ఆశ్చర్యం అనిపించింది. తనమీద ఎంతో ప్రేమను చూపించిన తన వాళ్ళ మీద ఎంతో గౌరవం పెరిగిపోయింది. అటువంటి వ్యక్తులకు నాయకత్వం వహించడం నిజంగా త న అదృష్టం అనుకున్నాడు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులపైనా ప్రేమ పుట్టుకుని వచ్చింది.

ఉప్పర  గూడెం నుంచి అడవిలో ప్రవేశించిన శ్రీకాంత్ అక్కడి నుంచి కొంత దూరం ప్రయాణించిన తర్వాత ఒక సహచరుడు అతని వద్దకు వచ్చి కలిసాడు తర్వాత. అతను అడవుల్లో అన్నల వద్దకు తీసుకుని వెళ్ళాడు.

శ్రీకాంత్ వెళ్ళేసరికి అందరూ లోపల ఎదురు చూస్తున్నారు.

అందరిలోనూ ఆనందం తన్మయం విజయం సాధించామన్న గర్వం వారి కళ్ళల్లో శ్రీకాంత్‌కు కనిపించాయి.

అందర్నీ పేరు పేరునా పలకరించాడు.

తర్వాత ముఖ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని వివరించాడు. జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నాడు. ఎమ్మెల్యే బాలన్నను కిడ్నాప్ చేసిన సంగతులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి చెందాడు.

అడవిలో పరిస్థితులు చక్కబడటంలేదన్న విషయం వారి మాటలను బట్టి శ్రీకాంత్‌కు అర్థమైంది. తాము చేస్తున్న కృషికి తగిన ఫలితాలు రావడం లేదేమోనన్న అనుమానం కలిగింది.

ఇందుకోసం తమ వ్యూహాలలో మార్పులు చేయాలా?

అన్యాయాలను ఎదిరించడానికి నిరంతరం పోరాటాలు చేయాలని నిశ్చయించుకున్నాడు. కింది స్థాయిలో క్రమ పద్దతిలో పనిచేస్తున్న కేడర్‌ను ఉపయోగించుకుని పథకాలను వ్యూహాలను రూపొందించాలని ఆలోచన చేశాడు.

పోలీసులకు పట్టుబడటం మళ్ళీ బలవంతంగా విడుదల కావడంతో నిఘా కూడా ఎక్కువైంది. ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అనుకున్నాడు శ్రీకాంత్. తీవ్రవాద ఉద్యమం పట్ల చిత్తశుద్ధి ధృఢ దీక్ష కలిగిన ఎంతోమంది సైన్యం వంటి కార్యకర్తలు తన వద్ద ఉంటున్నప్పుడు వారిని ఉపయోగించుకోవలసిన అవసరం నాయకునిగా తనమీద ఉందని అనుకున్నాడు.

తీవ్రవాద ఉద్యమంలోకి మళ్ళీ ప్రవేశించిన తర్వాత ఉన్న కేడర్‌ను సమాయత్తం చేసి పూర్వపు పరిస్థితిని తీసుకుని రావడానికి కొంత సమయం పట్టింది. రకరకాల వ్యక్తులను అందర్నీ ఒకే తాటిపైకి తీసుకుని రావడానికి కొద్దిగా సమయం పట్టింది.

శ్రీకాంత్ చాలా శ్రమ పడవలసి వచ్చింది.

జీవన్ చెప్పిన విషయం శ్రీకాంత్‌లో ఆలోచనలు రేపింది.

తను వంటరిగా ఉన్న సమయంలో జీవన్ వచ్చి వివిధ పేపర్ కటింగులను చూపించి జరిగిన విషయాన్ని వివరించాడు.

"నక్సలైట్ల పేరుతో ఇద్దరు వ్యక్తులు ఫారెస్టు అధికారిని కొంతమంది వ్యాపారస్తులను బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసుకున్నారు. వారు నక్సలైట్ల ముసుగు వేసుకున్న దోపిడీ దొంగలు" జీవన్ అన్నాడు.

ఇటువంటి మోసాలను వారిద్దరూ చాటుమాటుగా చేసేవారు. కాని ఇప్పుడు బహిరంగంగా ధైర్యంగా చేస్తున్నారు. నక్సలైట్ల కారణంగా ఇటువంటి దోపిడీ కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని పత్రికా వార్తలలో ఉంది ఇదే విషయాన్ని జీవన్ వాటిని చూపించి శ్రీకాంత్‌తో చెప్పాడు.

ఇవన్నీ చూసిన తర్వాత శ్రీకాంత్ కోపం నసాళాన్ని అంటింది.

ఎంతోమంది కమిట్ మెంటు కలిగిన కార్యకర్తలు కలిగిన ఈ సంస్థ ఇటువంటి చెడ్డపేరును మూటగట్టుకోవడం శ్రీకాంత్ మనసును కలిచివేసింది.

ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి శ్రీకాంత్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసాడు.

చాలామంది హాజరయ్యారు. సాధారణంగా అడవిలో దళాలుగా ఉన్న నక్సలైట్లు అందరూ ఒకేసారి సమావేశం కావడం అరుదుగా జరుగుతుంటుంది. పెద్ద కార్యక్రమాలు జరిగే ముందు ముఖ్యమైన విషయాలను చెప్పే సమయంలోనూ ఇటువంటి సమావేశాలను ఏర్పాటు చేస్తుంటారు అందువల్ల చాలామంది హాజరయ్యారు.

శ్రీకాంత్ గొంతు సవరించుకుని చెప్పాడు "పోలీసుల చేతికి చిక్కి జైలు పాలైనప్పుడు నన్ను విడిపించడానికి మీరు చేసిన ప్రయత్నాలను నేను మరిచిపోలేను. మీ అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఎక్కడ అన్యాయం జరిగిందని తెలిసినా అక్కడికి వెళ్ళి దానిని ఎదుర్కొంటున్నాం. ఎవరు న్యాయం కావాలని కోరి మన దగ్గరికి వచ్చినా వారికి అండగా నిలబడుతున్నాం ఇటువంటి పరిస్థితుల్లో మనని మనం ప్రశ్నించుకోవడం మన వ్యవస్థను ప్రక్షాళన చేసుకోవడానికి సిద్ధపడటం నాకు ఎంతో విచారంగా ఉంది. అందుకే ఈ సమావేశం" అన్నాడు.

శ్రీకాంత్ మాటలు ఎవరికీ అర్థంకాలేదు. ఏదో జరిగిందని చాలామంది ఏమి జరిగిందంటే ఏమి జరిగిందని మరి కొంతమంది ప్రశ్నల వర్షం కురిపించారు. జీవన్ ముందుకు వచ్చి "నేను చెబుతాను వినండి. మనలో కొంతమంది నాయకత్వానికి తెలియకుండా అధికారుల నుంచి కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయాలను పోలీసు అధికారులు విలేకర్ల సమావేశాల్లో తరచూ చెబుతూ మన మీద విమర్శలు గుప్పిస్తున్నారు. మనమంతా దోపిడీ దొంగలమని బ్లాక్ మెయిలర్లమని చిత్రీకరిస్తున్నారు. అది వారి తప్పుకాదు వారి విధానమే అంత. అయితే మనలో అటువంటి పనులు చేస్తున్నవారు ఉన్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. అటువంటి వారు ఎవరన్న విషయం తెలియవలసి ఉంది"

జీవన్ మాటలు పూర్తికాగానే "మీరు ఈ విషయం చెప్పకపోయినా తెలుసుకునే సమర్థత నాకుంది. నా మట్టుకు నేను తెలుసుకున్నట్లయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" శ్రీకాంత్ హెచ్చరించాడు.

వచ్చిన వారు ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

చాలాసేపు మౌనం రాజ్యం చేసింది. చివరకు అందరూ ముక్తకంఠంతో ఈ విషయాన్ని ఖండించారు. ఎవరికీ అక్రమ వసూళ్ళతో సంబంధం లేదని నిర్ధారణకు వచ్చారు. తీవ్రవాదులకు చెడ్డపేరు తీసుకుని వచ్చే ఈ పనిని ఎవరు చేసినప్పటికి వారిపై చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది.

శ్రీకాంత్ సందిగ్ధంలో పడిపోయాడు.

ఎవరైనా కుహనా తీవ్రవాదులు లేదా నకిలీ నక్సలైట్లు కావాలని ఈ పని చేసారా? తీవ్రవాదుల పట్ల ఏజన్సీలో చాలామందికి ఉన్న భయాన్ని ఆసరా చేసుకుని నకిలీ నక్సలైట్లు ఈ పని చేసారా అని శ్రీకాంత్‌లో అనుమానం వచ్చింది. సమావేశంలో చాలామంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వారి మాటల్లో నిజాయితీ శ్రీకాంత్‌కు తెలియంది కాదు.

అన్ని చర్చలు వాద ప్రతివాదాలు జరిగిన తర్వాత అందరూ ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ డబ్బులు విషయంలో రకరకాల అనుమానాలు వచ్చాయి. ఈ వసూళ్ళ వెనుక నకిలీల హస్తం ఉందని నిర్ధారణ అయిపోయింది. ఈ విషయంలో అందరూ ఒక నిర్ణయం తీసుకోకపోతే రానున్న కాలంలో అనేక సంఘటనలు పునరావతం అవుతుంటాయి అందువల్ల ప్రారంభంలోనే ఇటువంటి చర్యలకు పుల్‌స్టాప్ పెట్టాలని శ్రీకాంత్ తన అభిప్రాయాలను సహచరులకు వివరించి చెప్పాడు.

శ్రీకాంత్ చెప్పిన విషయాన్ని అందరూ ఆమోదించారు. కార్యక్రమాన్ని రూపొందించాలని నిర్ణయం జరిగిపోయింది.

అన్ని పత్రికా కార్యాలయాలకు ఒక ప్రెస్ నోట్ తయారైంది.

నక్సలైట్లు తమ భావాలను లేదా తాము అనుకుంటున్న విషయాలను ప్రజలకు తెలియజేయాలంటే పత్రికా ప్రకటనలను విడుదల చేస్తుంటారు. వాటిని అన్ని పత్రికా కార్యాలయాలకు లేదా విలేకర్లకు వ్యక్తిగతంగా పంపిస్తుంటారు.

అటువంటిదే శ్రీకాంత్ తయారు చేసాడు.

అందులో "ఇటీవల కాలంలో కొంతమంది నక్సలైట్ల పేరుతో చాలామంది వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వాటితో మాకు ఎటువంటి సంబంధం లేదు. కొంతమంది నకిలీలు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారు. వారిని పట్టుకోలేని అసమర్ధతతో పోలీసులు ఈ మోసాలను మేము చేసినట్లుగా ప్రచారాలు చేస్తున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. పోలీసులకు సమర్ధత, చిత్తశుద్ధి దీక్ష ఉన్నట్లయితే ఇటువంటి మోసాలకు పాల్పడుతున్న నకిలీలను పట్టుకోవాలని కోరుతున్నాం" అంటూ వివరంగా రాసి కింద శ్రీకాంత్ పేరుతో సంతకం చేశాడు.

కొరియర్ ద్వారా అన్ని పత్రికా కార్యాలయాలకు అందే ఏర్పాటు చేసాడు. శ్రీకాంత్ చేసిన ఈ పని వల్ల అక్కడున్న చాలామంది హర్షం వ్యక్తం చేసారు. తమకు చెడ్డపేరు తీసుకుని వస్తున్నవారిని పట్టుకుని నిజాయితీని నిరూపించుకోవాలని అనుకున్నారు. వారిని పట్టుకోవడానికి పోలీసులు ఏ మాత్రం కృషి చేస్తారో తెలియదు.

పోలీసులు పట్టుకున్నా పట్టుకోకపోయినా తమకు చెడ్డపేరు తీసుకుని వస్తున్న నకిలీ నక్సలైట్లను తాము పట్టుకుని గుణపాఠం చెప్పినట్లయితే అందరికీ అర్ధమవుతుందని ఇందుకోసం ప్రయత్నాలు చేయాలని నిర్ణయించారు.

ఏజన్సీలో చాలా ప్రాంతాలలో తమకు ఎంతో మంచి పేరు ఉంది. మంచి పనులు చేయడం తప్ప వ్యాపారస్తులను బెదిరించి డబ్బులు వసూలు చేయడం చేయమని గిరిజనులు నమ్ముతున్నారు. జరుగుతున్న పరిణామాల వల్ల వారిలో కూడా కొంతమంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అటువంటి వారికి కనువిప్పు కలగడంతో పాటు ఇటువంటి పనులను మరెవరూ చేయకుండా ఉండాలన్నా ఏదో నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. అందుకు తగిన ప్రయత్నాలను ముమ్మరం చేసారు.

## 27

**విజయం పత్రికా కార్యాలయం**

సెలవులు అయిపోవడంతో గీత ఆఫీసు పనికి రెగ్యులరుగా వస్తోంది.

సాధారణ వార్తలు రాసే విధి నిర్వహణలో నిమగ్నమైంది.

తీవ్రవాదులుగా మారిన ముగ్గురు యువకులను కలుసుకున్న అనుభవాలు, ఎమ్మెల్యే బాలన్న చెప్పిన అంశాలలో నచ్చిన విషయాలను కలిపి తాను సేకరించిన సమాచారంతో విపులమైన వార్తా కథనాలు రాయాలని ప్లాన్ చేసింది తను ఏమి చేసినా ఖచ్చితమైన ప్రణాళికతో సిన్సియర్‌గా చేస్తానన్న నమ్మకం ఉండటం వల్ల ఏమిచేసినా అది విజయవంతం అవుతుందని భావిస్తుంది.

మహిళలు ఉద్యోగాలు చేయడం, అదీ పత్రికా కార్యాలయాలలో చేయడం చాలా తక్కువగా ఉంటుంది. ఎవరైనా చేసినా ఆఫీసులో గుమస్తా ఉద్యోగాల మాదిరిగా ఉండే సబ్ ఎడిటర్ ఉద్యోగాలు చేయడానికి మొగ్గు చూపిస్తుంటారు. నిరంతరం బైట తిరుగుతూ న్యూస్ రిపోర్టింగు చేయడం ఆడవాళ్ళలో చాలాతక్కువమంది ఉంటారు. ఆంగ్ల దినపత్రికలలో కొంతమంది కనిపిస్తున్నా తెలుగులో అరుదుగా ఉంటారు.

గీత ఈ రంగంలోకి ప్రవేశించినప్పుడే ఈ విషయాలన్నీ గ్రహించింది. చిన్నతనం నుంచి సాహసాలు చేయడం పేద ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలలో పాల్గొనడంవంటి పనులు చేయడం చాలా ఇష్టంగా చేసేది. ఏదైనా ఛాలెంజ్‌గా చేయాలని అనుకుంటుంది.

అందుకే ఏరికోరి రిపోర్టింగు ఉద్యోగాన్ని ఎన్నుకుంది.

ఆఫీసులో తనతోపాటు రిపోర్టరుగా పనిచేస్తున్న మార్గరెట్ చనిపోవడంతో గీతలో ఒకలాంటి నిర్లిప్తత ఏర్పడింది.

ఆమె అనుకోని పరిస్థితుల్లో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్సు సొమ్ము కొంత వచ్చింది. పత్రికా విలేకర్ల సంఘానికి చెందిన వారు కొంత మొత్తాన్ని వసూలు చేసి అందించారు.

అందుకు అన్ని రకాలుగా సహాయ కార్యక్రమాలను అందించినప్పటికీ విజయం పత్రిక నుంచి ఎటువంటి సహకారాన్ని కూడా అందించలేదు. ఆ పత్రిక న్యూస్ ఏజన్సీ నుంచి వార్తలను రప్పించుకుని పబ్లిష్ చేస్తున్నట్లు రికార్డులలో ఉండటం వల్ల చనిపోయిన మార్గరెట్ ఆ న్యూస్ ఏజన్సీకి చెందిన వ్యక్తి అని మా పత్రికకు సంబంధం లేదని చెప్పడం వల్ల రావలసిన సహాయం పూర్తిగా అందలేదు.

విజయం ఫైనాన్సు డిపార్టుమెంటును అడిగితే విషయం తెలుస్తుందని అనుకుంది. కంపోజ్ చేస్తున్న వార్తను సేవ్ చేసి ఫైనాన్సు సెక్షనుకు వెళ్ళింది.

అందులో ప్రభాకరమూర్తి ఇన్‌చార్జ్. విజయం పత్రికలో పనిచేసే సిబ్బందికి జీతాలు బోనస్‌లు ఇంక్రిమెంట్లు మొదలైనవన్నీ ప్రభాకరమూర్తి చేతులమీదే జరుగుతుంటాయి. సెలవులకు సంబంధించి రికార్డులు పెండింగులో ఉన్న సెలవుల వివరాలు కూడా అతని వద్దే ఉంటాయి. ఆఫీసుకు అవసరమయ్యే పెన్నులు కాగితాలు ఫైళ్ళు, ఇతర రకరకాల కొనుగోళ్ళు వంటివి అతనిద్వారానే జరుగుతుంటాయి.

గీత విష్ చేసి అతని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"ఏమిటి గీతా మాధురిగారూ ఇలా వచ్చారు? మీ సెలవు బిల్లులు అన్నీ క్లియర్ చేసేసాను ఏమీ పెండింగులో లేవు" "నేను నా గురించి రాలేదు."

"అవునులెండి. రిపోర్టరు కాబట్టి అందరి సమస్యలను మీ నెత్తిన వేసుకుని పనిచేస్తారు" జోకు వేసానని ప్రభాకరమూర్తి నవ్వాడు.

గీత నవ్వలేదు.

"నా ఫ్రెండు మార్గరెట్ మన పేపర్‌లోనే రిపోర్టరుగా పనిచేసేది. తనకు రావల్సిన పరిహారాల గురించి" అంది.

"మార్గరెట్ చనిపోయిన తర్వాత ఆమెకు సంబంధించిన అన్ని పనులూ పూర్తి అయ్యాయి. కొన్ని ఫైనాన్షియల్ సెటిల్‌మెంట్లు జరగవలసి ఉంది. అయితే ఆమెకింకా ప్రొబెషను పూర్తికాలేదు" అన్నాడు.

"అంటే?"

"మీరు సీనియర్ రిపోర్టరు. మీకు తెలియంది ఏముంది? ఉద్యోగంలో చేరిన తర్వాత కొంత కాలం ట్రయల్ రిపోర్టరుగా చెయ్యాలి. పనితీరు సంతృప్తికరంగా ఉంటే రెగ్యులరు స్టాఫ్ రిపోర్టరు అవుతారు మార్గరెట్ మాత్రం దురదృష్టవశాత్తు ఆమె ప్రొబెషను పిరియడ్ పూర్తికాకముందే చనిపోయింది."

"ఆమె కుటుంబానికి మన విజయం పత్రిక యాజమాన్యం తరపున ఎటువంటి సాయం కూడా అందించలేమా?" అడిగింది గీత.

"ప్రభుత్వం ఆర్థికసాయాన్ని అందించింది. కంపెనీ నిబంధనలు కొన్ని అడ్డంకిగా ఉన్నాయి. అయినప్పటికీ మన విజయం పత్రిక వాటిని అధిగమించి సాయం చేయడానికి ముందుకు వచ్చింది ప్రయత్నాలు జరుగుతున్నాయి."

ప్రభాకరమూర్తి చెబుతున్న విషయాలు గీతకు కోపాన్ని తెప్పించాయి.

పత్రిక యాజమాన్యం వైఖరి పట్ల అసహ్యం వేసింది.

తర్వాత నెమ్మదిగా "మార్గరెట్ మన విజయం పత్రికలో పనిచేసింది. విధి నిర్వహణలో చనిపోయింది. ఆమె మీద ఆధారపడిన కుటుంబాన్ని పట్టించుకోకపోతే ఎలా? మన పత్రికలో ఉద్యోగ భద్రత లేదని అనిపిస్తోంది" అంది.

గీత మాటలకు మూర్తి ఆశ్చర్యపోయాడు.

"మీరు ఆవేశపడటంలో అర్థంలేదు"

"అర్థంలేదని మీరంటే సరిపోదు. అర్థం చేసుకునే సమర్థత మీకు లేకుండా పోయింది. ఎన్నో ఆశలతో ఈ ఉద్యోగంలో చేరిన మార్గరెట్ కుటుంబం ఏమైపోతుంది" గీత మాటల్లో ఆవేశం తొంగి చూసింది.

"మన పేపరు కారణంగా ఆమె కుటుంబానికి ఎటువంటి అన్యాయం జరగలేదు మీరీ విషయంలో రెచ్చిపోవడం సరికాదు"

రెచ్చిపోవడం అనే మాటను ప్రభాకరమూర్తి వత్తి పలకడంతో గీతకు చిర్రుమంది. "మీరు విజయం పత్రికలో ఒక ఉద్యోగిగా మాట్లాడండి. అంతేకానీ మేనేజ్‌మెంటు తొత్తుగా మాట్లాడొద్దు"

ఆ మాట ఎక్కడ తగలాలో అక్కడ తగిలింది.

"గీతగారూ మీరు మాట్లాడుతున్న మాటలు హద్దులు మీరుతున్నాయి. మీ విషయాన్ని మేనేజిమెంటుకు ఫిర్యాదు చేయవలసి ఉంటుంది."

"చెయ్యండి నాకేం భయమా? ఉన్నమాట అంటే ఎవరైనా ఉలికి పడతారట. నేనేం లేని విషయం. కొత్త విషయం చెప్పలేదు. మనం పని చేస్తున్న పత్రికలో జరిగిన అన్యాయం గురించి చెప్పాను అంతే" అంది.

ఈ మాటలతో ప్రభాకరమూర్తి విసురుగా లేచాడు.

"అన్యాయం అని అనకండి. ఈ సంఘటనలో అన్యాయం ప్రసక్తి ఏముంది? నిబంధనల ప్రకారం చేయవలసినదంతా యాజమాన్యం చేసింది. అంతకంటే ఎవరు ఏమీ చేయలేరు."

"నిబంధనల ప్రకారం చేయాలంటే కొన్ని చేయలేం. మానవతా దృక్పదంతో కొన్ని నిబంధనలను మార్పు చేయాలి. అంతేకానీ నిబంధనలను సాకుగా చూపించి ఎంతో కష్టపడి పనిచేసిన సిబ్బందికి అన్యాయం చేయకూడదు."

"మీరు విజయం పత్రికలో పనిచేస్తూ కూడా మేనేజ్‌మెంటు విషయంలో ఇటువంటి అభిప్రాయంతో ఉండటం విడ్డూరంగా ఉంది మనం మార్గరెట్ విషయంలో తీసుకున్న చర్యలను సమర్థిస్తూ ఇతర పేపర్ల కన్నా బాగా చేసామని ప్రచారం చేయవలసిందిపోయి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు"

గీత నిట్టూర్చింది.

"నిజమే సార్. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వార్తలుగా రాసి ప్రజలకు అందించే విలేకరి ఉద్యోగంలో ఉన్నాను అటువంటిది నేను పనిచేస్తున్న పేపర్‌లోనూ నా చుట్టుపక్కల అన్యాయాలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోలేను. కనీసం నా స్థాయిలో అయినా ఎదిరించాలి."

"గీతామాధురిగారూ మీరు విజయం యాజమాన్యంలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ యాజమాన్యం మీద వ్యతిరేకంగా మాట్లాడటం మీకు బాగుందా?"

"ఎందులో పనిచేస్తున్నా ముందుగా నేను మానవతావాదిని. మార్గరెట్‌ను సంపూర్ణంగా అర్థం చేసుకున్న స్నేహితురాలిని నా వంటి వారే అన్యాయం గురించి మాట్లాడకపోతే జరుగుతున్న దారుణాలను ఎదిరించలేకపోతే నేను చేస్తున్న విలేకరి ఉద్యోగం వ్యర్థం" గీత ఆవేశంగా అంది.

"అన్ని ప్రాంతాలకు తిరిగి వార్తలు రాయమని మిమ్మల్ని స్టాఫ్ రిపోర్టరుగా పెట్టుకున్నారు. అంతేకానీ మీరు కూర్చున్న చెట్టును మిమ్మల్నే నరుక్కోమని కాదు"

"ఎదురుగా అన్యాయం జరుగుతుంటే ఏమీ కానట్టు ఎలా ఉండగలను? స్పందించకుండా ఎలా ఉంటాను?"

"అయితే ఏమంటారు?"

"ఏమీ అనను. జరిగిన అన్యాయాన్ని మన ఆఫీసులో స్టాఫ్ అందరికీ చెబుతాను. అందరిలో చైతన్యం తీసుకుని వస్తాను. పత్రిక యాజమాన్య వైఖరిని ఎండగట్టేలా చేస్తాను" అంది.

అంతవరకు ఒక మాదిరిగా సాఫీగా మాట్లాడిన ప్రభాకరమూర్తి తట్టుకోలేకపోయాడు. యాజమాన్య ప్రతినిధిగా ఉద్యోగం చేస్తున్నందున పత్రికను మేనేజ్‌మెంటును ఎవరేమన్నా అంటే అతను తట్టుకోలేడు. అందుకే "ప్రస్తుతం ఉన్న పత్రికా యాజమాన్యాలన్నీ ఇదే విధంగా ఉన్నాయి. మన పత్రిక కాస్త బెటర్. మీరు చెప్పిన విషయాలు మీ అసహనం మన పత్రిక మేనేజ్‌మెంటు దృష్టికి తీసుకుని వస్తాను" అన్నాడు.

ఈ మాటలు గీతలో మరింత అసహనాన్ని కలిగించాయి.

ప్రభాకరమూర్తి చెప్పిన విషయాలు అతను తనతో వాదించిన అంశాలను బేరీజు వేసుకుంటే యాజమాన్యం ఆలోచనలు ఎంత దారుణంగా ఉన్నాయో వారు తమ కింద పనిచేసే సిబ్బంది విషయంలో ఎంత క్రూరంగా ఆలోచిస్తున్నారో గీతా మాధురికి స్పష్టంగా అర్థమయ్యాయి.

మార్గరేట్ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని అనిపించింది విలేకరిగా పని చేసినప్పటికీ పేపరు కోసం మార్గరేట్ పూర్తిగా అంకితం అయిపోయింది. విధి నిర్వహణలో చనిపోతే ఎవరికీ పట్టకపోవటం అసహ్యం వేసింది. తాను పనిచేస్తున్న విజయం పత్రిక మీద మొదటిసారి తీవ్రమైన అసంతృప్తి కలిగింది.

ఉద్యోగంలో చేరిన కొత్తలో విజయం పేపర్ విలేకరి అంటే అందరి దగ్గరా ఎంతో గర్వంగా ఉండేది. పత్రిక తరఫున వార్తలు సేకరించడానికి వెళ్ళేటప్పుడూ ఇతర విలేకర్లందరిలో ప్రత్యేకమైన గౌరవం లభించేది. అటువంటి పత్రిక తన వద్ద పనిచేసే సిబ్బంది

విషయంలో ఇలా ప్రవర్తించడం ఆశ్చర్యం కలిగించింది పత్రికలు విలేకర్లను వాడుకుని వదిలేసే బాపతు అనే విషయం ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది యాజమాన్యంతో పోరాటం చేసైనా అనుకున్నది సాధించాలని అనుకుంది గీత.

అలా ఆలోచించిన తర్వాత గీత మనసుకు ఎంతో సంతృప్తి కలిగింది. ఒక స్నేహితురాలిగా మార్గరెట్ కుటుంబానికి తాను చేయవలసిన సాయం అదే అనుకుంది. విజయం పత్రికనుంచి ఆమెకు రావల్సిన మొత్తం అంతా ఇప్పించినట్లయితే చాలా వెసులుబాటు కలుగుతుందని అనుకుంది. మార్గరెట్ ఆత్మకు శాంతి కలగాలంటే ఈ విధంగా చేయాలని అనుకుంది. శాంతి కలుగుతుందో లేదో తెలియదు కానీ ఆ పని చేస్తే తన మనసు శాంతిస్తుందని సరిపెట్టుకుంది.

28

విజయం పత్రిక మెయిన్ పేపర్తో పాటు టాబ్లాయిడ్ పేపరు కూడా వస్తుంది. అందులో ఆ జిల్లా వార్తలు పబ్లిష్ అవుతుంటాయి. సాధారణంగా తీత రాసిన వార్తలు టాబ్లాయిడ్లో వస్తుంటాయి. ఎంతో ముఖ్యమైయినప్పుడు మెయిన్ ఎడిషన్లో కూడా వస్తుంటాయి.

ఉదయాన్నే పేపరు రాగానే తాను కంపోజ్ చేసిన వార్తలు అదేవిధంగా వచ్చాయా లేదా సబ్ ఎడిటర్ ఎడిట్ చేసాడా అనే విషయాన్ని గమనించడానికి వాటిని ప్రత్యేకంగా చదువుతుంది. ఇతర వార్తలను మామూలుగా చదువుతుంది.

ఆఫీసులో కంప్యూటరులో వార్తలను టైపు చేసే సమయంలో హెడ్డింగుకూడా టైప్ చేస్తుంది. పేజ్ మేకప్లో ఆ హెడ్డింగ్ సరిపోకపోతే దానిని మార్పు చేస్తారు. ప్రింటింగు చేసే సమయంలో కంపోజ్ చేసిన వార్త పబ్లిష్ చేసే విషయంలో దాని సైజు ఆధారంగా హెడ్డింగ్ కూడా మారుతుంది.

గీత వార్తలను కంపోజ్ చేసిన తర్వాత ప్రతివార్తకు ఒక నంబరును కేటాయిస్తుంది. ఆ నంబర్లను ఇంటికి వచ్చేముందు న్యూస్ ఎడిటర్కు అందించి వస్తుంది.

న్యూస్ ఎడిటర్ తన వద్దనుంచి కంప్యూటరులో గీత అందించిన నంబర్ల ఆధారంగా వార్తను ఓపెన్ చేసి చదువుతాడు. అవసరమైతే ఎడిట్ చేస్తాడు లేదా పక్కనున్న సబ్ ఎడిటర్కు పంపించి అతనితో ఎడిట్ చేయిస్తాడు. ఆ విధంగా క్లియర్ అయిన వార్తలను కంప్యూటరు రూంలో పేజినేషను, పేజ్ మేకప్లు చేసుకుంటాయి. ఇందుకోసం ప్రత్యేకమైన సిబ్బంది పనిచేస్తున్నారు. వారు అక్షరాలకు రంగులు అద్దుతారు. తర్వాత పేపర్ వెబ్ ప్రింటింగుకు వెళ్ళి ఆఫ్ సెట్ ప్రింటింగు అయిపోయి పేపర్లగా బైటికి వస్తుంది.

స్టాఫ్ రిపోర్టరుగా పనిచేస్తున్న గీత రాసిన వార్తలు దాదాపు అన్నీ యధాతధంగా రాసిన మర్నాడు పేపర్లో వస్తుంటాయి.

రోజూ మాదిరిగా ఉదయాన్నే పేపరు చూసిన గీత ఆశ్చర్యపోయింది.

ముందురోజు తాను కంపోజ్ చేసిన వార్తలేవీ విజయం పత్రికలో కనిపించలేదు. ఎంతో ముఖ్యమైనదిగా తాను నోట్ పెట్టిన గృహనిర్మాణాల్లో అవకతవకలు అనే వార్తకూడా పబ్లిష్ కాలేదు. ఆ వార్తలతోపాటు రోడ్లు నిర్మాణాల్లో అవకతవకలు అనే వార్తకూడా పబ్లిష్ కాలేదు. దానితోపాటు రోడ్లు నిర్మాణంలో మురిగిపోతున్న నిధులు అనే పరిశోధనాత్మక వార్తా కథనం కూడా రాలేదు. మంత్రి చెప్పిన ప్రెస్ నోట్ను కూడా వార్తగా రాసింది. అదికూడా పబ్లిష్ కాలేదు.

గతంలో ఎప్పుడూ ఈ విధంగా జరగలేదు. అసలు ఏమి జరిగిందో ఆమెకు అర్ధంకాలేదు. మనసు పరిపరివిధాలుగా ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది

ముందురోజు ప్రభాకరమూర్తితో గొడవ పెట్టుకున్న విషయం గుర్తుకు వచ్చింది. కంపోజ్ చేసిన వార్తలు రాకపోవడం వెనుక ప్రధాన కారణం అతనే ఉంటాడని గీతకు అర్థమైపోయింది. తాను ఉద్యోగంలో చేరిన తర్వాత గత కొన్ని సంవత్సరాలుగా ఎప్పుడూ ఎదురుకాని పరిస్థితి ఏర్పడిందంటే ఏదో జరిగిందని గీతకు బోధపడింది.

పేపర్‌లో వార్తలు రాకపోవడంతో గీతా మాధురి మూడ్ పాడైపోయింది.

మనసంతా మొద్దుబారిపోయినట్లయింది.

పత్రికా కార్యాలయాల్లో రాజకీయాలు. యాజమాన్యాలకు చిడతలు కొట్టడం భజనలు చేయడం చాలామంది విలేకర్లు చేస్తారని గీత చాలామంది వద్ద వింది. తాము చేసే అవకతవక పనులకు తప్పుడు వార్తలకు మేనేజ్‌మెంటు వత్తాసు ఉంటుందని ఈ విధంగా చేస్తుంటారని ఆమెకు తెలుసు. కానీ విజయం పత్రికలో ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు. మార్గరెట్ విషయంలో ప్రసాదమూర్తితో గొడవ పెట్టుకోవడంతో అతను తనమీద మేనేజ్‌మెంటుకు లేనిపోనివి పుట్టించి చెప్పి ఉంటాడని అర్థమైపోయింది.

గీత మనసులో విషాదం కమ్ముకుంది.

"ఏమిటి గీతా? ఏదోలా ఉన్నావు? ఏమి జరిగింది?"

అమ్మ ప్రశ్నలకు జవాబు చెప్పాలని అనిపించలేదు. ఆ ప్రశ్నలకు జవాబులు కూడా గీత దగ్గర లేవు. అందుకే ఏమీ చెప్పకుండా గబ్‌గబా తయారైపోయింది.

"టిఫిన్ చేస్తావా?"

ఏదో అయిందనిపించి ఏక్టివా తీసి బైటపడింది.

న్యూస్ ఎడిటర్ రాజారావు ఇంటివైపు దారి తీసింది. కొంత దూరం వెళ్ళిన తర్వత ఎందుకో వెళ్ళాలని అనిపించలేదు.

రోడ్డుపక్కన బండిని ఆపి రాజారావు సెల్‌ఫోనుకు డయిల్ చేసింది.

"హలో గీతగారు చెప్పండి" అన్నాడు.

"సార్ ఈ రోజు పేపర్‌లో నేను రాసిఅన్ ఒక్క వార్తను కూడా పబ్లిష్ చేయలేదు. నిన్న రాత్రి మీకే అందించాను కదా సార్. నేను ఇంటికి వచ్చేసిన తర్వాత ఆఫీసులో ఏమైనా జరిగిందా?" అని అడిగింది.

రెండు క్షణాలు నిశ్శబ్ధం తర్వాత "ఎండీగారు నిన్ను రెండువారాలు సస్పెన్షనులో ఉంచమన్నారు. నిన్న రాత్రే మెయిల్‌లో ఆర్డరు వచ్చింది."

"అంటే?"

"అదేనమ్మా సస్పెన్షను. వచ్చిన మెయిల్‌ను ఈ రోజు నీకు పంపిస్తాను చూడు. అందులో అన్ని వివరంగా ఉంటాయి."

"ఏమిటి సార్ ఇది?"

"నాకు పూర్తిగా తెలియదు. పైనుంచి ఆదేశాలు వచ్చాయి. నేను ఏమీ చేయలేను. నువువ్ నిన్న కంపోజ్ చేసిన వార్తలన్నీ ఆపుచేయమన్నారు. కొన్ని ముఖ్యమైఅన్ వార్తలను శ్రీనివాస్ మళ్ళీ అతని డేట్ లైనుతో తిరిగి రాసాడు"

గీతకు అంతా అయోమయం అనిపించింది.

ఆమె ఆ సందిగ్ధంలో ఉంటుండగా "నేను మళ్ళీ సమాచారం అందించే వరకు వార్తలు రాయవద్దు" అని కూల్‌గా చెప్పి ఫోను కట్ చేసాడు.

విజయం ఎండి విజయ ప్రసాద్ ఇంటికి బయలుదేరింది గీత.

విశాలమైన కాంపౌండులో అందమైన ఇల్లు.

వాచ్‌మాన్ గేటు బైటే ఆపేసాడు.

గతంలో ఎండి ఇంటికి ఒకటి రెండుసార్లు గీత వచ్చి అతడిని కలిసింది కూడా. కానీ ఇప్పటి పరిస్థితి చాలా తేడాగా ఉందని అనిపించింది.

గంట సమయం నిరీక్షించిన తర్వాత లోపలినుంచి పిలుపు వచ్చింది.

గీత విసురుగా లోపలికి వెళ్ళింది.

అందమైన రివాల్వింగు చైర్‌లో కూర్చుని అటూ ఇటూ ఊగుతునన్ ఎండి విజయ ప్రసాద్‌ని చూడగానే గీతకు ఉక్రోషం పొంగుకు వచ్చింది.

"ఏమిటి సార్ నన్ను సస్పెండ్ చేయమన్నారట"

ఎండి విజయప్రసాద్ కళ్ళద్దాలను సర్దుకుని ఆమె వైపు విసుగ్గా చూసాడు. తర్వాత "నువ్వు అతిగా మాట్లాడుతున్నావని పిర్యాదులు అందాయి. నువ్వు చేస్తునన్ ఉద్యోగం ప్రైవేటుదన్న విషయం మరిచిపోవద్దు. బీ ఇన్ యువర్ లిమిట్స్" అన్నాడు.

గీతకు కూడా కోపం తన్నుకుని వచ్చింది.

"సార్. నేనేమీ కాని పనిచేయలేదు. మార్గరెట్ గురించి ప్రభాకరమూర్తితో మాట్లాడాను. ఆమెకు న్యాయంగా రావల్సిన సొమ్ము గురించి మాట్లాడాను. కాని అతను దానిని తప్పు తోవ పట్టించి నేను తప్పు చేస్తున్నట్లు యాజమాన్యానికి విరుద్దంగా ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేసాడు. తమకు కూడా లేనిపోనివి నామీద చెప్పాడు. నేను నిజం మాట్లాడాను అంతే" అంది.

"నువ్వు పనిచేస్తున్న పత్రికమీద నీకు మంచి అభిప్రాయం ఉండాలి. తక్కువ భావం ఉండటం సరికాదు. కోపాలున్నప్పటికీ మనసులో దాచుకోవాలి. నీలో ఎంతటి అసంతృప్తి ఉందో నీ మాటలవల్ల అర్థం అవుతోంది. నీవంటి సిబ్బంది నా సంస్థలో కొనసాగడం బాధగా ఉంది."

"మీరు బాధపడవలసిన పని నేనేం చేయలేదు. మార్గరెట్ రిపోర్టరుగా మన సంస్థలో చాలాకాలం చేసింది. ఎన్నో మంచి వార్తలు రాసి పేపర్‌కి పేరు తెచ్చేలా ప్రయత్నాలు చేసింది. ఆమె అనుకోకుండా చనిపోయింది. ఆమె మీద ఆధారపడిన ఆమె ఆధారపడిన ఆమె కుటుంబం దిక్కులేకుండా అయిపోయింది. అటువంటి మార్గరెట్‌కు మన సంస్థ చేసిన సాయం ఏమిటి? ఆమె కుటుంబం ఏమైపోతుందన్న విషయం ఎవరూ ఆలోచించలేదు. ప్రభుత్వ పరంగా సాయం అందింది. కానీ మన సంస్థపరంగా ఏమీ ఇవ్వలేదు. దీనికి నా మనసు బాధపడి మాట్లాడాను."

గీత మాట్లాడిన మాటలు విన్న తర్వాత ఎండి రెండు నిమిషాలు పాటు ఏమీ మాట్లాడలేదు. ఈ లోపు ఎండి వ్యక్తిగత కార్యదర్శి వచ్చి ఆయన అర్జంటుగా వెళ్ళవలసిన మీటింగు గురించి గుర్తుచేసాడు. అప్పుడు ఆయన "మీటింగ్ ఉంది" అంటూ లేచాడు.

గీత అయోమయంగా అతనివైపు చూస్తుండగా "నేను తీసుకున్న నిర్ణయం తప్పేమో అని ఇంతవరకు అనుకున్నాను కానీ నీ మాటలు విన్న తర్వాత నీ ఆవేశం చూసిన తర్వాత నేను ఇప్పుడు తీసుకున్న నిర్ణయం మరికొంత ముందు తీసుకుంటే బాగుండేదేమో అనిపిస్తోంది. నువ్వు చేస్తున్నది విలేకరి ఉద్యోగం అని మరిచిపోయావు. నా సంస్థలో నా కింద పని చేస్తున్నావన్న విషయం కూడా మరిచిపోయి మాట్లాడుతున్నావు. నా సంస్థలో క్రమశిక్షణ గురించి ఎవరికీ తెలియందికాదు" మరో మాటలకు అవకాశం లేకుండా విసవిసా బైటికి వెళ్ళిపోయాడు.

వంటరిగా మిగిలిపోయింది గీతామాధురి.

ఆమెకు దుఃఖం పొంగుకు వచ్చింది.

అదీ ఓ క్షణమే.

అందరిలా తను ప్రతి విషయానికీ రియాక్టు అవుతోంది. ఈ విషయంలో యాజమాన్యం తీసుకునే ఏ నిర్ణయానికైనా బాధపడవలసింది భయపడవలసింది ఏమీ లేదు అనుకుంది. తాను తన కోసం బతుకుతోంది తప్పా ఎవరి కోసం కాదు. మనసును సమాధాన పరుచుకుంది.

ఆమెకు శ్రీకాంత్ గుర్తుకు వచ్చాడు.

***

**అతని తీవ్రవాద** ఉద్యమం మనసులో మెదిలింది.

తీవ్రవాదులుగా నక్సలైట్లుగా ఎందుకు మారుతుంటారు అని ప్రశ్నార్థకంగా ఉండేది. పడాల్.. రామరాజు వంటివారి జీవితాలను పరిశీలన చేసిన తర్వాత కొంత అర్థం అయింది. పత్రికను లాభాల్లో నడిపించడానికి లక్షలనార్జిస్తున్న వ్యక్తి ఆ పత్రిక కోసం నిరంతరం పని చేసి విధి నిర్వహణలో మృతి చెందితే మేనేజ్‌మెంటు పట్టించుకోలేదన్న విషయం గీతలో ఆవేశాన్ని తెప్పించింది.

ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడేనా తీవ్రవాదం పట్ల మొగ్గు చూపిస్తారు? తన మనసును మనసులోనే ప్రశ్నించుకుంది.

శ్రీకాంత్ తరచూ చెప్పేమాటలు గుర్తుకు వచ్చాయి.

"బలహీనుడైన బాలుడ్ని వేధించినా, కొట్టినా అతను కోపంతో ఎదుటివాడి చేతుల్ని కొరికివేస్తాడు. లేకపోతే కిందనుంచి రాళ్ళు, మట్టి ఎదుటివాడి మీద విసిరి తన నిరసన తెలియజేస్తాడు. ఎందుకంటే ఎదుటనున్న బలవంతుడితో పోరాటం చేయలేక ఈ విధంగా చేసాడు పరిస్థితులకు రాజీ పడలేనివారు అన్యాయాలను ఎదిరించాలనుకునేవారు రాగలరు. అన్యాయాలను ఎదిరించాలనుకున్నవారు ప్రత్యక్షంగా వీలు కాకపోతే పరోక్షంగా పోరటానికి దిగుతారు అదే తీవ్రవాదం" అనేవాడు శ్రీకాంత్

శ్రీకాంత్ మాటల్లో చాలా ఉంది.

నిజంగా తాను కూడా ఆ పరిస్థితుల్లో ఉందా? ప్రస్తుత పరిస్థితులను తను ఎదిరించగలదా? చిన్న ఉద్యోగం చేస్తున్న తాను పెద్ద సంస్థపై పోరాటం చేయగలదా? ఆమెలో ఆలోచనలు.

గీత పరిపరి విధాలుగా ఆలోచించింది

ఆమె అలా ఆలోచిస్తున్న సమయంలో శ్రీకాంత్‌ను మళ్ళీ కలుసుకుంటే ఎలా ఉంటుంది అనుకుంది. అలా అనుకోగానే అతడిని కలుసుకోవాలని మనసు తహ తహలాడిపోయింది. కష్టాల్లోనూ ఇబ్బందుల్లోనూ ఉన్నప్పుడు స్నేహితుల్ని ఆత్మీయుల్ని తలచుకోవడం సహజం కదా?

కిడ్నాపు ఉదంతంలో జైలు నుంచి విడుదలైన శ్రీకాంత్ ఎక్కడ ఉన్నాడో తెలియదు. ఒకసారి పోలీసులకు చిక్కి బలవంతంగా విడుదల అయిపోవడంతో నిఘా ఎక్కువ అయిపోయింది. మళ్ళీ అతడిని అరెస్టు చేయాలని పోలిసులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో శ్రీకాంత్ ఆచూకీ తనకు ఎలా తెలుస్తుంది?

శ్రీకాంత్ మనసులోకి రాగానే అతడిని ఎలాగైనా కలుసుకోవాలని మనసు పదేపదే చెపుతున్నట్లుగా అనిపించింది.

ప్రయత్నం చేస్తే ఎందుకు కలుసుకోలేదు? తప్పకుండా మళ్ళీ శ్రీకాంత్‌ను కలుసుకుంటుంది. అలా అనుకోగానే మనసులో అంతవరకు ఉన్న బాధను ఎవరో తీసి వేసినట్లుగా అనిపించింది.

## 29

డి.ఐ.జి శ్యామ్‌సుందర్ తీవ్రవాదులను ఆకర్షించడానికి రకరకాల వ్యూహాలను తయారు చేసాడు. వారిని పూర్తిగా నిర్మూలించడానికి అవసరమైన పథకాలను రూపొందించి అమలు చేయడానికి నిర్ణయించాడు.

తీవ్రవాద ఉద్యమంలోనూ హత్యలు, బస్సు దహనాలు, ప్రభుత్వ ఆస్థులను నాశనం చేయడం వంటి పనులు చేసిన వారిని వాటితో సంబంధం ఉందన్న అనుమానం ఉన్న నక్సలైట్లను పట్టి ఇచ్చిన వారికి రివార్డులను ప్రకటించాడు. పదివేలునుంచి యాభైవేల రూపాయల వరకు బహుమతులు ఇస్తామని ప్రకటనలు చేయించాడు. ఈ విషయాలను వివరిస్తూ గిరిజన గ్రామాలలో కరపత్రాలను కూడా పంపిణీ చేయించాడు.

ఏజన్సీ ప్రాంతాలను గుర్తించి గిరిజనులను ఆకర్షించడానికి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసాడు. విశాఖపట్నం నుంచి వైద్యులను తీసుకుని వెళ్ళి గిరిజనులకు ట్రీట్‌మెంట్లు చేయించేవాడు. వాటితోపాటు న్యాయ సహాయ శిబిరాలను నిర్వహించి గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి శ్రీకారం చుట్టాడు.

తీవ్రవాద ఉద్యమం గిరిజనుల సమస్యలపై ఆధారపడి కొనసాగుతున్నది. కొండకోనలలో ఎటువంటి సదుపాయాలు లేని గిరిజన గ్రామాలలో మేమున్నామని గిరిజనులకు అండగా నిలబడటంతో చాలా ప్రాంతాలలో అన్నలంటే గౌరవం పెరిగిపోయింది. దీనిని నివారించడానికి శ్యామ్ సుందర్ ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి నిర్ణయించాడు.

తాను అనుకున్న వ్యూహం ప్రకారం ప్రయత్నాలను ప్రారంభించాడు.

తీవ్రవాద ఉద్యమం పట్ల యువకులు ఆకర్షితులు కాకుండా వారిని చైతన్యం చేయడానికి నిరుద్యోగ సమస్య తీర్చడానికి ఒక కార్యక్రమాలన్ని ప్రారంభించాడు. నక్సలైట్ల కదలికలు నిర్ధాక్షిణ్యంగా అణచివేయడానికి కింది స్థాయి పోలీసులకు స్టేషన్ ఇన్‌చార్జిలుగా అధికారాలను అప్పగించాడు. నక్సలైట్లు ఎవరైనా లొంగిపోవడానికి ప్రయత్నిస్తే వారికి పునరావాసం కల్పించడం వారు జనజీవన స్రవంతిలో కలవడానికి ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు.

శ్యామ్‌సుందర్ తీసుకున్న ఈ చర్యలకు మంచి స్పందన వచ్చింది.

అధికారులు డిఐజి చెప్పిన ఆదేశాలను పాటించి రకరకాల కార్యక్రమాలను తయారు చేసారు. గిరిజనులకు సేవా పథకాలను అమలు చేయడానికి చర్యలు తీసుకున్నారు. చిన్నాచితకా కార్యక్రమాలతో సంబంధం ఉన్న నక్సలైట్లు చాలామంది పోలీసుల వద్ద లొంగిపోయే ఏర్పాట్లు చేసాడు.

డిఐజి తీసుకున్న చర్యలు కారణంగా నలుగురు తీవ్రవాదులు లొంగిపోయారు. విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారిని హాజరు పరిచారు.

నక్సలైట్లు చేస్తున్న కార్యక్రమాలతో పూర్తిగా విసిగిపోయామని, తీవ్రవాద ఉద్యమం నీరుగారిపోయిందని అందుకే జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని పోలీసుల వద్ద లొంగిపోయామని వారు ప్రకటించారు.

వారు చెప్పిన విషయాలు అన్ని పత్రికలలో పెద్ద పెద్ద హెడ్డింగులతో వార్తలుగా వచ్చాయి. మంచి ప్రచారం కూడా వచ్చింది.

పత్రికా వార్తలను చూసిన ప్రజల్లో ఒకలాంటి స్పందన కనిపించింది. లొంగిపోయిన తీవ్రవాదులకు స్థలాలను ఇస్తామని ఇళ్ళను కేటాయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

నకిలీ తీవ్రవాదిగా ఉన్న కుమారస్వామి డిఐజి శ్యామ్ సుందర్ తీసుకుంటున్న చర్యలను మొదటినుంచి కనిపెడుతున్నాడు. పోలీసులకు లొంగిపోయే నాటకం ఆడినట్లయితే పేరు వస్తుంది పేరుతోపాటు డబ్బు కూడా వస్తుందని ఆశపడ్డాడు.

శ్యామ్ సుందర్‌ను ప్రత్యేకంగా కలుసుకున్నాడు.

తనను తాను పరిచయం చేసుకుని "తమరు ప్రవేశపెట్టిన తీవ్రవాద పునరావాస పథకం ఎంతో నచ్చింది ఇంతవరకు నేను చేసిన పనులు నాకే ఎంతో అసహ్యం వేసాయి. పశ్చాత్తాప పడుతున్నాను నేను తీవ్రవాద ఉద్యమానికి దూరంగా ఉంటాను అందుకే తమ వద్దకు వచ్చాను" అన్నాడు.

"అంటే?"

"గత పదేళ్ళుగా నక్సలైటుగా అనేక సంఘ వ్యతిరేక పనులకు పాల్పడ్డాను. ఇప్పుడు నా తప్పును తెలుసుకున్నాను. అటువంటి పనులకు దూరంగా ఉందామని అనుకుంటున్నాను. అందుకే మీ వద్దకు వచ్చాను" అన్నాడు.

శ్యామ్ సుందర్‌కు ఎంతో ఆనందం అనిపించింది. తన ప్రకటనకు లభించిన స్పందనకు ఎంతో సంతోషపడ్డాడు. ఆ ప్రాంతంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి విషయాన్ని చెప్పాడు. తానే నకిలీ నక్సలైటునన్న విషయం ఎక్కడా తెలియకుండా కుమారస్వామి జాగ్రత్తపడ్డాడు. గతంలో జరిగిన రెండు మూడు విధ్వంసాలతో సంబంధం ఉందని చెప్పడం వల్ల అతని కేసు పెద్దది అయిపోయింది.

విషయం తెలుసుకుని హోంశాఖ కార్యదర్శి డిఐజి శ్యామ్‌సుందర్‌ను అభినందించారు.

నకిలీ నక్సలైటు అయినప్పటికీ తన విషయం ఎవరికీ తెలియకుండా కుమారస్వామి చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. పోలీసులు కూడా అతని వ్యవహారాన్ని అంతగా పట్టించుకోలేదు.

తమకు ఎన్నో ఉపకారాలు చేస్తూ అండగా ఉంటున్న నక్సలైట్ల పట్ల గిరిజన గ్రామాలలో చాలా సానుభూతి ఉంది. దానిని తిప్పి కొట్టడానికి కుమారస్వామిని ఉపయోగించుకోవాలని డిఐజి ఆలోచన చేసాడు. అందుకు అనుగుణంగా ఒక కార్యక్రమాన్ని తయారుచేసాడు.

నక్సలైట్లకు వ్యతిరేకంగా గిరిజన తెగకు చెందినవాడు గిరిజన గ్రామాలలో చాలామందితో పరిచయాలు ఉన్నవాడు. ఏ గిరిజనులైతే తీవ్రవాదం పట్ల ఆకర్షితులవుతున్నారో అటువంటి వారు వారికి దూరంగా ఉండటానికి ఈ వ్యూహం పని చేస్తుందని తలంచారు.

కుమారస్వామి కోసం పోలీసు అధికారులు వాహనాన్ని ప్రత్యేకంగా సమకూర్చారు.

కొన్ని ముఖ్యమైన గిరిజన గ్రామాలు సంతలను గుర్తించాడే ఆయా ప్రాంతాలలో గిరిజనులతో సమావేశాలను ఏర్పాటు చేయించారు. తెరవెనుక తీవ్రవాదులు కోసం ఆ ప్రాంత పోలీసులు పూర్తిగా సహకారాన్ని అందించడంవల్ల ఈ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి.

"తీవ్రవాదులు సమాజానికి చీడపురుగులు వారి వల్ల సామాన్యులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. తమ స్వప్రయోజనాల కోసం ప్రభుత్వంపై తమకున్న కోపాన్ని అక్కసుని వెళ్ళగక్కడానికి ఈ విధంగా తీవ్రవాదులు ప్రవర్తిస్తున్నారు. సిద్ధాంతాల ముసుగులో రకరకాల మోసాలను చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నారు."

కుమారస్వామి ఉపన్యాసాలు ఆవేశంగా కొనసాగుతున్నాయి.

చాలామంది గిరిజనులు పోలీసులు సమకూర్చిన వాహనంలో ఉపన్యాసాలిస్తూ ఆకట్టుకుంటున్నాడు అంతవరకు కుమారస్వామి అంటే ఎవరో తెలియని వారుకూడా అతని మాటలను ఆసక్తిగా వింటున్నారు.

పోలీసు వాహనంలో ఉపన్యాస స్థలానికి వచ్చి అక్కడ కార్యక్రమాన్ని నిర్వహించి మళ్ళీ అదే వాహనంలో వెనక్కి వచ్చేస్తున్నాడు. ఈ విధంగా చేయడం వల్ల కుమారస్వామికి చాలా ధైర్యంగా ఉంటోంది. ఆ ధైర్యంతోనూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నాడు.

అసలైన నక్సలైట్లు అంటే సహజమైన భయంకూడా అతనిలో ఏమూలో ఉంది. అయితే తన వెనుక పోలీసు యంత్రాంగం అంతా ఉండటం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్న ధైర్యాన్ని తెచ్చుకుంటున్నాడు.

డిఐజి శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు కుమారస్వామి ఆ ప్రాంతంలో ఉన్న పోలీసులు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేసారు.

కష్టపడి పనిచేయడం ఇష్టంలేని బద్ధకస్తుడైన కుమారస్వామికి ఈ అనుభవం కొత్తగా అనిపించేది. కష్టపడకుండా సుఖంగా జీవించడం ఎలా అని సందేహపడేవాడు. అదే కారణంతో నకిలీ నక్సలైటుగా మారి చాలాకాలం గడిపాడు ఇప్పుడు పోలీసుల అండదండలు లభించడంతో ధీమాగా ఉంటున్నాడు.

కుమారస్వామికి పది ఎకరాల బంజరు భూమిని నక్సలైట్ల పునరావాస పథకంలో భాగంగా కేటాయించాలని డిఐజి శ్యామ్‌సుందర్ కలెక్టరుకు ప్రతిపాదనలను పంపించాడు.

## 30

"తీవ్రవాద ఉద్యమాన్ని నీరుగారుస్తున్నారు. మనపట్ల అందరిలోనూ వ్యతిరేకత కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్ని ఎదుర్కొనకపోతే రానున్న కాలంలో చాలా ఇబ్బందులు వస్తాయి" పడాల్ ఆవేశంగా అన్నాడు.

అడవిలో అన్నలంతా సమావేశమయ్యారు.

అందరి మనసుల్లోనూ రకరకాల ఆలోచనలు ఇంతవరకు తమను ఆరాధనగా చూసే గిరిజనుల మనుషుల్ని విషతుల్యం చేస్తున్న వారిని క్షమించే ప్రసక్తి లేదని అందరూ ఏకగ్రీవంగా అనుకున్నారు.

"ఇంతకీ ఈ కుమారస్వామి ఎవరు?" ఎవరో అడిగారు.

"అదే అర్థం కావడంలేదు. మన దళాలకు చెందిన వ్యక్తి కాదు అసలు మనకు సంబంధించి ఇంతవరకు ఎటువంటి కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు"

"అయితే మరెవరు?"

"పోలీసులు తయారు చేసిన మనిషి."

"అతను ఎక్కడివాడు? ఎటువంటివాడు అనే విషయాన్ని మన సుదర్శన్ ఆరా తీసి కనుగొన్నాడు. కుమారస్వామి తీవ్రవాదం అంటే ఏమిటో తెలియదు. కానీ చాలామంది కాంట్రాక్టర్లు అధికారులు అతడిని తీవ్రవాదిగానే భావిస్తున్నారు" రామరాజు చెప్పాడు.

"అలా ఎందుకు భావిస్తున్నారో కనుక్కోవలసింది."

"అదే తెలియడం లేదు. బహుశా తీవ్రవాదుల పేరు చెప్పుకుని అధికారుల వద్దకు వెళ్ళినవాడా?"

ఒకొక్కరు ఒకోమాట మాట్లాడుతుండగా అందరిలోనూ అప్పుడు కలిగించింది అనుమానం.

"ఉద్యమమే ఊపిరిగా పోరాటమూ కర్తవ్యంగా పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న నక్సలైట్లకు చెడ్డపేరు తీసుకుని వస్తున్న నకిలీలు పట్ల అందరూ దృష్టి సారించాలి" అక్కడున్న సీనియర్ వ్యక్తి సూచించాడు.

"అయితే ఏమి చేద్దాం" అంతవరకు అందరి మాటలను వింటున్న శ్రీకాంత్ కలగజేసుకుని అడిగాడు.

ఎవరూ ఏమీ చెప్పక పోవడంతో "మన ధృఢంగా ఉండకపోతే పరిస్థితులు మనకు ఎదురు తిరుగుతాయి. ఇప్పటికే ఏజన్సీలో ఉంటున్న గిరిజనుల మనసుల్ని మార్చడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనకు అన్ని రకాలుగా సాయపడుతున్నవారికి

మనం సహకారాన్ని అందించవలసిన అవసరం ఉంది లేకపోతే అండర్ గ్రౌండులో మనం నడుపుతున ఈ ఉద్యమానికి ఇబ్బంది వస్తుంది'' అన్నాడు.

''మనం తీసుకున్న చర్యలు చాలా కఠినంగా ఉండాలి మన పరిస్థితి ఎవరికీ అర్థంగాకుండా ఉండాలి మన విషయాలలో ఎవరూ కలగజేసుకోకుండా ఉండాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలి'' జీవన్ సలహా ఇచ్చాడు.

''అవును నిజమే ఇంతవరకు మనం తీసుకున్న నిర్ణయాలన్నీ ఒక ఎత్తు అయితే ఇకపై తీసుకోబోయే నిర్ణయాలు మరో ఎత్తుగా ఉండాలి. అలా అయితేనే మనపట్ల బయం భక్తీ ఉంటాయి.''

''ఇంతవరకు ఏ గిరిజనుల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్నామో దానిని గండి కొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గిరిజనులతో మనకు ఎంతో సన్నిహిత సంబంధాలు బాంధవ్యాలు ఉన్నాయి. వారికి మనకు మధ్య ఉన్న ఈ లింకును తెగ్గొట్టడానికి పోలీసులు వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు తగిన ప్రయత్నాలను కూడా ప్రారంభించారు. దీనిని మనమంతా ధృఢంగా ఐకమత్యంగా ఎదుర్కొవలసి ఉంది'' అన్నారు.

ఈ మాటలు అందరికీ నచ్చాయి.

సమావేశంలో భవిష్యత్తులో తీసుకోవలసిన నిర్ణయాల గురించి చాలామంది సలహాలను అందించారు. ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని పలువురు కార్యకర్తలు సూచించారు.

వాటిని అమలు చేయాలని సమావేశం తీర్మానించింది.

## 31

''కొరియర్ ద్వారా ఉత్తరం వచ్చింది'' శ్రీకాంత్‌కు పక్కనున్న కార్యకర్త అందించాడు.

శ్రీకాంత్ ఆశ్చర్యపోయాడు.

కిడ్నాప్ ఉదంతం తర్వాత క్రాంతి కిరణ్ అనే కొత్తపేరును పెట్టుకున్నాడు. శ్రీకాంత్ పేరుతో కొరియర్ ద్వారా ఉత్తరం రావడం విస్మయాన్ని కలిగించింది.

గబగబా కవరును చింపాడు.

గీతామాధురి అందమైన దస్తూరి చూసి సంతృప్తిగా నిట్టూర్చాడు. గీత గుర్తుకు రాగానే మనసులో అదోలాంటి పులకింత కలిగింది చాలా రోజుల తర్వాత ఆమె తలంపు కొత్త ఆలోచనలు కలిగించాయి. వెంటనే ఉత్తరాన్ని చదివాడు.

***ప్రియమైన శ్రీకాంత్***

నీతో మనసు విప్పి మాట్లాడాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను ఇప్పటికి కుదిరింది. రాసిన ఈ ఉత్తరం నీకు చేరుతుందో లేదో కూడా తెలీదు కానీ ఒక ప్రయత్నం చేసాను అందుతుందనే నమ్మకంతో ఉన్నాను.

విజయం పత్రికా యాజమాన్యంతో గొడవ పడ్డాను పత్రికల వ్యవహారాల శైలి అసలు బాగోలేదు. చాలామంది యజమానులు విలేకర్లను దోపిడీ చేస్తున్నారు. వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. జీతాలు కూడా ఇవ్వడంలేదు. అందువల్ల వారు కూడా లంచాలకు అవినీతికి అలవాటు పడిపోయారు. నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో మాదిరిగా లేదు. అన్యాయం గురించి మాట్లాడినా ఎదిరించడానికి ప్రయత్నించి నా పరిస్థితి దారుణంగా ఉంటుందని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

సామాన్యమైన మనిషి తీవ్రవాదిగా ఎందుకు మారిపోతాడా అని అనుకునేదానిని. అటువంటి పరిస్థితులు నాకు అనుభవ పూర్వకంగా తెలిసాయి.

నిన్ను కలుసుకుని చాలారోజులు అయిపోయింది. నీతో చేసిన ఇంటర్వ్యూ మా పేపరులో పబ్లిష్ అయిన కొద్దిరోజుల్లోనే నువ్వు పోలీసులకు చిక్కిపోవడం నాకెందుకో చాలా గిల్టీగా అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు నువ్వు విజయవంతంగా బైటపడ్డావనుకో. అయినా నా మనసు ఏదోలా ఉంది. ఇటీవల కాలంలో చాలా ఆందోళనగా ఉంటోంది.

నీతో ఒకసారి మాట్లాడాలని ఉంది ప్రస్తుత పరిస్థితుల్లో నిన్ను కలుసుకోగలనో లేదో కూడా నాకు తెలియదు. అసలు ఈ ఉత్తరం నీకు అందుతుందో లేదో కూడా అర్థం కావడంలేదు. ఆశ కొద్దీ రాస్తున్నాను.

నిన్ను కలుసుకోవాలని నా మనసులో గూడు కట్టుకున్న ఆవేదన, దుఃఖం నీ వద్ద నివేదించాలని తపనగా ఉంది. ఎందుకంటే యూనివర్సిటీలో ఎప్పుడో మన పరిచయం నిన్ను ఇంటర్వ్యూ చేయడంతో మొగ్గ తొడిగింది. ఇప్పుడు దానిని మరింతగా పెంపొందించుకోవాలని మనసు తహ తహలాడుతోంది.

నన్ను కలుసుకునే మార్గం నీకు తెలియంది కాదు. కలవాలని అనుకుంటే ఎలాగైనా నన్ను కలవగలవు.

*నీ*

***గీతామాధురి***

ఉత్తరం చదివిన తర్వాత శ్రీకాంత్ అయిదు నిమిషాలు అలా ఉండిపోయాడు.

ఎప్పుడో విడిపోయిన ప్రాణ స్నేహితుడి నుంచి చాలారోజుల తర్వాత వచ్చిన ఉత్తరంలా ఉంది.

గీత అంటే ఒకలాంటి ఇష్టం ఉన్నప్పటికీ ఇలా ఉత్తరాలు రాసుకోలేదు.

సెల్‌ఫోన్లు ఈమెయిల్స్ రాజ్యమేలుతున్న కాలంలో చేతిరాతతో ఉత్తరం రావడం శ్రీకాంత్‌కు ఎంతో నచ్చింది. గీతను ఎలాగైనా కలుసుకోవాలి. ఆమెతో ఎన్నో కబుర్లు చెప్పాలి అని మనసులో అనుకున్నాడు.

ఎలా కలుసుకోవాలి?

అజ్ఞాతంలో ఎవరికీ తెలియని కారడవిలో ఉన్న తాను ఎలా వెళ్ళగలడు? రహస్యంగా ఆమెను ఎలా కలుసుకోగలడు?

పరిపరి విధాలుగా ఆలోచించాడు.

జైలునుంచి బలవంతంగా విడుదల కావడంతో పోలీసుల నిఘా ఎక్కువగా ఉంది ఎవరికంట పడినా తప్పించుకోవడం చాలా కష్టం. గతంలోనే పోలీసులకు చిక్కినప్పుడు ఎన్‌కౌంటర్ అయిపోవలసిన తాను పోలీసులు అనుకోని పరిస్థితుల్లో అరెస్టు చేసినట్లు చూపించడం వల్ల బతికిపోయాడు.

మనసులో రకరకాలుగా ఆలోచనలు చేసాడు. గీతను కలుసుకోవాలని మనసులో ధృఢంగా నిర్ణయం తీసుకున్నాడు.

## 32

**గీతకు** చాలా అసహనంగా ఉంది

నాలుగు రోజులనుంచి ఏ పనీ చేయాలనిపించడంలేదు. ఏ తప్పూ లేకపోయినా తనను బాధ్యురాలిగా చేసారన్న బాధ మనసులో పర్వతంలా పెరిగిపోయింది. విజయం పత్రిక కోస్మ తాను ఎంతో కష్టపడింది. పత్రిక తన స్వంతమని భావించి దాని అభివృద్ధికోసం చాలా కృషి చేసింది. చాలామంది తనను విజయం గీతగా పిలుస్తుంటారు. నిరంతరం నా పత్రిక అనుకుని పనిచేసిన తన విషయంలో యజమాన్యం ఎందుకింత దారుణంగా ప్రవర్తించిందో అర్థం కావడంలేదు.

పత్రికా విలేఖరిగా చాలామందితో పరిచయాలు ఉన్నాయి.

వార్తలు రాయకుండా ఖాళీగా ఉండటం వల్ల వారినుంచి ఎదురయ్యే రకరకాల ప్రశ్నలకు ఏమి సమాధానం చెప్పాలో తెలియడంలేదు. వారి పలకరింతలు చాలా ఇబ్బందిగా అనిపిస్తున్నాయి.

ఇంట్లో వంటరిగా కూర్చున్న గీత దగ్గరకు రామలక్ష్మమ్మ వచ్చి "నీ వ్యవహారం చూస్తుంటే నాకు ఆశ్చర్యం కలుగుతోంది. ఈ మధ్య వార్తలంటూ ఊర్లు పట్టుకుని తిరిగావు. ఇప్పుడు సెలవులో ఉన్నానంటూ ఇంటినుంచి బైటికి కదలడంలేదు. నీకు ఎప్పుడు స్థిరం వస్తుందో తెలియడంలేదు" అంది.

"స్థిరం అంటే ఏమిటమ్మా?" గీత సాలోచనగా అడిగింది.

"అదికాదు గీత అందరు ఆడపిల్లలు మాదిరిగా నువ్వు కూడా పెళ్ళిచేసుకుని భర్త సంసారం పిల్లలు అంటుంటే చూడాలని ఉంది."

"ఊరుకో అమ్మా ఆడపిల్ల అంటే ఇల్లు, పెళ్ళి తప్ప మరో ఆలోచన ఎవరికీ రాదని అనుకుంటాను" అంది విసుగ్గా.

తల్లి మాటలు విన్న తర్వాత ఆ మాటలే మననం చేసుకుంది.

తను అందరిలాంటి ఆడపిల్లను కాదా? తనలో ఏమైనా ప్రత్యేకత ఉందా? అందుకేనా ఇంతవరకు పెళ్ళికోసం ఆలోచన చేయలేదు అనుకుంది.

అలా ఆలోచిస్తున్న కొద్దీ ఏ పనీ చేయాలనిపించలేదు.

గీతకు తనమీద తనకే కోపం వచ్చింది. మార్గరెట్ విషయం ఎత్తకపోతే ఇటువంటి కల్లోలమే ఎదురయ్యేదికాదు. నిరంతరం విజయం పత్రిక కోసమే ఆలోచిస్తున్న మార్గరెట్ చనిపోతే ఆమె గురించి ఆ పత్రిక ఆలోచించవలసిన అవసరం ఉంది కదా? అలా ఆలోచించమని విజయం యాజమాన్యంపై తను తిరగబడింది.

అలా ఆలోచించిన తర్వాత తాను తీసుకున్న నిర్ణయం ఎంతో సమంజసమైనదని మనసుకు సమాధానం చెప్పుకుంది. అప్పుడు కాస్త సంతృప్తి అనిపించింది. చనిపోయిన మార్గరెట్ కుటుంబంలో వారికెవరికైనా విజయంలో వారసత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరాలని అనుకుంది. ఎంతోమంది వ్యక్తులు చీకటి కోణాలను అవినీతి వ్యవహారాలను బట్టబయలు చేసే పత్రిక అన్యాయాలకు అక్రమాలకు నిలయంగా మారింది. ఈ విషయాలే గీతలో ఎప్పటికప్పుడు ఆవేశాన్ని కలిగిస్తున్నాయి.

సీనియర్ లాయర్ రామలింగశర్మను కలుసుకుంది.

మొత్తం కాగితాలను అందజేసింది. వాటిని కిందా మీదా పరిశీలించి చదివాడు. తర్వాత "నీకేం పర్వాలేదు. విజయం పత్రికను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. చాలా కంపెనీలలో ఇటువంటి అన్యాయాలు జరుగుతుంటాయికానీ సిబ్బంది ఎవరూ ధైర్యంగా ముందుకు రారు. కానీ జరిగిన అన్యాయం కోసం మీరు ధైర్యంగా ముందు రావడం అభినందనీయం."

"నాలో ఉన్నది ధైర్యం కాదండీ. ఆవేశం. ఒకరికి అన్యాయం జరిగిందని నిలదీసినందుకు నన్ను అన్యాయం చేసారు అంటే న్యాయం కోసం మాట్లాడకూడదా? జరిగిన అన్యాయాన్ని ఎదిరించకూడదా? అటువంటప్పుడు నిరంతరం అక్కడ అన్యాయం జరిగింది, ఇక్కడ మోసం జరిగింది అంటూ వార్తలు రాసే విలేకరి ఉద్యోగం చేయడం దండగ. ఏమైనప్పటికీ వదిలిపెట్టేదిలేదు" ఆవేశంగా అంది.

తర్వాత వకాల్తా కాగితాలపై సంతకాలు చేసింది.

"సస్పెన్షను తొలిగించాలని ఆ కాలానికి జీతం ఇవ్వాలని నోటీసు ఇస్తాను. వారినుంచి వచ్చిన రెస్పాన్సు ఆధారంగా తర్వాత చేయబోయే కార్యక్రమం గురించి ఆలోచిద్దాం" లాయరు శర్మ అన్నాడు.

గీత లాయరు ఇంటిలోనుంచి బైటికి వచ్చింది.

చాలామంది అన్యాయాలకు గురి అవుతుంటారు కానీ ఎదిరించడానికి మాత్రం ముందుకు రారు. ఎవరి స్థాయిలో వారు తిరగబడాలి. అప్పుడే న్యాయం నిలబడుతుంది. ఒంటరి పోరాటం చేయడానికైనా సిద్ధపడాలి అనుకుంది గీత.

## 33

కుమారస్వామి పోలీసులకు లొంగిపోవడం, పోలీసులకు అనుకూలంగా నక్సలైట్లకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం అతనితో కలిసి పనిచేసిన సహచరుడు కృష్ణస్వామికి నచ్చలేదు. తనలాంటి మరో ముగ్గురిని కలుపుకుని పాత పంథానే కొనసాగిస్తున్నాడు. ఒకే నెలలో అయిదుగురిని బెదిరించి నాలుగు లక్షలు వసూలు చేసాడు.

ఆరవ వ్యక్తిగా కాంట్రాక్టరు సోమేశ్వరరావును ఎంపిక చేసుకున్నాడు.

సోమేశ్వరరావు అవినీతిపరుడు. పై అధికారులకు తొత్తుగా ఉంటూ అనేక కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. ఏజన్సీలో కొన్నిపనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు పాస్ చేయించుకుంటాడు. అధికారులకు కూడా అందులో వాటా ఉంటుంది.

ఏజన్సీలో అతను నివాశం ఉండటం వల్ల లక్షలాది రూపాయలను సంపాదించగలిగాడు. బినామీ పేర్లతో ఏజన్సీలో లాడ్జీలను కూడా నడుపుతున్నాడు. విశాఖపట్నంలో రెండంతస్తుల బిల్డింగుకు అధిపతిగా ఉన్నాడు.

అటువంటి సోమేశ్వరరావు మీద కృష్ణప్రసాద్ కన్ను పడింది.

ముందు వార్నింగు ఇచ్చాడు. ఫోను చేసి డబ్బులు సిద్ధం చేయమని కోరాడు.

ముందస్తుగా 50వేల రూపాయలు ఇవ్వమని వారం రోజులు గడువు విధించాడు. తీవ్రవాదులంటే సోమేశ్వరరావుకు ఎంతో కొంత సానుభూతి ఉంది. తీవ్రవాద దళాలతో కలిసిపోయిన పడాల్‌తో కాస్త పరిచయం ఉంది. అతను సాధారణ వ్యక్తిగా ఉన్న సమయంలో చాలాసార్లు కలిసాడు. తనకు కృష్ణప్రసాద్ నుంచి వచ్చిన వార్నింగ్ గురించి చెప్పి అతడిని కలిసి కొంత గడువు కావాలని కోరాలని అనుకున్నాడు.

ఆ ఆలోచన రాగానే పడాల్ కోసం వెతుకులాట మొదలుపెట్టాడు.

సాధారణంగా లక్ష్మివారం జరిగే సంతనాడు కొంతమంది నక్సలైట్లు ఆయా గ్రామాలకు వస్తుంటారని అతనికి తెలుసు. వారంలో అవసరమైన మందులను కొనుగోలు చేసి తీసుకుని వెలుతుంటారు. ఆ వారం సంతనాడు కాపు కాసి పడాల్‌ను కలుసుకున్నాడు.

అతనికి మొత్తం విషయాన్ని సోమేశ్వరరావు వివరించాడు.

"వారం రోజుల్లో నా దగ్గర అంత మొత్తం సమకూరడం కష్టం. అడిగిన డబ్బులు ఇవ్వడానికి మరో వారం రోజులు గడువు కావాలి. మీ నాయకుడు కృష్ణప్రసాద్‌కు చెప్పు. ఏమీ అనుకోవద్దు" సోమశ్వరరావు అభ్యర్థించాడు.

విషయం విన్న తర్వాత పడాల్ ఆశ్చర్యపోయాడు.

"డబ్బులు అడిగిన వ్యక్తి ఎలా ఉన్నాడు?" అడిగాడు పడాల్

"నల్లగా బలంగా వత్తు మీసాలతో ఉన్నాడు కళ్ళు ఎర్రగా ఉన్నాయి."

తీవ్రవాదుల్లో అటువంటి పోలికలున్న వ్యక్తి ఎవరున్నారా అని పడాల్ ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు. డబ్బులు ఎలా అడిగాడు. ఎలా అందించమన్నాడు వంటి వివరాలు తెలుసుకున్న తర్వాత అతను మకిలీ నక్సలైటు అన్న విషయం అర్థమైపోయిందని స్వార్థంగా అడవుల్లో పనిచేస్తున్న తమకు చెడ్డపేరు తీసుకు వస్తున్న వ్యక్తి కృష్ణప్రసాద్ అన్న విషయం స్పష్టం అయింది.

"సోమేశ్వరరావుగారు మీరేం గాబరా పడకండి. మావాళ్ళెవరూ అటువంటి పనులు చేయరు. మామీదున్న భయాన్ని కొంతమంది నకిలీలు డబ్బులు సంపాదించడానికి ఉపయోగిస్తున్నారు. అటువంటి వారివల్ల నిస్వార్థంగా పనిచేస్తున్న మా వంటి వారికి చెడ్డపేరు వస్తున్నది. దీనిని కలిసికట్టుగా ఎదుర్కొనవలసిన అవసరం ఉంది. మీరు మాతో సహకరించండి" పడాల్ కోరాడు.

"నక్సలైట్లు కాకుండా వారి పేరుతో మరొకరు డబ్బులు వసూలు చేయడమా?" సోమేశ్వరరావుకు జరుగుతున్న మోసం అర్థం అయిపోయింది.

"అటువంటివారి ఆట కట్టించడానికి మీరు ఏమిచేయమన్నా ఎలా చేయమన్నా చేస్తాను." ధృఢంగా చెప్పాడు.

"పోలీసులకు ఇటువంటి నకిలీల గురించి సమాచారాన్ని అందించాలి. నకిలీలు పట్టుబడగానే వెంటనే పత్రికలవారికి తెలియజేయాలి. ఎందుకంటే ఇటువంటి వసూళ్ళు నక్సలైట్లు చేస్తున్నారన్న అపోహ చాలామందిలో ఉంది. పోలీసులు నక్సలైట్లను టార్గెట్ చేస్తూ ప్రజల్లో అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మీరీ విషయంలో మాతో సహకరించాలి" పడాల్ అభ్యర్థించాడు.

పడాల్‌తో మాట్లాడిన తర్వాత నిజమైన నక్సలైట్ల పట్ల సోమేశ్వరరావుకు కొంత సానుభూతి ఏర్పడింది. డబ్బులకోసం తనను మోసం చేయాలని ప్రయత్నం చేసిన కృష్ణప్రసాద్‌ను పోలీసులకు పట్టించాలని ధృఢంగా నిర్ణయం తీసుకున్నాడు.

పడాల్ చెప్పిన ప్రకారం ఎవరెవరికి సమాచారం అందించాలో అంతా సిద్ధం చేసుకున్నాడు.

"డబ్బు సిద్ధం చేసారా?" కృష్ణప్రసాద్ కబురు చేసాడు.

"సిద్ధంగా ఉంది రండి" సమాధానం చెప్పాడు.

అనుకున్న సమయానికి కృష్ణప్రసాద్ సోమేశ్వరరావు ఇంటికి బయలుదేరాడు. చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్న తర్వాత తలుపు తట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి. డబ్బులు అందుతాయని అనుకున్న అతనికి తీవ్ర నిరాశ ఎదురైంది.

తలుపులు తెరిచిన కృష్ణప్రసాద్‌కు ఆ ఏరియా సబ్ ఇన్స్పెక్టరు ప్రత్యక్షం కావడంతో హతాసుడయ్యాడు.

ఆ మర్నాడు నకిలీ నక్సలైటు కృష్ణప్రసాద్ అరెస్ట్ అయ్యాడన్న వార్త అన్ని పేపర్లలో ప్రముఖంగా పబ్లిష్ అయింది. కృష్ణప్రసాద్ తనతో తిరిగినవారి పేర్లు తన మాదిరిగా వసూళ్ళు చేస్తున్నవారి పేర్లు, వివరాలను వెల్లడించాడు. తన సహచరుడు కుమారస్వామి అన్న విషయాన్ని కూడా విలేకర్ల సమావేశంలో వెల్లడించాడు.

మర్నాడు అన్ని పేపర్లలో అతను చెప్పిన విషయాలు పబ్లిష్ అయ్యాయి.

నకిలీ నక్సలైటు ఉదంతం ఎంతటి సంచలనం కలిగించిందో పోలీసులు లొంగి పోయిన నక్సలైటుగా తమతో తిప్పించుకుంటున్న కుమారస్వామి ఉదంతం కూడా అంతే సంచలనం కలిగించింది.

కుమారస్వామి లొంగిపోయిన తీవ్రవాదిగా చూపించి అన్ని గ్రామాలను పోలీసు జీపులో తిప్పుతున్న కుమారస్వామి గురించి అందరికీ తెలిసిపోయింది. నక్సలైటు ఉద్యమాన్ని నీరు గార్చడానికి పోలీసులు చేస్తున్న ప్రయత్నాలకు గండి కొట్టినట్లయింది.

## 34

శ్యామ్‌సుందర్ ఏ ప్రాంతాలలో ఉద్యోగం చేస్తున్నా ఎంత బిజీగా ఉన్నా ప్రతి రోజూ మార్నింగ్ వాకింగ్ చేయడం అలవాటు. దాంతోనే అతని దినచర్య కూడా మొదలవుతుంది.

ఆ రోజు కూడా అలవాటు ప్రకారం వెలుగు రేఖలు విచ్చుకోకముందే వాకింగుకు బయలుదేరాడు. సెక్యూరిటీని కూడా వెంట తీసుకుని వెళ్ళలేదు. ఆ రోజే మృత్యువు అతడిని కబళించే రోజని అసలు ఊహించలేకపోయాడు.

సన్నగా ఉన్న మట్టిరోడ్డు వెంబడి జాగింగు చేస్తూ వెళుతుండగా జరిగిందా సంఘటన. సమీపంలో చెట్టు పక్కనుంచి ఇద్దరు యువకులు గురి చూసి తుపాకీతో కాల్చారు.

మూడు గుళ్ళు గుండెల్లోంచి దూసుకునిపోయాయి.

ఏదో ఆలోచిస్తూ జాగింగు చేస్తున్న శ్యామ్‌సుందర్‌కి ఏమీ అర్థంకాలేదు. లిప్తపాటు కాలంలో అంతా జరిగిపోయింది. గుండెల్లోంచి ఎర్రటి రక్తం ఎగజిమ్మింది. నేలమీదకు ఒరిగిపోయాడు.

తమ గురి తప్పలేదని డి.ఐ.జి శ్యామ్‌సుందర్ మృతి చెందాడని నిర్ధారణ చేసుకున్న తర్వాత ఆ యువకులు ముందుకు కదిలారు.

తూర్పు తెల్లవారిపోయింది. జనం కదలిక మొదలవడంతో విషయం గుప్పుమంది.

పోలీసు అధికారి హత్య కావడంతో తీవ్రసంచలనం అయిపోయింది. నగరంలో రెడ్ అలర్టు విధించారు.

పోలీసు యంత్రాంగం అంతా అప్రమత్తం అయిపోయింది. నగరం నుంచి వెలుపలికి వెళుతున్న అన్ని వాహనాలపై నిఘా పెట్టారు.

అంతా ఉత్కంఠ.. ఆందోళన.

శ్యామ్‌సుందర్‌ను దారుణంగా హత్య చేసింది నక్సలైట్లేనని అందరూ నిర్ధారణకు వచ్చారు.

పోలీసులు నక్సలైట్ల కోసం మళ్ళీ గాలింపులు ప్రారంభించారు. తమ సహచరుడ్ని కోల్పోయామని అధికారులు తమ అధికారిని కోల్పోయామని పోలీసులు హంతకుల్ని వెతికే ప్రయత్నాలను ముమ్మరం చేసారు.

***ఉపసంహారం***

భీమిలి సముద్రతీరం

ఎగిసిపడుతున్న సముద్రపు అలలను చూస్తూ కూర్చుంది గీతామాధురి.

పురాతన ఓడరేవుగా ప్రసిద్ధి చెందిన భీమిలి తీరంలో అన్ని వాటి ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. గత చరిత్రను తనలో దాచుకున్న పురాతన కట్టడాలు మూడువందల సంవత్సరాల క్రితం నాటి డచ్చివారు ప్రెంచివారి పురాతన పిరమిడ్ మాదిరిగా ఉన్న సమాధులు. సముద్రంలో ప్రయాణించే పడవలకు దారి చూపించే ఎప్పుడో నిర్మించిన లైటు హౌసు విశాఖ ఏజన్సీలో అనంతగిరి కొండల్లో పుట్టి సముద్రంలో కలుస్తున్న గోస్తనీ నది ఉప్పుటేరుగా ఏర్పడిన పెద్ద తటాకం అవన్నీ చూస్తూ ఆలోచిస్తోంది.

శ్రీకాంత్ ఎన్ని గంటలకు వస్తాడు ఎలా వస్తాడు అనే ఆలోచన ఆమె మనసులో పదేపదే మెదులుతోంది. తాను రాసిన ఉత్తరానికి స్పందించి భీమిలీ సముద్రతీరంలో కలుసుకుందామని సమాధానం పంపించాడు. డేటు టైము కూడా చెప్పాడు. అందుకే గీత ఆ సమయానికి అక్కడికి చేరుకుంది.

శ్రీకాంత్‌ని కలిసిన తర్వాత తన నిర్ణయాన్ని తెలియచేయాలి.

అతని స్పందన ఎలా ఉంటుంది? తాను తీసుకున్న నిర్ణయం తప్పకుండా అతనిలో ఆనందాన్ని కలిగిస్తుందని మనసు చెబుతోంది.

సాయంత్రం గాలి చల్లగా శరీరానికి తగులుతోంది.

సముద్రతీరం విశాలంగా ఉండటంతో చాలామంది కెరటాలకు ఎదురుగా ఇసుకలో దూరదూరంగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు, మనుష్యుల మధ్య ఏకాంతం అంటే ఇదేనేమో. అందుకే శ్రీకాంత్ ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాడని అనిపించింది.

ఇసుకలో అడుగుల చప్పుడు లయబద్ధంగా వినిపించడంతో గీత తలెత్తింది.

ఎదురుగా శ్రీకాంత్. తల కనిపించకుండా మఫ్లరు చుట్టుకున్నాడు.

అతడిని చూడగానే మనసులో ఏదో తెలియని అలజడి అనిపించింది. ఆత్మీయుడ్ని, సన్నిహితుడ్ని చూసినట్లు అనిపించింది. "బాగున్నావా?" ప్రశ్నించింది.

"నువ్వెలా ఉన్నావు?" తిరిగి ప్రశ్నిస్తూ ఇసుకలో కూర్చుండిపోయాడు.

"చూస్తున్నావు కదా ఇలా ఉన్నాను. ఇప్పుడు విలేకరిని కాదు."

"ఏం? ఏమైంది?"

"విజయం యాజమాన్యం నన్ను విలేకరి ఉద్యోగం నుంచి తొలగించింది. ముందు సస్పెండు చేసారు. నేను లాయర్ నోటీసు ఇచ్చాను. తర్వాత వారు డిస్మిస్ చేసారు. లాయరుతో మళ్ళీ సంప్రదించాను. ఉద్యోగం మారి రాదని లాయరు స్పష్టంగా చెప్పాడు. కంపెనీ రూల్సులో ఒక క్లాజు అడ్డంకిగా ఉందని తను ఏమీ చేయలేనని అన్నాడు ఆ తర్వాత తెలిసింది. ఎంగిలి మెతుకులకు ఆశపడ్డ లాయరు మా ఎండీతో చేతులు కలిపాడని మరో లాయరు ద్వారా ప్రయత్నించడానికి కూడా అవకాశం లేకుండా అయిపోయింది. జరిగిన విషయాన్ని తలచుకుంటుంటే రక్తం మరిగిపోతోంది. ఎవరిమీదో చెప్పలేని కసి కోపం తన్నుకుని వస్తున్నాయి. నీకు ఉత్తరం రాసిన తర్వాత జరిగిన మార్పులను నీకు ఎప్పుడు చెబుదామా అని మనసు తహ తహలాడుతోంది" అంది

"పోనీలే గీతా ఉద్యోగం పోయినందుకు బాధపడకు. ఇంకొకరి చేతికింద పనిచేసే బాధ తప్పిపోయిందని సంతోషించు."

శ్రీకాంత్ మాటలకు గీత విసురుగా తలెత్తింది. "నువ్వేనా ఈ మాటలు అంటున్నది? నా మాటలు విన్న తర్వాత మా ఎండీని షూట్ చేద్దామని అంటావని నేను అనుకున్నాను. కానీ నీలో ఇంత నిరాశావాదం వచ్చిందేం?"

"నిరాశావాదం కాదు గీతా. నీ వ్యక్తిత్వం నిలబడాలంటే నువ్వు మరొకరి కింద పనిచేయడం ఎందుకు? నువ్వే పత్రికను పెట్టినట్లయితే రకరకాల వార్తలు రాయవచ్చు. ఎవరికీ భయపడనవసరం లేదు. అనేక నిర్ణయాలు నువ్వే తీసుకోవచ్చు."

"సొంతగా పత్రిక పెట్టాలంటే ఎంతో డబ్బు కావాలి. ఓర్పు కావాలి. నేర్పు కావాలి. అవన్నీ సమకూర్చుని నడపాలంటే చాలా కష్టపడాలి"

"నీకు అన్నీ ఉన్నాయి కదా?"

"అమ్మని వృద్ధాశ్రమంలో చేర్చాలనుకుంటున్నాను."

"ఎందుకు గీతా?"

"ఎందుకంటే నేను నీతో కలవాలని అనుకుంటున్నాను. నువ్వు నడిచే మార్గంలో నీతో నడుద్దామని నిర్ణయించుకున్నాను. అంటే నక్సలైటుగా మారదామని అనుకుంటున్నాను. సమాజంలో ఎన్నో అన్యాయాలు, అక్రమాలు జరుగుతుంటే వాటిని చూస్తూ ఊరుకోలేకపోతున్నాను. ఎదిరించాలని, పోరాడాలని నా మనసు పదే పదే కోరుకుంటోంది. అందుకే నేనూ ఉద్యమంలో చేరిపోవాలని అనుకుంటున్నాను. ధనవంతులతోనూ, బలవంతులతోనూ అణగదొక్కబడుతున్న అన్నార్తుల పక్షాన నిలబడి పోరాడాలని అనుకుంటున్నాను. నా జీవితం ఏమైపోయినా పర్వాలేదు కానీ ఇతరులకు ఉపయోగపడాలి."

గీతామాధురి మాటలు శ్రీకాంత్‌లో విపరీతమైన ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"ఏమిటి గీతా నువ్వేనా ఈ మాటలు అంటున్నది?" అడిగాడు నెమ్మదిగా.

"అవును శ్రీకాంత్ నేను గీతగానే మాట్లాడుతున్నాను. చాలా రోజులు ఆలోచించే ఈ నిర్ణయాన్ని తీసుకున్నాను. అన్యాయాన్ని ఎదిరించడానికి ఏమి చేయాలో తెలియక తుపాకీ పట్టాలని అనుకుంటున్నాను. నువ్వొకసారి నాతో అన్నావు నిజమే. ఈ వ్యవస్థలో

అన్యాయాలు అక్రమాలు గంజాయి మొక్కల్లా విస్తరించాయి. వాటిని నిర్మూలించకపోతే వ్యవస్థ అంతా విస్తరిస్తాయి. గంజాయి వనాలు ఉండకూడదు.''

శ్రీకాంత్ ఏమీ మాట్లాడలేదు.

దూరంగా సముద్రంలో కెరటాలు నురగలు కక్కుతూ ముందుకు రావడం విరిగి పడి మళ్ళీ వెనక్కి వెళ్ళడం చూస్తుండిపోయాడు.

గీత కూడా చాలా సేపు ఏమీ మాట్లాడలేదు.

''నీ నిర్ణయం నువ్వు చెప్పావు. నా నిర్ణయాన్ని కూడా నీతో చెప్పాలని అనుకుంటున్నాను చెప్పేదా?''

''ఏమిటి చెప్పు.''

''అదే గీతా ఇంతవరకు తీవ్రవాద ఉద్యమంలో ఉన్న నేను అందులో నుంచి బైటపడి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలనుకుంటున్నాను'' అన్నాడు.

''వ్వాట్?'' గీతలో ఆశ్చర్యం.

''అవును గీతా ఉద్యమాలతో విసిగిపోయాను. ఒకర్ని ఒకరు చంపుకోవడం అజ్ఞాతంగా దాక్కుని ఎంతకాలం పోరాటం చేస్తాం? అనిపించింది.

గీత ఒక క్షణం మాట్లాడలేదు. తర్వాత ''నువ్వే ఇలా అంటే నిన్నునమ్ముకున్నవారు నీ అనుచరులు ఏమైపోతారు? వారి ప్రేమ అభిమానం మళ్ళీ పొందగలమా?''

''వారికి అభిమానం నామీద కన్నా నా దగ్గరున్న డబ్బుమీద ఉంది. ఉద్యమాన్ని విస్తరించడం కోసం చాలా సొమ్ముని సేకరించాం. దానిని రహస్య ప్రదేశంలో దాచాం. దానిని డంపు అంటాం. భూమిలో పాతిపెట్టిన సమయంలో పోలీసులు నన్ను పట్టుకున్నారు. అది ఎక్కడుందో నాకు మాత్రమే తెలుసు. అందుకే నన్ను విడిపించడం కోసం శాసనసభ్యుడ్ని కిడ్నాప్ చేసారు.''

''అవునా?''

''నిజం గీతా నేను పూర్తిగా విసిగిపోయాను. ఈ సమాజం పట్ల ఎటువంటి కసిని పెంచుకుని నువ్వు నక్సలైటుగా మారాలని అనుకుంటున్నావో అటువంటి కసితోనే నేను అక్కడినుంచి బైటికి రావాలని అనుకుంటున్నాను.''

''చాలా చిత్రంగా ఉంది శ్రీకాంత్. ఇక్కడున్న అన్యాయాలపై డైరెక్టుగా తిరుగుబాటు చేయలేక నేను నక్సలైట్‌గా మారాలని అనుకుంటుంటే నువ్వు అటువైపు నుంచి ఇటువైపు వస్తున్నావు.''

''నేను తెలుసుకున్నది ఒక్కటే గీతా! అడవుల్లో ఎవరికీ కనిపించకుండా ఏ కొద్దిమంది గిరిజనుల కోసం అన్యాయం జరుగుతుందని వారి కోసం పోరాటం చేయడం సరికాదు అనిపిస్తోంది. అడ్డు వచ్చిన పోలీసుల్ని శత్రువులుగా భావించడం వారిని తుద ముట్టించడం అక్కడినుంచి అసలు సమస్య కాకుండా వర్గ శత్రునిర్మూలన కోసం చంపుకోవడం నాకు ఎందుకో నచ్చలేదు.''

గీత అతని మాటలు వింటుండిపోయింది.

శ్రీకాంత్ తన మాటల్ని కొనసాగిస్తూ ''గంజాయి మొక్కలు అడవుల్లో లేవు. ఈ వ్యవస్థలోనే ఉన్నాయి. రెడ్‌టేపిజం, బ్యూరోక్రసీ, అవినీతి, లంచగొండితనం బలహీనుల్ని బలవంతులు లొంగదీసుకోవడం డబ్బులున్నవారు డబ్బులతో ఏమైనా చేయగలమని అనుకోవడం ఈ సమాజంలోనే జరుగుతున్నాయి. వాటిని ఎదిరించకుండా మనం పలాయనవాదం చూపించడం నాకు నచ్చలేదు. ఈ కుళ్ళు వ్యవస్థను మార్చడానికి అడవుల్లో అజ్ఞాతంగా కాకుండా ఈ వ్యవస్థలోనే తీవ్రవాదులుగా మారవలసిన అవసరం ఉంది'' ఆవేశంగా శ్రీకాంత్ చెప్పాడు.

గీత ఏమీ మాట్లాడలేదు.

"అన్యాయాలను ఎదిరించడానికి అక్రమాలను నిరోధించడానికి అందర్నీ సమాయత్తం చేయడానికి ఒక పత్రికను పెట్టు. దానికి అవసరమైన పెట్టుబడి నేను పెడతాను. సమాజంలో పేరుకుపోయిన అన్యాయాలు అక్రమాలను కలిసికట్టుగా మనం ఎదుర్కొందాం. ప్రతి ఒక్కరికి ఒక సింధూరం బొట్టుపెట్టి ఈ సమాజంలోనే అవినీతి, అన్యాయాలపై పోరాడే తత్వాన్ని నేర్పిద్దాం. ప్రతి వ్యక్తిలోను చైతన్యాన్ని తీసుకుని వద్దాం. చైతన్యం వచ్చిన ప్రతివారూ ఆలోచిస్తాడు తిరగబడతాడు. వారికి ఆ స్ఫూర్తిని కలిగించవలసిన బాధ్యత మనమీద పెట్టుకుందాం. అందుకోసం నడుం బిగిద్దాం గంజాయి మొక్కల్ని ఈ సమాజం నుంచి ఏరి పారేయడానికి ముందుకు కదులుదాం" శ్రీకాంత్ అవేశంగా చెప్పుకుని పోతూనే ఉన్నాడు.

గీత విస్మయంగా వింటోంది.

శ్రీకాంత్ మాటల్లో వాస్తవాలు ఆమెకు కనిపిస్తున్నాయి గంజాయి వనాలను నిర్మూలించడానికి చేయి కలపాలని మనసు తహ తహలాడింది.